విరుచుకుపడిన ఇరాన్



పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు

దుబాయ్‌పై భీకర దాడులు

కువైట్ ఎయిర్‌పోర్టుపైనా అటాక్ > ||

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

సోమవారం MONDAY 16.3.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 || సంచిక (Issue): 280 || వెల (Price) రూ.6.50 | ద్వాదశి

సోమవారం, సూర్యోదయం: 6-23, సూర్యాస్తమయం: 6-26. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం శిశిర రుతువు ఫాల్గుణ మాసం కృష్ణ పక్షం తిథి: ద్వాదశి ఉదయం 9-42 వరకు, తదుపరి త్రయోదశి. నక్షత్రం: ధనిష్ఠ పూర్తి. వర్జ్యం: ఉదయం 10-00 నుంచి ఉదయం 11-47 వరకు. రాహుకాలం: ఉదయం 7-54 నుంచి ఉదయం 9-24 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-48 నుంచి పగలు 1-36 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-13 నుంచి సాయంత్రం 4-01 వరకు. అమృతకాలం: రాత్రి 7-46 నుంచి రాత్రి 9-24 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



యాసంగి సీజన్ ముగింపునకు వచ్చినా రైతుభరోసా వేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) గ్రామస్తులు ఆదివారం వినూత్న నిరసనకు దిగారు. ప్రస్తుత యాసంగిలో పండించిన గోధుమ సంచుల మీద మోకాళ్లపై నిలబడి పంట పెట్టుబడిసాయం ఇంకెప్పుడిస్తారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఒక్క ఎకరానికే భరోసా!

22న తొలి విడత పంపిణీ.. మిగతా ఎకరాలకు ఎప్పుడో!

ఎకరానికి రూ.7500 ఇస్తానంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇంతవరకు ఆ హామీని అమలు చేయకపోగా.. ఇస్తున్న రూ.6వేలనూ సకాలంలో పంపిణీ చేయలేక ఆపసోపాలు పడుతున్నది. నాట్లప్పుడు అందించాల్సిన పెట్టుబడి.. కోతల కాలానికీ ఇవ్వలేకపోతున్నది. సర్కార్ కాలయాపన పథకం అమలుపైనే అనుమానాలను పెంచాయి.

యాసంగి రైతుభరోసా పంపిణీ చేసేందుకు ఎట్టకేలకు మరో తేదీని ప్రకటించింది రేవంత్ ప్రభుత్వం. ఈ నెల 22 నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించింది. అయితే పెట్టుబడిని మూడు వాయిదాల్లో చెల్లిస్తామన్న ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- 3 వాయిదాలుగా రైతుభరోసా.. కొత్త విధానం తెచ్చిన కాంగ్రెస్
- 20 రోజుల అనంతరమే రెండో విడత పంట పెట్టుబడి సాయం
- ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేస్తామంటూ ప్రభుత్వం కొత్త డెడ్‌లైన్
- రైతుల ఆగ్రహం, బీఆర్‌ఎస్ నిలదీతలతో తప్పనిస్థితిలో నిర్ణయం
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో చర్చను డైవర్ట్ చేసే ప్రయత్నం
- యాసంగి రైతుభరోసా డిసెంబర్ నుంచి పలుమార్లు వాయిదా
- ఎన్ని ఎకరాలకు ఎప్పుడు ఖాతాలో వేస్తారో కొరవడిన స్పష్టత

హైదరాబాద్, మార్చి 15(నమస్తే తెలంగాణ): యాసంగి రైతుభరోసా నిధుల విడుదల విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్న సర్కార్.. అనూహ్యంగా కొత్త విధానం తీసుకొచ్చింది. రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో ఒకేసారి కాకుండా మూడు విడతలుగా జమ చేయాలని నిర్ణయించింది. ఈ నెల 22న తొలి విడత నిధులను జమ చేయనున్నది. రైతులు అందరికీ ఒక ఎకరం చొప్పున మాత్రమే విడుదల చేయనున్నది. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా రైతులకు తొలి విడత డబ్బులు జమ చేస్తామని ప్రకటించింది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు నిధులను ఒకేసారి విడుదల చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే విధానం అనుసరించింది. గత వానకాలంలో తొమ్మిది రోజుల్లోనే అందరికీ రైతుభరోసా > 2వ పేజీలో

సేవ్ తెలంగాణతో అసెంబ్లీకి!

సభలో పోరుకు గులాబీ దళం సన్నద్ధం

- శాసనసభ, మండలిలో సర్కార్ తీరును ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ కసరత్తు
- సాధ్యమైనంత వేగంగా సమావేశాలు ముగించాలనే ఆలోచనతో ప్రభుత్వం
- గోదావరి జలాలు, మూసీ, సింగరేణిపై చర్చకు పట్టుబట్టనున్న ప్రధాన ప్రతిపక్షం
- రైతు భరోసా, మహిళలకు 2,500, పింఛన్లపై నిలదీసేందుకు సమాయత్తం
- 20న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి
- 30 లోపు ద్రవ్యవినిమయ బిల్లు పాస్
- ఈసారీ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక డౌటే!



హైదరాబాద్, మార్చి15 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీలు, గోదావరి నదీ జలాల వివాదం, మూసీ సుందరీకరణ, గాంధీ సరోవర్ ప్రాజెక్టు తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చకు పట్టుబట్టేందుకు ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్ సిద్ధమవుతున్నది. అయితే, సాధ్యమైనంత తొందరగా అసెంబ్లీ సమావేశాలను ముగించాలన్న ఆలోచనతో అధికార పక్షం కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తున్నది. గరిష్ఠంగా 10 పని దినాల్లోనే సభను ముగించాలని అధికార పక్షం నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులోనే గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానం, రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించడం తదితర అంశాలను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ నెల 20న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి, 29 లేదా 30వ తేదీల్లో ద్రవ్య వినిమయ బిల్లు పాస్ చేయించి, సభను వాయిదా వేసే విధంగా వ్యూహరచన చేసినట్టు తెలిసింది. ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా జాప్యం, సింగరేణి బొగ్గు గనుల అవినీతి, ఫిరాయింపు > 2వ పేజీలో

నేటి నుంచి అసెంబ్లీ

ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్

రాష్ట్ర శాసనసభకు తొలిసారి రానున్న శివప్రతాప్ శుక్లా



5 రాష్ట్రాల ఎన్నికలకు మోగిన నగారా

- కేరళ, అస్సాం, పుదుచ్చేరికి ఏప్రిల్ 9న, తమిళ నాడుకు 23న ఒకే దశలో పోలింగ్
- బెంగాల్‌లో 2 విడుతల్లో అసెంబ్లీ ఎన్నికలు
- మే 4న అన్ని రాష్ట్రాల ఫలితాలు ప్రకటన > ||
- కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల

ఎన్నికల షెడ్యూల్ ఇదీ

రాష్ట్రం/యూటీ	సీట్లు	పోలింగ్
వెస్ట్ బెంగాల్	294	ఏప్రిల్ 23, 29
తమిళ నాడు	234	ఏప్రిల్ 23
అస్సాం	126	ఏప్రిల్ 9
కేరళ	140	ఏప్రిల్ 9
పుదుచ్చేరి	30	ఏప్రిల్ 9

ఎన్నికల ఫలితాలు- మే 4

దేశంలో ఐదు రాష్ట్రాలు/యూటీలకు ఎన్నికల నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం షెడ్యూల్ ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరికి ఏప్రిల్ 9న, తమిళనాడుకు 23న ఒకే దశలో పోలింగ్ జరుగనున్నది. పశ్చిమబెంగాల్‌కు మాత్రం రెండు విడతల్లో ఏప్రిల్ 23, 29న ఎన్నికలు జరుగనున్నాయి. మే 4న అన్ని రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆదివారం మీడియా సమావేశంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు.

ధరల మోత.. సబ్సిడీ మేత!



వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో అక్రమాలు

- బహిరంగ మార్కెట్‌తో పోల్చితే సబ్సిడీ పథకంలోనే అధిక ధరలకు సాగు పరికరాలు
- రైతుకు దక్కని సబ్సిడీ.. అధికారులకు కాసులు
- కంపెనీల ప్రతినిధులతో కుమ్మక్కై అవినీతి
- కమీషన్లు దండుకుంటున్న యంత్రాంగం

హైదరాబాద్, మార్చి 15(నమస్తే తెలంగాణ): రైతులకు లాభదాయకంగా ఉండాల్సిన సబ్సిడీ పథకం రాష్ట్రంలో అందుకు విరుద్ధంగా కొనసాగుతున్నది. రైతులకు సబ్సిడీ యంత్రాల ధరలు బహిరంగ మార్కెట్‌తో పోల్చితే లబ్ధిదారులకు ఎలాంటి ఉపయోగకరంగా లేదు. నేరుగా తయారీ కంపెనీలే సరఫరా చేస్తుంటే ధరలు సైతం తక్కువగా ఉండాలి. కానీ అలా జరగడం లేదు. అధికారులు వైట్‌కాలర్ కుంభకోణానికి పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు ఉపయోగపడాల్సిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీల ప్రతినిధులతో కుమ్మక్కైన అధికారులు > 2వ పేజీలో

సాగు యంత్రాల రేట్లలో వ్యత్యాసం

యంత్రం	మార్కెట్లో గరిష్ఠ ధర	సబ్సిడీ పథకంలో ధర
రోటోవేటర్	రూ.1.20లక్షల	రూ.1.40లక్షలు
స్ట్రా బేలర్	రూ.3.20లక్షలు	రూ.3.60లక్షలు
తైవాన్ బ్యారటీ స్ప్రేయర్లు	రూ.3,000	రూ.4,000
మరోరకం స్ప్రేయర్లు	రూ. 14,370	రూ.20,500



గ్యాస్.. గోస

- బ్లాక్‌లో వాణిజ్య సిలిండర్ 5వేలు.. డొమెస్టిక్ రూ.3500
- ఏజెన్సీల వద్ద చాంతాడంత క్యూలు.. దేశమంతా ఒకే దృశ్యం
- 8 గంటలు లైన్‌లో నిల్చున్నా ఎల్పీజీ సిలిండర్ దొరకని దుస్థితి
- ఫార్మాపైనా ఎఫెక్ట్.. ఆగిపోనున్న మందులు, సిరంజీల ఉత్పత్తి

దేశంలో గ్యాస్ సంక్షోభం మరింత తీవ్రమవుతున్నది. ఎటుచూసినా సిలిండర్ కోసం తండ్లాటే కనిపిస్తున్నది. సంక్షోభం అదనుగా బ్లాక్ మార్కెట్ సామాన్యుడిపై పంజా విసురుతున్నది. గ్యాస్ సిలిండర్ ధరను మూడు నుంచి ఐదురెట్లు పెంచేసింది. ఇప్పటికే హోటళ్లు, హాస్టళ్లు మూతపడుతుండగా.. తాజాగా పారిశ్రామికరంగంపైనా గ్యాస్ క్రైసిస్ ప్రభావం చూపుతున్నది. > ||

మరో జలసంధి మూసివేత?

- బాబ్ అల్-మండెబ్‌ను మూసివేస్తామని హౌతీల హెచ్చరిక
- హోర్ముజ్ క్లోజ్‌తో ఇప్పటికే సంక్షోభంలో ప్రపంచ దేశాలు > ||

బెనిఫిట్స్ రాక రిటైర్డ్ జేఎల్ మృతి

- ఉపిరితిత్తుల మార్పిడికి రూ.1.2 కోట్లు ఖర్చు
- బకాయిల కోసం సర్కార్‌కు పలుమార్లు విజ్ఞప్తి
- అయినా స్పందించని కాంగ్రెస్ ప్రభుత్వం
- బెనిఫిట్స్‌పై బెంగతోనే కన్నుమూత: కుటుంబం

ఉద్యోగ విరమణ అయినా చేతికందని బెనిఫిట్స్.. ఎప్పుడు చెల్లిస్తుందో చెప్పలేని ప్రభుత్వం.. నెలల తరబడి ఎదురుచూపులోనే ప్రాణాలు పోతున్నాయి. బకాయిలను చెల్లించని సర్కారు కారణంగా మరో రిటైర్డ్ ఉద్యోగి కన్నుమూశారు. అనారోగ్యం కబళిస్తున్నా.. ప్రభుత్వం నుంచి కదలిక లేకపోవడంతో ఖమ్మం జిల్లాకు చెందిన రిటైర్డ్ జూనియర్ లెక్చరర్ శ్రీధర్ మృతిచెందారు.



ఖమ్మం అర్బన్, మార్చి 15: మరో రిటైర్డ్ ఉద్యోగి మరణించారు. అనారోగ్యానికి తోడు ఆర్థిక సమస్యల కారణంగా ఒత్తిడికి గురై ప్రాణాలు వదిలారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంలో నివాసం ఉంటున్న శ్రీధర్.. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేసి 2024 నవంబర్ 30న రిటైర్ అయ్యారు. ఈయన గతంలో > 6వ పేజీలో



నర్మెటలో ప్రారంభానికి సిద్ధమైన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

కేసీఆర్ సంకల్పంతో సాకారం

సిద్దిపేట జిల్లా నర్మెటలో ప్రారంభానికి సిద్ధమైన ఆయిల్‌పామ్ పరిశ్రమ

- 62 ఎకరాల్లో మలేషియా టెక్నాలజీతో నిర్మాణం
- రూ.300 కోట్లు ఖర్చు చేసిన బీఆర్‌ఎస్ సర్కార్
- హరీశ్ పర్యవేక్షణలో వేగంగా పూర్తయిన ఫ్యాక్టరీ
- రాష్ట్రంలో 2.91 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు
- 22న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అదేరోజు 40 కోట్లతో రిఫైనరీ మిల్లుకు శంకుస్థాపన

సిద్దిపేట, మార్చి 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వ్యవసాయంలో మూస పద్ధతులు వీడి.. రైతులకు కొత్త సాగు దారులు చూపించి ఆర్థికంగా నిలదొక్కుకొనేలా చేసేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషికి మరో ఫలితమిది. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ చేపట్టిన పనులు ఇవ్వాళ రైతుల కండ్ల ముందు కదలాడుతున్నాయి. ఆయిల్ పామ్ అంటే ఏమిటో తెలియని ఈ ప్రాంత రైతులకు పరిచయం చేసి ఈ ప్రాంతంలో > 2వ పేజీలో

ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ నియామకాలకు బ్రేక్!

- ఎలక్ట్రిక్ బస్సుల రాకతో తాత్కాలికంగా రద్దు?
- 6 నెలలుగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు
- నేటికీ ఉలుకూ పలుకులేని రిక్రూట్‌మెంట్ బోర్డు
- తీవ్ర ఆందోళనలో 55 వేల మంది అభ్యర్థులు



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో కొత్తగా చేపట్టే ఉద్యోగ నియామకాలు పూర్తిగా ఆగిపోయినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే చేపట్టిన డ్రైవర్, శ్రామిక్ పోస్టుల నియామకాలను తాత్కాలికంగా రద్దు చేయాలని అధికారులు యోచిస్తున్నట్టు సమాచారం. ఆర్టీసీలో కొత్తగా 3,038 నియామకాలు చేపడతామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పటివరకు కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. రెగ్యులర్ ప్రాతిపదికన నియమిస్తామని చెప్పిన ఉద్యోగాల్లో డ్రైవర్, శ్రామిక్ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చింది. వాటిలో కేవలం 1,000 డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ పోస్టులు ఉన్నాయి. గత అక్టోబర్‌లో నోటిఫికేషన్ వెలువడిన ఈ పోస్టులకు > 3వ పేజీలో



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో ఏర్పాటు చేసిన పామాయిల్ ఫ్యాక్టరీలోని మిషనరీ



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో పామాయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్‌పామ్ గెలలను నిల్వ చేసిన ప్రాంతం



ఫ్యాక్టరీలో ఏమేం ఉంటాయంటే!

- క్రూడ్ పామాయిల్ మిల్లు
- పామ్ కెర్నల్ ఆయిల్ మిల్లు
- విద్యుత్ ఉత్పత్తి కోసం కో జనరేషన్ ప్లాంట్
- వ్యర్థాల రీసైక్లింగ్‌కు కండెన్సేషన్ ప్లాంట్
- క్రూడ్ పామాయిల్ రిఫైనరీ మిల్లు

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వివరాలు

- **నిర్మించింది:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- **ప్రాంతం:** సిద్దిపేట జిల్లా నర్మెట
- **విస్తీర్ణం:** 62 ఎకరాలు
- **పనులు ప్రారంభం:** 2022, ఏప్రిల్ 13
- **ఖర్చు చేసిన నిధులు :** రూ.300 కోట్లు
- **సామర్థ్యం :** 40 వేల ఎకరాల దిగుబడి
- **రిజర్వాయర్ సామర్థ్యం:** 10 కోట్ల లీటర్లు
- **ఉపాధి:** ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా 2 వేల మందికి

కేసీఆర్ సంకల్పం సాకారం

మొదటిపేజీ తరువాయి...

అయిల్‌పామ్ తోటలు పెంచేలా రైతులకు కేసీఆర్ వెన్నుదన్నుగా నిలిచారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బీజం పడింది. కేసీఆర్ నాయకత్వంలో అంకురార్పణ చేసి బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిరంతర పర్యవేక్షణ, క్షేత్ర స్థాయి పర్యటనలు, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయడంతో నేడు పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభానికి సిద్ధమైంది. కాలుష్య రహితంగా ఫ్యాక్టరీ నిర్మించారు. నిరుడు సెప్టెంబర్‌లో ట్రయల్ రన్ చేశారు. మలేషియా నుంచి వచ్చిన అంతర్జాతీయ కన్సల్టెంట్ బృందం రెండు రోజుల పాటు ఫ్యాక్టరీలోని అన్ని యంత్రాలను పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించింద. ఇప్పటికే బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బృందం ఫ్యాక్టరీ పనులు, ట్రయల్ రన్ విధానాన్ని పరిశీలించింది.ఈ నెల 20 నుంచి 22 వరకు ఇక్కడ రైతు మేళా నిర్వహించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. రైత మేళా ముగింపు కార్యక్రమం, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ఈనెల 22న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. అదే రోజు రూ. 40 కోట్లతో రిఫైనరీ మిల్లుకు శంకుస్థాపన చేయనున్నారు.

విత్తనం నాటింది బీఆర్‌ఎస్ సర్కారే..

విత్తనం నాటింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమైతే పండ్లు తినేందుకు కాంగ్రెస్ సర్కార్ బయలు దేరింది. మొక్కపెట్టింది, అధ్యయనం చేయించింది. ఫ్యాక్టరీ మంజూరు చేసింది కేసీఆర్ ప్రభుత్వం కాగా కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు ప్రారంభిస్తున్నది. పామాయిల్‌కు పుట్టినిల్లు మలేషియా కాగా అక్కడి టెక్నాలజీ బాగుందని ఇక్కడ అందుబాటులోకి తెచ్చారు. దేశంలో ఏ పామాయిల్ ఫ్యాక్టరీకి అయినా వంద టన్నుల గెలలు పంపితే 19 టన్నుల ఆయిల్ మాత్రమే వస్తుంది. కానీ ఈ ఫ్యాక్టరీలో 100 టన్నుల గెలలకు 20 టన్నుల పామాయిల్ ఉత్పత్తి అవుతుంది. ఈ లాభాలన్నీ రైతుకే అందుతాయి. ఇప్పటికే గోద్రేజ్, నవభారత్, పతంజలి కంపెనీలు వచ్చి ఇక్కడి టెక్నాలజీని చూసి వెళ్లాయి. ఫ్యాక్టరీ నిర్మాణంలో కాంగ్రెస్ సర్కార్ పాత్ర ఏమాత్రం లేకున్నా.. అంతా సిద్ధమైన తర్వాత ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తుండటంపై స్థానిక రైతులు పెదవి విరుస్తున్నారు.

62 ఎకరాల విస్తీర్ణంలో ఫ్యాక్టరీ

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట శివారులో 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలి రిఫైన్డ్ పామాయిల్ ఫ్యాక్టరీని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించింది. 2022, ఏప్రిల్ 13న ప్రాజెక్టుకు అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఆర్థిక మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు భూమి పూజ చేశారు. భూసేకరణ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో ఎప్పటి కప్పుడు హరీశ్‌రావు పరిశీలించి పనులను వేగవంతం చేయించారు. తొలి నాలుగు పంటల దిగుబడి చేతికి రావడంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నర్మెటలోనే కొనుగోలు చేయించారు. రైతులు తమ పంట దిగుబడిని తీసుకవచ్చి నర్మెట ఫ్యాక్టరీ వే బ్రిడ్జి వద్ద తూకం వేస్తున్నారు. పంట దిగుబడి డబ్బులు రైతుల ఖాతాలో జమవుతున్నాయి. రైతుల పొలాల నుంచి నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వరకు దిగుబడులు తెచ్చేందుకు రవాణా ఖర్చును కూడా రాష్ట్ర ఆయిల్ ఫెడ్ భరిస్తున్నది.

అత్యాధునిక టెక్నాలజీ

నర్మెట ఫ్యాక్టరీని అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి నిర్మించారు. ఈ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో నూనె ఉత్పత్తి చేయడమే కాదు.. రిఫైనరీని పెట్టి తుది ఉత్పత్తి ఇక్కడి నుంచే నేరుగా మార్కెట్‌లోకి పంపేలా ఏర్పాట్లు చేశారు. ఆయిల్‌పామ్ పండ్ల గుజ్జు నుంచి ముడి నూనె తీసి రిఫైన్డ్ చేసి పామాయిల్‌ను ప్యాకెట్స్ రూపంలో మార్కెట్‌లోకి తెస్తారు. 10 కోట్ల లీటర్ల నిలువ సామర్థ్యంతో నీళ్ల ట్యాంకు ఏర్పాటు చేశారు. ఆయిల్‌పామ్ గెలల నుంచి వెలువడే బయోమాస్ వ్యర్థాలతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు. 4 మెగావాట్ల సెల్ఫ్ జనరేషన్ విద్యుత్తుఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒక్క యూనిట్‌కు రూ.1.50 మాత్రమే ఖర్చుతో విద్యుత్తు ఉత్పత్తి కానుండటంతో భారం తప్పనున్నది. వాడిన నీటిని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా రీ సైకిల్ చేసే పద్ధతి కూడా ఉన్నది. ఈ ఫ్యాక్టరీలో మొదట గంటకు 30 టన్నుల గెలల క్రషింగ్ సామర్థ్యం, గెలల పరిమాణం పెరుగుతున్న కొద్దీ క్రషింగ్ సామర్థ్యాన్ని గంటకు 120 టన్నులకు పెంచుకునే వీలు కల్పించారు. గంటకు 120 టన్నుల గెలల క్రషింగ్ సామర్థ్యంతో ఫ్యాక్టరీ కట్టడం దేశంలోనే తొలిసారి.

కేంద్ర బిందువుగా ఫ్యాక్టరీ

ఈ పరిశ్రమ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు కేంద్ర బిందువుగా ఉంటుంది. సిద్దిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల నుంచి వచ్చే ఆయిల్ పామ్ గెలలను క్రషింగ్ చేస్తుంది. గెలల క్రషింగ్ ద్వారా వచ్చే ముడి పామ్‌ఆయిల్‌ను శుద్ధి చేసేందుకు రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పామాయిల్ రిఫైనరీ కూడా ఏర్పాటు చేయబోతున్నారు. రూ.40 కోట్లతో పనులకు 22న భూమి పూజ చేస్తారు. ప్లాంట్ నుంచి ఎలాంటి వ్యర్థాలు రాకుండా జీరో లిక్విడ్ డిశ్చార్జిని నెలకొల్పారు. అదే నీటిని రీసైక్లింగ్ పద్ధతి ద్వారా వాడుకుంటారు. ఈ ఫ్యాక్టరీతో అనేక ప్రయోజనాలున్నాయి. ఇక్కడే వంట నూనె తయారు చేస్తారు. కాయల నుంచి వచ్చే పీచుతో పరుపులు తయారు చేస్తారు. వ్యర్థాలను చేపల ఎరువు, బయోగ్యాస్‌కు ఉపయోగిస్తారు. ఈ ఆయిల్‌పామ్ మిల్లు ఏర్పాటుతో ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా 2000 మందికి ఉపాధి దొరకనున్నది.

రాష్ట్రంలో ప్రాసెసింగ్ మిల్లులు

ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగూడెం జిల్లాలో ఆయిల్‌ఫెడ్ స్థాపించిన రెండు ప్రాసెసింగ్ మిల్లులు ఉన్నాయి. మరో 6 మిల్లులు (కల్లూరుగూడెం-ఖమ్మం, కొణిజర్ల- ఖమ్మం, బీచుపల్లి- గద్వాల, ఇంచర్ల -ములుగు, పెద్దరాత్‌పల్లి-పెద్దపల్లి, సంకిరెడ్డిపల్లి- వనపర్తి) నిర్మాణంలో ఉన్నాయి. భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో గంటకు 30 టన్నులు, అప్పారావుపేటలో 90 టన్నుల సామర్థ్యంతో అయిల్‌పామ్ ఫ్యాక్టరీలున్నాయి. వీటి నుంచి వచ్చే క్రూడ్ పామాయిల్‌ను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఆయిల్‌ఫెడ్‌కు పంపి అక్కడ రిఫైన్డ్, ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి పంపేవారు. సిద్దిపేట ఫ్యాక్టరీలో మాత్రం పామాయిల్ పండ్ల గుజ్జు నుంచి క్రూడ్ పామాయిల్ తీసి రిఫైన్డ్, ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి పంపిస్తారు. గంటకు 25 టన్నుల పామాయిల్ ప్యాకింగ్ చేయనున్నారు.

రాష్ట్రంలో 2.91 లక్షల ఎకరాల్లో సాగు

రాష్ట్రంలో 1992 నుంచి ఇప్పటివరకు ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చిన విస్తీర్ణం 2.91 లక్షల ఎకరాలు (79,379 మంది రైతులు). డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు ఎన్ఎంఈవో- ఓపీ (నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ - ఆయిల్‌పామ్)పథకంలో భాగంగా 1,08,455 ఎకరాలు (33,723 రైతులు) సాగులోకి వచ్చాయి. సిద్దిపేట జిల్లాలో 4,379 మంది రైతులు 14,290 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.ఈవోపీ పథకం అమలులో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నది. ప్రస్తుతం 68,600 ఎకరాల్లో గెలలు ఉత్పత్తి అవుతున్నాయి. పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే దేశంలో సుమారు 70 లక్షల ఎకరాల్లో సాగు చేయడం అవసరం. దేశీయ పామాయిల్ ఉత్పత్తిలో 98 శాతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచే అవుతున్నది. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఎకరానికి రూ.50,918 (4 సంవత్సరాలకు) రాయితీ ఇస్తున్నారు. టన్నుకు రూ.12,534గా ఉన్న ఆయిల్ పామ్ గెలల ధర, ప్రస్తుతం రూ.21,546 చేరింది. రాష్ట్రంలో ఈ ఏడాది 47,260 ఎకరాల్లో (14,730 రైతులు) రైతులు మొక్కలు నాటారు. రాష్ట్రంలోని 14 ఆయిల్ పామ్ కంపెనీలు మొక్కల సరఫరాకు 45 నర్సరీలు ఏర్పాటు చేశాయి.

కేసీఆర్ ఆలోచన.. హరీశ్ ఆచరణ

కేసీఆర్ కలల ప్రాజెక్టు కాళేశ్వరంతో సిద్దిపేట జిల్లాలో వాతావరణం ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా మారింది. కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రత్యేక కృషి చేశారు. నిరంతర పర్యవేక్షణతో అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూసేకరణలో రైతులను ఒప్పించి మెప్పించి ఫ్యాక్టరీ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ చేయించారు. తొలినాళ్లలో సిద్దిపేటకు పామాయిల్ పంట తెచ్చే ప్రయత్నంలో ఎన్నో అవరోధాలు ఎదుర్కొన్నారు. ఐఐవోఆర్ (ఇండియన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ రీసెర్చ్) వారు చెప్తే తప్ప ఇక్కడ పామాయిల్ సాగు చేసే పరిస్థితి లేదు. 2018లో ఇక్కడ ఆయిల్‌పామ్ సాగు చేయరాదు అని ఐఐవోఆర్ వాళ్లు తేల్చిచెప్పారు. గాలిలో తేమశాతం తక్కువ ఉన్నదని, పామాయిల్ సాగుకు అనుకూలం కాదని స్పష్టంచేశారు. ఆ తర్వాత 2019లో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, చెరువులు, చెక్ డ్యాముల్లో నీళ్లు నిండుకుండల్లా ఉండటంతో 2021లో మళ్లీ పరిశోధన చేసిన తర్వాత గాలిలో తేమ శాతం పెరిగింది. అప్పుడు ఇక్కడ పామాయిల్ సాగు చేసుకోవచ్చని ఐఐవోఆర్ ప్రకటించింది. దీంతో 2022, జూన్ 5న నంగునూరు మండలం రామచంద్రాపూర్‌లో రైతు మడుగు ఎల్లారెడ్డి పొలంలో మొదటి పామాయిల్ మొక్కకు బీజం పడింది. అలా ఒక్కో రైతును గుర్తించి ఒక్కో ఎకరం పెట్టించి ఇవ్వాళ ఇక్కడిదాకా హరీశ్ కృషితో వచ్చింది.

ఒక్క ఎకరానికే భరోసా!

మొదటిపేజీ తరువాయి...

నిధులు జమ చేశామని కాంగ్రెస్ సర్కార్ ఘనంగా ప్రకటించింది. కానీ, ఈసారి కొత్త విధానం తెర మీదకు తెచ్చింది. గతంలో ఒక్కో రైతుకు ఎంత వ్యవసాయ భూమి ఉంటే అంత భూమికి ఒకేరోజు రైతుభరోసా జమ చేసేవారు. కానీ, ఈసారి పాత విధానానికి విరుద్ధంగా, ఒక రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నప్పటికీ, తొలి విడతగా ఒక ఎకరం వరకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించింది. అంటే ఎకరం కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు కూడా మొదటిరోజు రూ.ఆరు వేలు మాత్రమే జమ చేయనున్నది. ఈ కొత్త విధానంపై రైతుల్లో తీవ్ర భయాందోళనలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతుభరోసాలో కోతలు పెట్టేందుకు ఈ విధానం తీసుకొచ్చారనే అనుమానాన్ని రైతులు వ్యక్తంచేస్తున్నారు. రైతులందరికీ 3 నుంచి 5 ఎకరాల వరకు మాత్రమే రైతు భరోసా నిధులు పంపిణీ చేసి మిగిలిన ఎకరాలకు ఎగ్గొట్టే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో..

రైతుభరోసా పంపిణీపై సర్కార్ ప్రకటనలు, చర్యలను గమనిస్తే, ఈ యాసంగిలోనూ రైతుభరోసాకు కోతలు పెట్టే పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సర్కార్‌కు రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలనే సదుద్దేశమే ఉంటే మొన్నటి వానకాలం మాదిరిగా ఒకేసారి పంపిణీ చేసేదని అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి, తొలుత ఈ సీజన్‌లో రైతుభరోసా పంపిణీని పూర్తిగా ఎగ్గొట్టాలనే ఆలోచనకు సర్కార్ పెద్దలు వచ్చారని తెలిసింది. ఇప్పట్లో ఎన్నికలు లేవు. ఒక్కసారి రూ.9వేల కోట్లు పంపిణీ చేస్తే రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతుందనే ఆలోచన చేశారని సమాచారం. రైతుభరోసా పంపిణీలో తీవ్ర జాప్యం జరగడంతో ఆగ్రహించిన రైతులు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ కదం తొక్కాయి. ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. మరోవైపు, సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రైతుభరోసాపై సర్కార్‌ను ప్రశ్నించేందుకు బీఆర్‌ఎస్ సర్వసన్నద్ధమైంది. ఒకవేళ సభలో రైతుభరోసాపై రచ్చ జరిగితే, ఇది ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతుందనే భయంతో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు రైతుభరోసాపై చర్చ, ఆందోళనలు జరగకుండా నివారించేందుకు మూడు విడతల విధానం తీసుకొచ్చారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. లేనిపక్షంలో తొలి విడతకు తేదీని ప్రకటించిన సర్కార్.. ఆ తర్వాతి రెండు విడతల తేదీలను ఎందుకు ప్రకటించలేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

మిగిలిన ఎకరాలకు ఎప్పుడో...?

ఈ నెల 22న సుమారు 70 లక్షల మంది రైతులకు ఒక ఎకరం రైతుభరోసా కింద రూ.3,590 కోట్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రెండో విడతగా 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించిందే తప్ప, కచ్చితమైన తేదీ వెల్లడించలేదు. ఏప్రిల్ నెలాఖరు వరకు మూడో విడత పంపిణీ చేస్తామని పేర్కొన్నది. ఈ విధంగా చివరి రెండు విడతలకు ప్రభుత్వం స్పష్టమైన తేదీలను ప్రకటించకపోవడంతో రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తొలి విడతలో రైతులందరికీ ఎకరం భూమికి రైతుభరోసా విడుదల చేస్తామని చెప్తున్నప్పటికీ, మిగిలిన రెండు విడతల్లో ఎన్ని ఎకరాల వరకు, ఎంతమంది రైతులకు పంపిణీ చేస్తుందనే విషయాన్ని ప్రకటించలేదు. దీంతో ఈ సీజన్ రైతుభరోసా పూర్తిగా పంపిణీ చేస్తుందా? లేక గతంలో మాదిరిగానే కొంతమందికి పంపిణీ చేసి మమ అనిపించేస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రెండో విడతకు 20 రోజుల సమయం పెట్టింది. అంటే అప్పటికే అసెంబ్లీ సమావేశాలు ముగిసిపోతాయి. ఆ తర్వాత రాజు ఎవరో.. రెడ్డి ఎవరో.. అన్నట్టుగా సర్కార్ ఆలోచన చేసినట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇది ఐదో సీజన్. ఇందులో ఒకే ఒక్క సీజన్‌లో మొన్నటి వానకాలానికి మొత్తం భరోసా పంపిణీ చేసింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో తొలి విడత యాసంగికి కేసీఆర్ జమ చేసిన నిధులనే పంపిణీ చేసింది. ఆ తర్వాత వానకాలంలో రైతులకు నయా పైసా ఇవ్వలేదు. ఆ తర్వాత యాసంగిలో మూడెకరాల వరకు మాత్రమే పంపిణీ చేసింది. మిగిలిన రైతులకు ఎగనామం పెట్టింది. తాజాగా యాసంగిలో ఎవరికి ఇస్తుందో, ఎన్ని ఎకరాలకు ఇస్తుందో తెలియని అయోమయం నెలొన్నది. గత అనుభవాలను పరిశీలిస్తే, ఈ యాసంగి సీజన్‌లో మూడెకరాల వరకు పంపిణీ చేసి మమ అనిపిస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇది రైతు పక్షపాత ప్రభుత్వం: తుమ్మల

మూడు విడతల్లో రైతులందరికీ రైతుభరోసా జమ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుభరోసా నిధుల విడుదలకు ఆమోదం తెలిపిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రైతుల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు.

సేవ్ తెలంగాణతో అసెంబ్లీకి!

మొదటిపేజీ తరువాయి...

ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తుది తీర్పు, మూసీ కూల్చివేతలు తదితర అంశాలపై సభలో బీఆర్‌ఎస్ నిలదీసే అవకాశం ఉన్నదని, 'సేవ్ తెలంగాణ' నినాదంతో బీఆర్‌ఎస్ సభ్యులు సభలోకి వచ్చే అవకాశం ఉన్నదని ప్రభుత్వానికి ఉప్పందటంతో ముఖ్యమంత్రి, మంత్రివర్గం అప్రమత్తమైనట్టు తెలిసింది. మార్చి 30 వరకు సభను ముగించాలని నిర్ణయించినట్టు సమాచారం.

తులం బంగారం, రూ.2,500 లేకుండానే బడ్జెట్

సోమవారం ఉదయం 11:45 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ఉభయసభలు ప్రారంభమవుతాయి. కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లా అసెంబ్లీకి తొలిసారి రాబోతున్నారు. ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖలవారీగా ఇప్పటికే ప్రీ బడ్జెట్ సమావేశాలు పూర్తి చేశారు. ఈ నెల 20న భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతారు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. పాత బడ్జెట్‌లోని లెక్కలను అటూ ఇటూ తిప్పి కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారని తెలిసింది. గత బడ్జెట్‌లోని రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి వంటి పాత పథకాల ప్రస్తావనే బడ్జెట్‌లో పొందుపరిచారని సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ కింద ఇచ్చిన తులం బంగారం, రూ.4 వేలకు వృద్ధాప్య పింఛన్ పెంపు, 18 ఏండ్లు నిండిన మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం పథకాల ఊసే లేదని విశ్వసనీయంగా తెలిసింది. మహిళలను ఆర్థిక సహాయం, వృద్ధాప్య పింఛన్ మీద గత సంక్రాంతి సమయంలోనే అధికారిక ప్రకటన ఉంటుందని అధికార పార్టీ మీడియాకు లీకులు ఇచ్చింది. అయితే, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆలస్యమైందని, లేకుంటే చేసేవాళ్లమేనంటూ కొద్దికాలం నెట్టుకొచ్చారు. తీరా బడ్జెట్‌లో ఆ మూడు పథకాల ప్రస్తావనే ఉండటం లేదని సమాచారం.

అస్త్రశస్త్రాలతో బీఆర్‌ఎస్ సిద్ధం

సభ్యులు శాసనసభ, శాసనమండలిలో మెలగాల్సిన తీరు మీద ఇటీవల ప్రతిపక్ష బీఆర్‌ఎస్ వర్క్‌షాప్ నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, ఆదాయం, హామీలు, ఎగవేతలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ఎలా నిలదీయాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణ ఇచ్చినట్టు తెలిసింది. సోషియో ఎకనామిక్ సర్వే, ఆర్బీఐ, కాగ్ లెక్కలను ప్రజలకు అవగతమయ్యే రీతిలో వివరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఓపెన్ మార్కెట్లో తీసుకున్న అప్పులు, ఆదాయం లేని కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న అప్పుల వివరాలను గణాంకాలు సహా వివరించాలని నిర్ణయించారు. ఆరు గ్యారెంటీలు, ఖమ్మంలో పేదల ఇండ్ల కూల్చివేత, సింగరేణిలో నైనీ కుంభకోణం, మూసీ సుందరీకరణ, గోదావరి నదీ జలాల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ కడుతున్న ప్రాజెక్టు తదితర అంశాల మీద చర్చకు పట్టుబట్టాలని బీఆర్‌ఎస్ నిర్ణయించిందని తెలిసింది. యాసంగి ముగుస్తున్నా రైతుభరోసా నిధులు ఇవ్వకపోవడం, సభ నేపథ్యంలో 22న ఒక్క ఎకరానికి ఇస్తామని ప్రకటించడంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించినట్టు సమాచారం. మహిళలకు రూ.2,500, వృద్ధాప్య పింఛన్లు, తులం బంగారం పథకాల అమలు మీద కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది.



డిప్యూటీ స్పీకర్ ఎన్నిక లేనట్టే..!

రెండున్నరేండ్లపాటు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ లేకుండా సమావేశాలు జరుగడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. ఈ సారి కూడా డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నిర్వహించే అవకాశం లేదని కార్యనిర్వాహక అధికారులు చెప్తున్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా డోర్నకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రామచందర్‌నాయక్ పేరును కాంగ్రెస్ అధిష్ఠానం గత సంవత్సరం జూన్‌లో ప్రకటించింది. ఆయన ప్రస్తుతం విప్‌గా కొనసాగుతున్నారు. రామచందర్‌నాయక్ పేరు ఖరారైనా అధికారికంగా ఉపసభాపతి ఎన్నిక ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నది. అయితే, ప్రతి సమావేశంలోనూ ఈ నియామకానికి బ్రేక్ పడుతూ వస్తున్నది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనూ డిప్యూటీ స్పీకర్ ఎన్నికపై స్పష్టత లేదు. డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు ముందు నోటిఫికేషన్ వెలువరించాల్సి ఉంటుంది. గత అసెంబ్లీ సమావేశాల్లో సమయం లేకపోవడంతో ఎన్నిక నిర్వహించలేదని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. రామచందర్‌నాయక్ మంత్రి పదవి ఆశిస్తున్నారని తెలిసింది. అందుకే ఆయన డిప్యూటీ స్పీకర్ పదవి తీసుకోవడానికి ఇష్టపడటం లేదని సమాచారం. అట్లాగే అసెంబ్లీలో 18 కమిటీలను నియమించాల్సి ఉండగా, గత రెండున్నరేండ్లుగా దాదాపు 15 కమిటీలను వేయకుండా తాత్సారం చేస్తుండటంపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క రూపాయికే లీటర్ పాలు!

ఫ్లిప్‌కార్ట్‌పై కర్ణాటక పాల సంఘం దావా

బెంగళూరు, మార్చి 15: లీటర్ పాలను ఒక్క రూపాయికే విక్రయిస్తున్న ఫ్లిప్‌కార్ట్‌పై కర్ణాటకకు చెందిన ఓ పాల సంఘం దావా వేసింది. ఇంత తక్కువ ధరకు పాలను విక్రయించటం రైతుల ఆత్మగౌరవానికి భంగం కలిగించడమేనని 'బెంగళూరు మిల్క్ యూనియన్ లిమిటెడ్' పేర్కొన్నది. ఫ్లిప్‌కార్ట్‌కు వ్యతిరేకంగా 'కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' (సీసీఐ)కి ఫిర్యాదు చేసినట్టు పాల సంఘం అధ్యక్షుడు డీకే సురేశ్ చెప్పారు. ఇది ఎంతమాత్రమూ న్యాయమైంది కాదని, రైతుల కష్టాన్ని, గౌరవాన్ని దెబ్బతీసేదిగా సురేశ్ పేర్కొన్నారు. పాల అమ్మకంపై ఫ్లిప్‌కార్ట్ ఇస్తున్న ఆఫర్ ఈ రంగంలో అనేక సమస్యల్ని తెచ్చిపెడుతున్నదని అన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు గురై.. డైరీ ఫామ్స్ నడుపుతున్న వాళ్లను దెబ్బతీస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువమంది కస్టమర్లను ఆకర్షించేందుకు ఈకామర్స్ సంస్థ 'ఫ్లిప్‌కార్ట్' ఈ విధమైన ఆఫర్లు ప్రకటిస్తున్నదని, దీనిపై ప్రధాని మోదీకి కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

వచ్చే ఐదురోజులు మోస్తరు వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఉత్తరప్రదేశ్ నుంచి దక్షిణ ఒడిశా వరకు కొనసాగిన ద్రోణి బలహీనపడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం ప్రకటనలో తెలిపింది. దీంతో రాష్ట్రంలో వచ్చే ఐదు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకావశం ఉన్నదని వెల్లడించింది. ఆదివారం పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసినట్టు తెలిపింది. సోమ, మంగళవారాల్లో ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ చేసినట్టు పేర్కొన్నది.

ధరల మోత.. సబ్సిడీ మేత!

మొదటిపేజీ తరువాయి...

అడ్డగోలుగా యత్రాల ధరలను పెంచి దోపిడికి తెగపడుతున్నట్టుగా ఆరోపణలున్నాయి. ఈ ఏడాది వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద కేంద్ర ప్రభుత్వంతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పరికరాలను అందిస్తున్నది. ఇందులో భాగంగానే రూ. 101.93 కోట్లతో 1.31 లక్షల మంది రైతులకు పరికాలు అందించేలా కార్యాచరణ రూపొందించారు. అయితే ఈ పథకం ప్రస్తుతం అంతంత మాత్రంగానే కొనసాగుతున్నది. అయినప్పటికీ అందులోనే అధికారులు తమ చేతివాటాన్ని ప్రదర్శించడం గమనార్హం.

మార్కెట్‌తో పోల్చితే అధిక ధరలు...

యాంత్రీకరణ పథకంలో పంపిణీ చేస్తున్న పరికరాల్లో కొన్ని రకాల పరికరాల ధరలు బహిరంగ మార్కెట్‌తో పోల్చితే అధికంగా ఉన్నట్టు తెలిసింది. ముఖ్యంగా రోటవేటర్, స్ట్రా బేలర్స్, తైవాన్ స్ప్రేయర్స్, బ్యాటరీ స్ప్రేయర్స్ ధరలు అధికంగా ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. రోటవేటర్ ధర బహిరంగ మార్కెట్లో రూ. 1.15లక్షల నుంచి రూ.1.2 లక్షలుగా ఉంది. అయితే ఈ పథకంలో మాత్రం ఇదే రోటవేటర్ ధరను రూ. 1.40 లక్షలుగా నిర్ణయించారు. అంటే బహిరంగ మార్కెట్‌తో పోల్చితే సబ్సిడీ పథకంలో రోటవేటర్ ధర రూ. రూ. 20-25వేలు అధికంగా ఉండటం గమనార్హం. అదే విధంగా స్ట్రా బేలర్(గడ్డి కట్టలు కట్టే యంత్రం) ధర బహిరంగ మార్కెట్లో రూ. 3 లక్షల నుంచి రూ. 3.20 లక్షల వరకు ఉండగా సబ్సిడీలో దీని ధర రూ. 3.60 లక్షలుగా నిర్ణయించినట్టు తెలిసింది. అంటే బహిరంగ మార్కెట్‌తో పోల్చితే స్ట్రా బేలర్ ధర రూ. 40వేలు-60వేలు అధికంగా ఉండడం గమనార్హం. అదే విధంగా తైవాన్ బ్యారటీ స్ప్రేయర్ల ధర బహిరంగ మార్కెట్లో రూ. 2800 నుంచి రూ. 3వేలకు లభిస్తుంటే సబ్సిడీలో మాత్రం రూ. 4వేలు చెబుతున్నారు. ఇందులోనే మరో రకం రూ. 14,370 ఉండగా సబ్సిడీలో రూ. 20,500లకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఈ విధంగా మెజార్టీ యంత్రాల ధరలను బహిరంగ మార్కెట్‌తో పోల్చితే అధిక ధరలను చూపుతున్నట్టుగా తెలిసింది. అయితే ఈ టెండర్లలో నేరుగా పరికరాల తయారీ కంపెనీలే పాల్గొన్నాయి. ప్రస్తుతం ఆ కంపెనీలే సరఫరా చేస్తున్నాయి. అయినప్పటికీ బహిరంగ మార్కెట్‌తో పోల్చితే అధిక ధరలు ఖరారు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా రిటైల్ వ్యాపారులు, డీలర్లు విక్రయించే ధరలతో పోల్చితే కంపెనీ నేరుగా విక్రయించే ధరలు తక్కువగా ఉండాలి. కానీ ఇక్కడ ఇందుకు విరుద్ధంగా కంపెనీలు సరఫరా చేస్తున్నప్పటికీ ధరలు పెంచడం అనుమానాలకు తావిస్తున్నది.

అధికారులకు కాసుల వర్షం...

ప్రభుత్వం చేపట్టిన యాంత్రీకరణ పథకం డీఏవోలు, ఏడీలు, ఏవోలకు కాసుల వర్షం కురిపిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతులను నిండా ముంచుతూ కంపెనీలతో కుమ్మక్కైన అధికారులు అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి. ముఖ్యంగా అధికారులు ఎస్టిమేటెడ్ కాస్ట్ పెంచడం ద్వారా కంపెనీలకు లాభం చేకూర్చే పనులు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. రైతులతో తమ కంపెనీ పరికరాలను మాత్రమే కొనుగోలు చేసేలా ఒప్పించాలని కంపెనీల ప్రతినిధులు అధికారులకు తాయిలాలను ఎరవేస్తున్నట్టుగా తెలిసింది. దీంతో రైతు ఇష్టంతో సంబంధం లేకుండా కొంత మంది అధికారులు వారే కంపెనీ నిర్ణయించి రైతులకు కట్టబెడుతున్నట్టుగా సమాచారం. తద్వారా అధికారులు కంపెనీ నుంచి కమీషన్లు దండుకుంటున్నట్టుగా తెలిసింది. ఇలా ఒక్కో అధికారికి స్థాయిని బట్టి, పరికరాన్ని బట్టి రూ. 5వేల నుంచి రూ. 30వేల వరకు కమీషన్లు ముడుతున్నట్టుగా సమాచారం. రైతుల అక్రమ సంపాదన ఆశతో రైతులకు నష్టం జరుగుతున్నదనే విమర్శలున్నాయి. రైతులకు రావాల్సిన సబ్సిడీ రావడం లేదని, రైతులు అధికంగా చెల్లించాల్సి వస్తున్నట్టుగా తెలిసింది. ఎస్టిమేటెడ్ కాస్ట్ పెంచడం వల్ల రైతులకు రావాల్సిన సబ్సిడీ తగ్గుతున్నదని, ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుందని తెలిపారు.

డ్రగ్స్ కేసు పేరిట బీఆర్ఎస్‌పై కక్ష

- వినియోగం, విక్రయానికి మేం వ్యతిరేకం
- బాధ్యులెవరైనా కఠినంగా శిక్షించాల్సిందే
- ఏ పరీక్షకైనా సిద్ధమని ఎన్నోసార్లు చెప్పిన
- నా పేరు లాగితే చట్టపరమైన నోటీసులిస్తా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): 'బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు డ్రగ్స్ వాడటం దురదృష్టకరం. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయానికి నేను, బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకం. మాదకద్రవ్యాల వాడకం, చట్టవిరుద్ధ కార్యాకలాపాలను తీవ్రంగా ఖండిస్తున్నాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. కొందరు నీచ రాజకీయాల కోసం డ్రగ్స్ కేసు పేరిట బీఆర్ఎస్‌పై కక్ష సాధిస్తున్నారని ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. మనుషులను రాక్షసులుగా మార్చే మాదకద్రవ్యాలను బాధ్యతాయుతమైన పదవులు, హోదాల్లో ఉన్న వ్యక్తులు వినియోగించడం సరికాదని వ్యాఖ్యానించారు. డ్రగ్స్ వాడుతున్న, విక్రయిస్తున్న వారిని రాజకీయాలు, పదవులతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠినంగా శిక్షించాల్సిందేనని స్పష్టంచేశారు. అయితే కొందరు, తామంటే గిట్టని రాజకీయ పార్టీలు తమ నీచ రాజకీయాల కోసం బీఆర్ఎస్‌ను డ్రగ్స్ కేసులోకి లాగేందుకు యత్నిస్తున్నాయని తీవ్రంగా ఖండించారు. తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకొనే ప్రసక్తేలేదని హెచ్చరించారు. 'డ్రగ్స్ వినియోగంపై ఏ పరీక్షకైనా సిద్ధమని ఇప్పటికే పలుమార్లు ప్రకటించాను. ఈ విషయంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సూచనలను స్వాగతిస్తున్నాను. మనమందరం ఆదర్శంగా నిలుద్దాం' అని కేటీఆర్ స్పష్టంచేశారు. ఇంత స్పష్టంగా చెప్తున్నప్పటికీ ప్రతి డ్రగ్స్ కేసులోకి తన పేరును లాగాలని చూస్తే ఊరుకొనే ప్రసక్తిలేదని, చట్టపరమైన నోటీసులిస్తానని హెచ్చరించారు.

అసెంబ్లీలో డ్రగ్ టెస్ట్‌కు బీఆర్ఎస్ సిద్ధం

కాంగ్రెస్ సభ్యులు రెడీగా ఉండాలి
కేటీఆర్‌పై పీసీసీ చీఫ్ వ్యాఖ్యలు సిగ్గుచేటు
మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): శాసనసభ, శాసనమండలిలో డ్రగ్ టెస్ట్ చేయించుకొనేందుకు బీఆర్ఎస్ సభ్యులు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ సభ్యులు కూడా సిద్ధంకావాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మొయినాబాద్ ఫామ్ హౌజ్‌లో డ్రగ్స్ కేసును సాకుగా చూపి కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నేతలపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. చట్టపరిధిలో తేలాల్సిన వ్యవహారాన్ని కాంగ్రెస్ రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తుండటంతో సహించలేక కేటీఆర్‌పై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మొయినాబాద్ ఫార్మ్ హౌస్ ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మహేశ్‌కుమార్‌గౌడ్‌ది బాధ్యతారాహిత్యం

కేటీఆర్‌పై తప్పుడు ప్రచారం బీఆర్ఎస్ నేత సీహెచ్ ఉపేంద్ర

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు విషయంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత సీహెచ్ ఉపేంద్ర విమర్శించారు. కాంగ్రెస్ నాయకులతోపాటు ఆ పార్టీ సోషల్ మీడియాలో సైతం కేటీఆర్‌పై తప్పుడు ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. నిరాధారమైన, సత్యదూరమైన వార్తలతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో కేటీఆర్‌కున్న అభిమానాన్ని తగ్గించేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో విచారణ జరుపడంలో తమకెలాంటి అభ్యంతరం లేదని, అలాంటి ఘటనలకు బీఆర్ఎస్ వ్యతిరేకమని కేటీఆర్ స్పష్టంచేశారని గుర్తుచేశారు.

అసత్య ఆరోపణలు చేస్తే కోర్టుకీడుస్తం

- అసెంబ్లీలో డ్రగ్, డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ పెట్టండి
- మహేశ్‌గౌడ్.. చిల్లర మాటలు మానుకో
- కేసీఆర్ హయాంలోనే డ్రగ్స్‌పై ఉక్కుపాదం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్



ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, చిత్రంలో బీఆర్ఎస్ నేత సీహెచ్ ఉపేంద్ర

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): 'తమ అవినీతికి అడ్డొస్తున్నారనే కాంగ్రెస్ నేతలంతా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నోరు పారుసుకుంటున్నారు. ఆయనపై కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. డ్రగ్స్ వ్యవహారంలో కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేసే కాంగ్రెస్ నేతలను కోర్టుకీడుస్తాం' అని వారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. కేటీఆర్‌కు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి లింక్ పెట్టడాన్ని ఆయన తప్పుపట్టారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డితో చేసిన సహవాస దోషం వల్ల కేటీఆర్‌పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ క్లబ్బులో, ఏ పబ్బులో తిరుగుతున్నారో? ఎక్కడ పేకాట ఆడుతున్నారో తాము చెప్పాలా? అని నిలదీశారు. ప్రజా సమస్యలపై కేటీఆర్ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకే ఇలాంటి చిల్లర విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు డ్రగ్స్‌పై మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు ఉన్నదా? అని ప్రశ్నించారు. చర్లపల్లిలో 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుకొన్నది ముంబై పోలీసులని, మరి వారొచ్చి పట్టుకొనే దాకా తెలంగాణ ఈగల్ పోలీసులు ఏం చేశారని నిలదీశారు. ఇది రేవంత్‌రెడ్డి సర్కార్ చేతకానితనానికి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రకటించిన లెక్కల ప్రకారం 2025లో 2,572 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని, రాష్ట్రంలో అడ్డూ అదుపు లేకుండా గంజాయి కేసులు పెరిగాయని ఆరోపించారు. దాదాపు 30 శాతం డ్రగ్స్ వినియోగం పెరిగిపోయిందని ఆ ప్రభుత్వమే ప్రకటించిందని గుర్తుచేశారు.

అసెంబ్లీలో డ్రంకన్‌డ్రైవ్ టెస్టు పెట్టాలి

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వచ్చే ప్రజాప్రతినిధులకు డ్రగ్, డ్రైంకన్ డ్రైవ్ టెస్టు కేంద్రాలతో పరీక్షించాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ సూచించారు. సోమవారం అసెంబ్లీలో గ్రవర్నర్ ప్రసంగం పూర్తయిన తర్వాత డ్రగ్స్ టెస్టు చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఉద్దేశించి డిమాండ్ చేశారు. మరి ఈ టెస్టు చేయించుకోవడానికి బీఆర్ఎస్ నేతలంతా సిద్ధంగా ఉన్నారని, మరి సీఎం రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ ఇతర నేతలు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపిన కేసీఆర్

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ తన హయాంలో డ్రగ్స్‌పై ఉక్కుపాద మోపారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ చెప్పారు. కానీ రేవంత్‌రెడ్డి సర్కార్‌లో డ్రగ్స్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకున్నా తాము సహకరిస్తామని చెప్పారు. కానీ డ్రగ్స్‌కు రాజకీయాలను ఆపాదిస్తూ.. ముడిపెట్టొద్దని హితవు పలికారు. కేటీఆర్ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకంత భయం అని ప్రశ్నించారు. ఆ భయంతోనే కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నేత సీహెచ్ ఉపేంద్ర పాల్గొన్నారు.

కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ క్షమాపణలు చెప్పాలి

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ కేసు వ్యవహారంలో కేటీఆర్‌ను ఉద్దేశించి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఖండించారు. మీడియాలో కవరేజ్ కోసమే అడ్డగోలుగా మాట్లాడారని ఆదివారం ప్రకటనలో ఎద్దేవా చేశారు. వెంటనే కేటీఆర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్‌పై కేసీఆర్ సర్కార్ ఉక్కుపాదం మోపిందని గుర్తుచేశారు. ఆధారాలులేకున్నా మొయినాబాద్ డ్రగ్స్ కేసును కేటీఆర్‌కు అంటగట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. నిత్యం ప్రజాసమస్యలపై నిలదీస్తున్న కేటీఆర్‌ను నిలువరించేందుకే కాంగ్రెస్ నేతలు నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. దమ్ముంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధంకావాలని సవాల్ విసిరారు. లేదంటే తోకముడుచుకొని కూర్చోవాలని హితవు పలికారు.

అధికారులు ప్రజల పక్షాన ఉండాలి

- రాజకీయ నాయకులకు వంతపాడొద్దు
- రేవంత్ రైతు భరోసా ఎగ్గొట్టారు
- ప్రశ్నించే వారిపై కేసులు దుర్మార్గం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



వనపర్తిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డికి పంపించే లేఖలు చూపుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి,మార్చి 15(నమస్తే తెలంగాణ) : అధికారులు ప్రజల పక్షాన ఉండాలి.. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి తానా అంటే తందానా అనే రీతిలో వంతపాడుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. నాయకుల సంతోషం కోసం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెట్టే సంస్కృతిని అమలు చేస్తున్న పోలీసు అధికారులు పునరాలోచించుకోవాలని సూచించారు. ఆదివారం వనపర్తిలోని తన నివాసంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్‌తో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలుచేయని పథకాలపై ప్రశ్నించినా.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా పోలీసులు కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. రైతులకు కరెంటు, యూరియా సరఫరా సక్రమంగా లేనందున నష్టాలపాలవుతున్నారని, రైతు భరోసా ఎగ్గొట్టారని ఆవేదన వ్యక్తంచేశారు.

శ్రీధర్‌రెడ్డి హత్యను ఛేదించాలి..

చిన్నంబాయి మండలం లక్ష్మీపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసును రెండున్నరేళ్లుగా ఛేదించక పోవడం విచారకరమని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. హత్య కేసును ఎందుకు విచారణ పేరుతో పెండింగ్ పెట్టారని ప్రశ్నించారు. పోలీసు శాఖలో చిత్తశుద్ధితో పనిచేసే అధికారులకు ఇలాంటి చర్యలు తలవంపులు తెస్తున్నాయని చెప్పారు. వారం రోజుల్లో శ్రీధర్‌రెడ్డి హత్యకేసును ఛేదించని పక్షంలో మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం చేపట్టవద్దని, గతంలో మంజూరైన బైపాస్ రోడ్డును పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి వేర్వేరుగా లేఖలు పంపుతున్నట్టు తెలిపారు.

ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ నియామకాలకు బ్రేక్!

మొదటిపేజీ తరువాయి...



దాదాపు 55 వేల మంది అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ, ఆ నియామకాలు పూర్తిచేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నది. ఈ నియామకాలు చేపట్టాల్సిన పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ప్రభుత్వం నుంచి, ఆర్టీసీ యాజమాన్యం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిసింది. దీంతో ఆ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ ఈ వ్యవహారంపై గత 6 నెలల నుంచి ఆర్టీసీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, రవాణా శాఖ మంత్రి అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఎలక్ట్రిక్ బస్సుల రాకతోనే..

తెలంగాణ ఆర్టీసీలో కొత్తగా ప్రవేశపెట్టే ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్‌ల కోసం డ్రైవర్లు కావాలని ఆయా కంపెనీలు ఇప్పటికే ప్రకటనలు ఇస్తున్నాయి. దీని వల్ల ఉపాధి కోల్పోయే ఆర్టీసీ డ్రైవర్లను ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల్లో వినియోగించుకోవడంపై ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం దృష్టి పెట్టడం లేదు. కొత్త డ్రైవర్ల నియామకానికి కూడా సుముఖత చూపడం లేదు. వీటితోపాటు ట్రాఫిక్, మెకానిక్, ట్రాఫిక్ మేనేజర్, సెక్షన్, అకౌంట్స్ ఆఫీసర్ల నియామకాలు కూడా ఆగిపోతున్నాయి. ఆర్టీసీలో ఇప్పటికే ఎంతో మంది ఉద్యోగులు రిటైర్ అవడం, వారి స్థానంలో కొత్తగా నియామకాలు చేపట్టకపోవడంతో ఉన్నవారినే అర్హతల ఆధారంగా ఆ పోస్టుల్లో నియమించుకునే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందుకే కొత్త నియామకాలు చేపట్టడం లేదని తెలుస్తున్నది.

ఫీజు బకాయిలివ్వకుంటే అసెంబ్లీ ముట్టడి

- ఈ బడ్జెట్‌లోనే ఫీజు నిధులు కేటాయించాలి
- పథకాన్ని రద్దు చేయలని చూస్తే రాష్ట్రం అగ్నిగుండమే
- విద్యార్థుల ఫీజుపోరు దీక్షలో అఖిలపక్ష నేతలు



ఆదివారం ఇందిరాపార్క్ వద్ద బీసీ విద్యార్థి సంఘం నిర్వహించిన ఫీజు పోరు దీక్ష కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు సిరికొండ మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, ఎల్ రమణ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

కవాడిగూడ, మార్చి 15: 'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. త్వరలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లను ఈ పథకం కింద నిధులు కేటాయించాలి. లేదంటే అసెంబ్లీ ముట్టడి చేపడుతాం' అని అఖిలపక్ష నేతలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేయాలని సర్కార్ చూస్తే.. అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని, రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారస్తామని తేల్చిచెప్పారు. ఫీజు బకాయిల సాధన కోసం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద విద్యార్థులు ఫీజు పోరు దీక్ష చేపట్టారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రంగౌడ్ సమన్వయంతో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ దీక్షను బహుజన తత్వవేత్త వీజీఆర్ నారగోని ప్రారంభించారు. దీక్షలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సీపీఐ నేత జీ నరసింహ, టీజేఎస్ నాయకులు నిర్జన రమేశ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్, సినీ దర్శకుడు ఎన్ శంకర్ పాల్గొని మద్దతు తెలిపారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి వచ్చే బడ్జెట్‌లో సరిపోను నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులను ఇస్తామన్న హామీని కాంగ్రెస్ సర్కార్ అమలు చేయాలని కోరారు.

బీసీల పోరుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకుండా కాంగ్రెస్ దొంగనాటకాలు అడుతున్నదని ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎల్ రమణ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. బీసీ విద్యార్థుల ఫీజుల కోసం బడ్జెట్‌లో నిధులను విడుదల చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వాలు మనుగడ సాగించలేదని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని శాసనమండలిలో లేవనెత్తి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు. ఫీజు బకాయిల విడుదలలో ప్రభుత్వం ఏమ్రాతం నిర్లక్ష్యం చేసినా బీసీ సంఘాలు చేపట్టబోయే అసెంబ్లీ ముట్టడిలో తాము ముందు వరుసలో ఉంటామని స్పష్టంచేశారు.

విద్యార్థుల శక్తిని తక్కువగా అంచనా వేయొద్దు: దత్తాత్రేయ, ఈటల

విద్యార్థుల శక్తిని రేవంత్‌రెడ్డి సర్కార్ తక్కువగా అంచనా వేయొద్దని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. విద్యార్థుల ఫీజు బకాయి నిధుల కోసం విద్యార్థుల చేస్తున్న ఉద్యమం న్యాయమైనదని, వారికి తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయేకాలం దగ్గరపడిందని ఈటల హెచ్చరించారు. పేద విద్యార్థుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని అన్నారు. ఫీజులు రాకపోవడంతో చదువులు కొనసాగించలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం మానవత్వం లేని ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జకృష్ణ, బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశాచారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, నాయకులు కనకాల శ్యాంకుర్మ, మనిమంజరి సాగర్, జాజుల లింగంగౌడ్, దీటి మల్లయ్య, ప్రజాపతి, దేశగాని సాంబశివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భీంరెడ్డి చరిత్ర తెలంగాణకు గర్వకారణం

ఘనంగా భీంరెడ్డి 103వ జయంతి

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసీపీఐ (యూ) పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎంపీ భీంరెడ్డి నరసింహారెడ్డి చరిత్ర తెలంగాణ సమాజానికి గర్వకారణమని ఎంసీపీఐ (యూ) నేతలు కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓంకార్‌భవన్‌లో భీంరెడ్డి నరసింహారెడ్డి 103వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భీంరెడ్డి చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీంరెడ్డికి ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించేలా సూర్యాపేట జిల్లాకు ఆయన పేరు పెట్టాలని వారు కోరారు. భీంరెడ్డి చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రకమిటీ సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, నార్ల చంద్రశేఖర్, గాదగోని రవి, మాడిశెట్టి అరుణ్‌కుమార్, భారత ఐక్య విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు తాటికొండ రవి, మాదం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ నుంచే కులధ్రువీకరణ పత్రాలివ్వాలి

57 ఎంబీఎస్సీల హక్కుల పోరాట సమితి

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఆర్డీవో కార్యాలయాల నుంచి కాకుండా తహసీల్దార్ల ద్వారా ఎస్సీ ఉపకులాలకు కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని 57 ఎంబీఎస్సీల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు భైరి వెంకటేశం డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో తెలంగాణ రాష్ట్ర మాల జంగం మహేశ్వర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్శశ్యామ్‌రావు అధ్యక్షతన ఆదివారం మాలజంగాల మహాసభ కొనసాగింది. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. ఎస్సీ ఉపకులాలకు తహసీల్దార్ ద్వారానే కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. 57 ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మాలజంగాలను శైవక్షేత్రాల్లో పూజారులుగా నియమించి గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మాలజంగం కుల భవనం నిర్మాణం, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాలూకా రాజేందర్, ముఖ్య సలహాదారులు రాజాం ఉమాపతి, పురం శివశంకర్, కన్వీనర్ మదారి ఉమాపతి, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎల్పుల సత్య మహేశ్, ఈసరి సత్యానందం, కొండ మచెందర్, ఎల్పుల నాగరాజు, బొబ్బిలి రమేశ్, గౌడి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో కుర్చీలాట!

రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో ఐదుగురు కమిషనర్లు!
ఖజానాకు వెన్నెముకగా నిలిచే కీలకశాఖలో అస్థిరత
కమిషనర్‌కు శాఖపై పట్టు చిక్కకముందే బదిలీ వేటు
రాష్ట్ర ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం

హైదరాబాద్, మార్చి 15: (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలిచే వాణిజ్య పన్నుల శాఖ ప్రస్తుతం బదిలీల పర్వంతో సతమతమవుతున్నది. గత బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో నలుగురు అధికారులు మాత్రమే ఈ శాఖ కీలక బాధ్యతల్లో ఉండగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్లలోనే ఐదుగురు కమిషనర్లను మార్చింది. బీఆర్ఎస్ పాలనలో 2014-2023 వరకు హీరాలాల్ సమారియా, అనిల్‌కుమార్, నీతూప్రసాద్, డాక్టర్ టీకే శ్రీదేవి కమిషనర్లుగా పనిచేశారు. వీరిలో అనిల్‌కుమార్ ఐదేండ్ల సుదీర్ఘకాలం, నీతూప్రసాద్ మూడేండ్లకుపైగా ఈ శాఖలో కొనసాగారు. తద్వారా పన్నుల వసూళ్లు, యంత్రాంగంపై పట్టు సాధించే అవకాశం వారికి లభించింది. పన్నుల ఆదాయం కూడా గణనీయంగా వృద్ధి చెందింది.

అస్థిరతతో నష్టమెవరికి?

రేవంత్‌రెడ్డి పాలనలో గడిచిన రెండేండ్ల కాలంలోనే నలుగురు అధికారులు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కుర్చీలో కూర్చుని వెళ్లిపోయారు. డాక్టర్ టీకే శ్రీదేవి, డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు, ఎస్‌ఏఎం రిజ్వీ, కే హరిత ఇప్పటివరకు కమిషనర్లుగా బాధ్యతలు నిర్వర్తించారు. వీరంతా కనిష్ఠంగా రెండు నెలల నుంచి గరిష్ఠంగా ఏడు నెలలకాలం మాత్రమే పనిచేశారు. ప్రస్తుతం ఎం రఘునందన్‌రావు కమిషనర్ కొనసాగుతున్నారు. శాఖాపరమైన లోటుపాట్లు, పన్ను ఎగవేతదారులు, వసూళ్ల విధానంపై పూర్తి అవగాహన పెంచుకోవడానికి ఒక అధికారికి కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. కానీ, పట్టు చిక్కకముందే అధికారులను బదిలీ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రిజ్వీ వంటి అధికారులు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహించినా, వారిని కూడా త్వరగానే మార్చేశారు. రాష్ట్ర మొత్తం పన్ను రాబడిలో 65 శాతానికిపైగా వాటాను అందించే ఈ శాఖలో ఇటువంటి అస్థిరత చోటుచేసుకోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మంచిది కాదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో కమిషనర్లుగా పనిచేసిన వారు..

కమిషనర్ పేరు	చేరిన తేదీ	బదిలీ తేదీ
హిరాలాల్ సమారియా	02-06-2014	03-11-2014
వీ అనిల్‌కుమార్	04-11-2014	30-11-2019
నీతూకుమారి ప్రసాద్	01-12-2019	26-07-2023
డాక్టర్ టీకే శ్రీదేవి	25-09-2023	11-10-2023
కాంగ్రెస్ పాలనలో		
క్రిష్టినా జెడ్‌చోంగ్తు	13-10-2023	17-12-2023
డాక్టర్ టీకే శ్రీదేవి	18-12-2023	03-08-2024
ఎస్‌ఏఎం రిజ్వీ	03-08-2024	21-02-2025
కే హరిత	22-02-2025	01-10-2025
రఘునందన్‌రావు	02-10.2025	ప్రస్తుతం కొనసాగుతున్నారు.

చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



రంగులు ఎలిసిన సింగిడి

గర్భగుడి దాటని బుల్లి దేవతలు
మాటువేసి సూస్తున్న
రాటుదేలిన రాక్షసుల భయానికి
కడప దాటకుంట
కడుపులనే మాయమైతున్నరు...

ఓ పక్క మల్లెపూలకు మంటవెట్టిన
కమురు వాసన...
ఇంకొక పక్క అందమైన
గులాబీలను మరుగవెట్టిన
కౌసు వాసన... అయినా గానీ
గా వాసన ఎన్ని ముక్కులల్ల సొచ్చినా
ఏ గుండెనూ తాకుత లేదు...
గా వాసన సుడిగాలిల కల్సి
గాయి గత్తర సేత్తుంది...

కుతిదీర తిందమని
బుద్ధితోటి తాటిల ఏసుకున్న
బువ్వల సెమట కలిసిన ఉప్పు రుచి...
ల్యాత గులాబీ మొగ్గలకు
తుమ్మముండ్లు గుచ్చి
తుకపెక ఉడికిచ్చిన
రుచి... అయినా గానీ
గా రుచి ఎన్ని నాలికెల
నరాలల్ల పాకినా
ఏ మెదడుదాకా పారుతలేదు...
గా రుచికి కడుపులకెల్లి
దేవుకచ్చిన గానీ
దేకుడు లేదు కానుడు లేదు...


గీ మనుషులు తిరిగే అడివిల
ఏ వాసనా సోకని ఏ రుచీ తాకని
ఆకులు రాలిన సెట్లు
రాలిపోయిన మొగ్గలను సూడలేక
బుగులు బుగులుగా
మొగులు కెయి మొకమేసి
రాలేటి రంగుల సుక్క కోసం
కొన్ని కండ్లు ఒక్క తీరు సూత్తున్నయి...



అల్లాడి శ్రీనివాస్
83416 63982

విశ్వాంతరాళంలో ఉన్న అదృశ్య శక్తిని అన్వేషించి, దృశ్యమానం చేసుకొని, విశ్వంతో మమేకమై విశ్వలయను అనుభూతి చెందిన మహామనీషి కోవెల సుప్రసన్నాచార్యులు. అందరిలో ఆ భావనను ఆపేక్షించి సమాజాన్ని జాగృతం చేయడానికి, విశ్వరూప సౌందర్యాన్ని దర్శింపజేయడానికి ఆయన పడిన తపన వర్ణనాతీతం.

ఒకవైపు విశ్వ శ్రేయస్సును కాంక్షిస్తూనే, మరోవైపు కావ్య సౌందర్యపు పచ్చ కర్పూరపు గుబాళింపులను పంచుతూనే తనలో తనను వెతుక్కున్నారాయన. భౌతికతత్త్వం నుంచి అనంతతత్త్వం వైపు మానవుని గమనాన్ని పరిశోధించారు. జాగ్రత్, స్వప్న, సుషుప్తులనే అవస్థాత్రయాన్ని అధిగమించి అలౌకికానంద విహాయసంలో విహరించి పరవశులయ్యారు. ఆ సుధార్ణవంలో నిలువునా మునిగి మహోన్నత తీరాలను చేరుకున్నారు.



> ప్రస్తుత కాలంలో ఆయన లాంటి వ్యక్తులు మిక్కిలి అరుదుగా ఉంటారు. పాంచభౌతికతత్త్వాన్ని త్రికరణశుద్ధిగా అనుభవైకవేద్యం చేసుకున్న సుప్రసన్నాచార్యులు అటువంటి తన్మయస్థితిని పరానుభూతం చేయడానికి సంకల్పించి, దానికి అక్షర రూపాన్ని కల్పించడం మన సుహృద్భాగ్యం.

అంతస్సు నుంచి అమృతత్త్వం వైపు

(17న ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య 90వ జన్మదినోత్సవం సందర్భంగా)

ప్రాచీన సాహితీ సంపదను ఒడిసిపట్టిన కవిగా, రచయితగా, విమర్శకుడిగా ఉదాత్తమైన వ్యక్తిత్వంతో, విలక్షణాభివ్యక్తితో, కవిత్వ స్వరూప స్వభావాలను చిత్రించిన విద్వత్సంపన్నుడు ఆయన. నిశితకావ్య పరిశీలనా వివేచనంతో మారుతున్న సమాజ పరిస్థితులకు అనుగుణంగా ప్రాచీన సాహిత్యానికి, ఆధునిక సాహిత్యానికి వారధిలా నిలిచి విశ్వజనీనతను వాంఛించారు. కాలక్రమంలో కవిత్వ రంగంలో ఏర్పడిన అసంతులితను అవగతం చేసుకొని వర్తమాన కవితను విస్పష్టంగా, విశిష్టంగా, విభిన్నంగా ప్రయోగించి అపురూప కవిత్వ విన్యాసం చేశారు.

బహుముఖీనంగా సాగిన ఆయన రచన అనేకులకు మార్గప్రబోధం చేసింది. ఆదర్శవంతులుగా తీర్చింది. ప్రసన్నాంతరంగులైన ఆయన నామధేయాన్ని సాహిత్యరంగంలో మేరుశిఖరంపై నిలబెట్టింది.

> ఉత్తమ కవితా ప్రమాణాల కోసం తమ వంతు ప్రయత్నం చేసిన చేతనావర్త కవుల్లో ఒకరుగా, ఆధునికాంధ్ర సాహిత్యంలో విమర్శకుడిగా నిరూపమాన నిర్మాణ కౌశలురై యశోభూషణులైన ఆయన సాహితీ మధువు తొమ్మిది దశాబ్దాల వయసులోనూ ఇంకా నిరంతరంగా, నిరాఘాటంగా, నిరవధికంగా సాగుతున్నదంటే అది ఆయన పట్టుదలకు, సాహిత్యానురక్తికి, తెలుగు భాషాభినివేశానికి నిదర్శనం.

'ప్రతి రక్తపు బిందువున పగులబడు నావేశ
మిదె తెన్గు జాతి తన యెదయెల్ల విచ్చినది
నా జాతి విశ్వ నీరద చంచలాలతిక
నా భాష జీవ సంతాన సత్త్వ పతాక'

తెలుగు జాతిని, భాషను గగనతల సింహాసనంపై అధివసింపజేసిన మహోత్తర కవి ఆయన. సాంప్రదాయ కుటుంబంలో పుట్టినా ఆ పరిమితులకే లోబడక ఆధునిక భావజాలంతో సామాజిక దృక్పథం కలిగిన కవిగా విస్తరించారు. ఈనాటి సమాజ సంక్షోభానికి కారణం భౌతిక సుఖాలనందించే సౌకర్యాలేనని, మానవుడే పర్యావరణాన్ని అసంతులనం చేస్తున్నాడని, చివరకు 'పృథ్వీ దినోత్సవాల'లో మునిగి పచ్చదనం కోసం కన్నీరు కార్చే దయనీయస్థితిలో ఉన్నామని ఆవేదన చెందుతారు. 'మేధావి' తోలు కప్పుకున్న మానవుని అత్యాశ మరింతగా పెరుగుతుండడం శోచనీయం అని అంటారాయన.

1936 మార్చి 17వ తేదీన వరంగల్ పట్టణంలో పండిత కుటుంబంలో జన్మించిన సుప్రసన్నాచార్యులు పారంపర్యంగా వచ్చిన ఆ సాహితీ మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించారు. భారత, భాగవత, రామాయణ కావ్యాల్లోని అంతర్లీన సౌందర్యాన్ని ఆకళింపు చేసుకొన్నారు. ప్రాథమిక విద్యార్థి దశలోనే ఉపనిషత్తులు, ఉభయ వేదాంత గ్రంథాలు, భగవద్గీత వంటి గ్రంథాలు చదివిన ప్రభావంతో తనను తాను శిల్పంగా చెక్కుకొని ఉదాత్త వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకున్నారు. ఆయన బాల్యమంతా స్వాతంత్ర్య సంగ్రామ కల్లోల వాతావరణంలో గడిచింది.

వర్ణభేదాలకు అతీతంగా భగవంతుని చేరుకొనే దిశగా ఆయనలో నూతనమైన ఆలోచన స్ఫురించింది. ఆ భావాలకు అనుగుణంగా ప్రాచీనతను పొదువుకొంటూనే ఆధునిక సమాజం వైపు ఆయన దృష్టి సారించారు. చిన్నాన్న కోవెల సంపత్కుమారాచార్యతో కలిసి సాహిత్యపథంలో నడిచారు. జంటకవులుగా పేరు తెచ్చుకొన్నారు. 1954లోనే 'తెలుగు స్వతంత్ర' పత్రికలో ఆయన వచన పద్యాలు అచ్చయ్యాయి.

> సద్గురు శివానందమూర్తి వారి భావలోకంలో ఆయన తన్మయులయ్యారు. అరవిందుల తత్త్వంతో అంతస్సులోకి ప్రవేశించారు. విశ్వనాథ వారి సాహిత్యసీమలో విహరించారు. ఈ ముగ్గురి భావాలు ముప్పేటలుగా అల్లుకొని ఆయన జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాయి.

'విశ్వనాథ మార్గాన్ని అనుసరించినా, ఆయనకున్న ప్రత్యేకతలను ఎవరూ కాదనలేరు' అని చేకూరి రామారావు ఆయనను ప్రశంసించారు. ఇప్పటివరకు యాభైకి పైగా వివిధ ప్రక్రియల్లో సాగిన ఆయన రచనాశైలి అసామాన్యం. 'శతాంకుర'లో కలువరేకులై విచ్చుకుంటారు. 'ఋతంభర'లో దేశభక్తిని, సామాజిక చైతన్యాన్ని పులుముకుంటారు. 'హృద్గీత'ను ఆలపించి మనోనిశ్చలురవుతారు. 'కన్నీటి కొలను'తో మానవజీవన సంఘర్షణలకు దుఃఖిస్తారు. 'శేఫాలిక'తో అంతర్ముఖ జగత్తులో లీనమవుతారు. 'సాంపరాయం'లో దివ్యమైన సమాజాన్ని స్వప్నిస్తారు.

> 'అనుభవములివి కవి చిత్తమవధి లేని
> విశ్వ చేతన కూడిన పర్విన క్షణాలు..
> ఏమి మిగులును, బ్రతుకునకెప్పుడైన'

అంటూ 'పరిక్రమ'లో విషాదమేఘాలు కమ్మిన జీవితానికి విలపిస్తారు. కవికి వ్యక్తిగతం, కావ్యం రెండూ విడదీయరానివి. సమాజస్థితికి కలవరపడ్డా, తన జీవనస్థితికి కల్లోలిత మనస్కుడైనా హృదయం సంద్రమవుతుంది. భావం ఉప్పొంగి కలం అక్షరాల్లో ప్రవహిస్తుంది. విశ్వనాథుల మాదిరిగా ఒంటరితనాన్ని అనుభవించలేక గుణాతీత జగత్తులో ప్రవేశించడానికి కావ్య సాధన చేశారు. పరమేశ్వరునితో అనుసంధానం చేసుకోవడానికి 'శివాభిసారిక'తో మధురభక్తి తత్పరులయ్యారు. అనంతమైన మృత్యుతత్త్వానికి ప్రతీకగా తమ దుఃఖాన్ని వ్యక్తీకరిస్తూ 'మణికర్ణిక'గా అవతరించారు. అక్కడితో ఆగక 'అశ్రుభోగ'గా ప్రపంచ దుఃఖాన్ని పరిచయం చేశారు.

ఆయన విరచించిన వివిధ భక్తి శతకాలు, శ్రీ నిరుక్తి, మణి సేతువు, ప్రీతి పుష్కరిణి, వేదసూక్త సౌరభం, శ్రీకృష్ణోపనిషత్తు, కృష్ణ రశ్మి మొదలైన రచనలు పారమార్థిక, తాత్త్విక పరంపరలై కొనసాగాయి. సహృదయ చక్రం, భావుకసీమ, చందన శాఖి, దర్పణం, సమర్పణ, సమర్చన, భావసంధ్య వంటి విమర్శన గ్రంథాలు తరువాతి తరాలకు విమర్శ మార్గాన్ని దర్శింపజేస్తాయి. ఆయన రచనలు సమకాలీనం, సార్వకాలీనాలై ఉదార వ్యక్తిత్వ రూపకల్పనకు దోహదం చేస్తాయి.

సాహిత్య చరిత్ర నిర్మాణం ఎప్పటికప్పుడు కొత్తగా చేరుస్తూ, మారుస్తూ, పునరాలోచన చేస్తూ పోవాల్సిన అంశమని, ఏ బిందువు దగ్గరా ఆగిపోకూడదని అంటారాయన. 90వ ఏట అడుగుపెట్టినా ఇప్పటికీ సాహిత్యమే శ్వాసగా జీవిస్తున్న మహానుభావుడు సుప్రసన్నాచార్యులు. ఆయన వల్ల ప్రభావితులైన ఎంతోమంది ఆ సాహితీ వటవృక్షాన్ని విస్తరింపజేసేందుకు తమవంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. 'విజ్ఞానం విస్తృతమవుతూ అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నప్పటికీ కవులు, రచయితలు తమ బాధ్యతనెరిగి రచనలు చేయాలి' అని చెప్పిన కోవెల వారి మాటలు అన్ని తరాలవారికి మార్గదర్శకాలు. ఈ సందర్భంగా సుప్రసన్నకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలుగాలని శుభాకాంక్షలు తెలుపుతున్నాను.



ధూళిపాళ అరుణ
87123 42323



రాజీ లేని పోరు

ఆశ నిరాశ కాలేదు
నిరాశగా నిప్పులు చెరగలేదు
ఇది నైపుణ్యం సామర్థ్యంతో గెలుపు
అనుభవం అంకితభావంతో గెలుపు
సమష్టి సమరసంతో గెలుపు
ఆర్భాటాలు కనబడలేదు..ఆట తప్ప
ఉద్ఘాటనలు వినబడలేదు.. వేట తప్ప
అభిమానుల్ని ఊగించి ఆనందడోలి
కల్లో ఊరేగించి చెమటోడ్చిన చిత్రం
చండప్రచండంగా నిప్పులు
చెరిగే బాంబుల్నెదురుకొని
ఆధునిక సమరవ్యూహంలో
స్వప్నం సాకారమైన దృశ్యం
కదం తొక్కాల్సిన ఆసన్న
సమయంలో నిర్భయ ప్రదర్శనం
ఒడిదొడుకుల్లోంచి ఒడ్డుకు చేర్చాలన్న
సంయమన సంకల్పం
జాతి పులకించి పులకరించి కేరింతల
గిలిగింతల ప్రపంచ యవనికపై
ప్రతిబింబం ఒక్క ఆసక్తి అభిరుచేనా
వీరోచితం క్రీడాభినివేశం ఉన్నప్పుడేగా
వైఫల్యం ఎదురుపడక
చిమ్మచీకట్లు చుట్టుముట్టక
అనూహ్యానుమానవమాన
పరాజయ ఖడ్గంపై పడక
ఆశయం ఉన్నతమైనప్పుడు
ప్రయత్నం ఉత్కృష్టం కావాలి
ఆశయం విజయ శిఖరాది
రోహణమైనప్పుడు క్రమశిక్షణలో
కఠోర కార్యదక్షత చూపాలి
రాజీలేని పోరు రాణించిన రోజు
రాటుదేలిన తీరు రవళించిన రోజు



కోటం చంద్రశేఖర్
94920 43348

'కులవృత్తుల కవితలు'పై 22న సదస్సు

బీసీ సాహిత్య వేదిక, తెలంగాణ సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్ రవీంద్రభారతి మినీ కాన్ఫరెన్స్ హాలులో 'బీసీ కులవృత్తుల దీర్ఘకవితలు'పై సదస్సు నిర్వహిస్తున్నదని బీసీ సాహిత్య వేదిక కన్వీనర్లు వనపట్ల సుబ్బయ్య, సంగిశెట్టి శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సభాధ్యక్షుడిగా డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, ముఖ్య అతిథులుగా జూలూరు గౌరీశంకర్, డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, విశిష్ట అతిథులుగా నామోజు బాలాచారి, తిరునగరి దేవకీదేవి, కె.ఆనందచారి పాల్గొంటారని తెలిపారు. మొదటి సదస్సులో సభాధ్యక్షుడిగా కాంచనపల్లి గోవర్ధనరాజు, ముఖ్యఅతిథిగా డా.పిల్లలమర్రి రాములు, విశిష్ట అతిథులుగా కందుకూరి శ్రీరాములు, ఆత్మీయ అతిథిగా జ్వలిత పాల్గొంటారని పేర్కొన్నారు. రెండవ సెషన్‌లో సభాధ్యక్షుడిగా రామోజు హరగోపాల్, ముఖ్యఅతిథిగా బెల్లి యాదయ్య, విశిష్ట అతిథిగా నాళేశ్వరం శంకరం, ఆత్మీయ అతిథిగా వంగర త్రివేణి వ్యవహరిస్తారని తెలిపారు. ముగింపు సమావేశానికి సభాధ్యక్షుడిగా వనపట్ల సుబ్బయ్య, ముఖ్యఅతిథిగా డా.సీతారాం, విశిష్ట అతిథులుగా గాజోజు నాగభూషణం, బెల్లంకొండ ప్రసేన్, ఆత్మీయ అతిథులుగా డా.పెబ్బేటి మల్లికార్జున్, డా.భీంపల్లి శ్రీకాంత్ వ్యవహరిస్తారని తెలిపారు. వివరాలకు 9492765358, 9849220321 నెంబర్లలో సంప్రదించవచ్చునని సూచించారు.

'దిగులు ద్వీపం' ఆవిష్కరణ

ఆసిఫాబాద్ కవుల సంఘం (ఆకసం) ఆధ్వర్యంలో నల్లగొండ రమేశ్ రచించిన 'దిగులు ద్వీపం' కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఆసిఫాబాద్ సత్యసాయిబాబా మందిరంలో ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని సంఘం ప్రతినిధి కందుకూరి శ్రీరాములు తెలిపారు. ఈ పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు. వివరాలకు 9440119245 నెంబర్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు.

'19న కుమ్మెర కవితా గానం'

తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రెండు దుఃఖభరిత సన్నివేశాలను నిరసిస్తూ.. బాధితులకు సంఘీభావంగా, ఉగాది రోజున 'వెలుగుమట్ల 'నామ సంవత్సర–కుమ్మెర కవితా గానం' అనే అంశంపై 33 జిల్లాల్లో కవి సమ్మేళనం నిర్వహించనున్నామని బీసీ రచయితల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం తెలిపారు. కవి సమ్మేళనం తర్వాత ఆయా కవితల్ని ఒక పుస్తకంగా తీసుకువస్తామని పేర్కొన్నారు.

జీవన పోరాటంలో వలసవెళ్లిన ప్రవాస భారతీయులు తరచుగా పరాయి దేశంలోని తమ అనుభవాలను కథలుగా చెప్పడం చూశాం. కానీ మధు పెమ్మరాజు కథలు ఇందుకు మినహాయింపు. ఆయన పుట్టి పెరిగిన హైదరాబాద్ బాల్యాన్ని, తన గోదావరి జిల్లాల మూలాల్ని స్పర్శిస్తూ ఆ తర్వాత తన అమెరికా అనుభవాలు జోడించి ఒక అందమైన పతంగిని ఆకాశంలో ఎగరేశాడు. దానికి 'డోరేదార్' అని నామకరణం చేశాడు.

భావోద్వేగాల పతంగి 'డోరేదార్'

ఆయన స్వతహాగా ఆంధ్ర ప్రాంతానికి చెందినా, తెలంగాణ మాండలికంపై అవ్యాజమైన వాత్సల్యం ఉంది. తాను పుట్టి పెరిగిన హైదరాబాద్ సంస్కృతిని తన కథల్లో ప్రతిబింబింపజేశాడు. ముఖ్యంగా పాత పతంగుల పండుగ జరుపుకొనేటప్పుడు పరిచయమైన ఒక పారిభాషిక పదజాలాన్ని సహేతుకంగా వాడాడు. సైదాబాద్‌లో తన చిన్ననాటి జ్ఞాపకాలను డీల్, చరఖా లాంటి పదాలను గుర్తుచేస్తూ ఒక అందమైన హైదరాబాద్ పిల్లాడి పండుగ అనుభవాన్ని, సొగసైన తెలంగాణ మాండలికాన్ని జతపర్చాడు.



'నవ్వే ఏనుగు బొమ్మ' కథలో రిక్షా లక్ష్మయ్యకు తన కిట్టీ బాక్స్‌లోని డబ్బులను ఇచ్చి డాక్టర్‌కు చూపించుకోమని చెప్పడం హృదయాలను కదిలిస్తుంది. ఈ పుస్తకంలో మరో కథ 'రాత్–దిన్' నిడివి చాలా చిన్నది. కానీ అంతులేని అర్థం ఉంటుంది. రాత్రిపూట ఒక అమ్మాయి యూనివర్సిటీ ముందు ఒక అపరిచిత వ్యక్తితో చేసిన సంభాషణ విద్యావ్యవస్థలోని చీకటిపై వెలుగులను ప్రసరింపజేసి పాఠకులను ఆలోచింపజేస్తుంది. అంత గాఢమైన భావాలను కొన్ని వాక్యాలతో చెప్పడం రచయిత గొప్పతనాన్ని సూచిస్తుంది.

> 'త్వమేవాహం' కథలో పార్థుడి పాత్ర ఆకట్టుకుంటుంది. బ్రహ్మచారిగా బతుకుతూ ఊరి బాగోగులు చూసుకుంటూ ఏమీ ఆశించకుండా పరుల సేవలో నిమగ్నమయ్యే మనిషి. ఉన్నతోద్యోగి అయిన తమ్ముడు తనతో రమ్మని ఎంత బతిమాలినా తన ఊరును విడిచి రాలేనని చెప్పడం పాఠకుడికి కంట్లో నీరు తెప్పిస్తుంది.

తెలంగాణ మాండలిక సొగసుతో బాల్యస్మృతులను నెమరువేసుకున్న కథ 'బౌండరీ దాటిన బాలు'. ఇది ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ఆటలో పోయిన బంతిని తిరిగి పిల్లలు ఎలా పట్టుకొచ్చారు అనేది కథ సారాంశం. ఇందులో పిల్లలు ఆనాటి తల్లిదండ్రులంటే ఎంత భయపడేవారో, ఇంటర్నెట్, కంప్యూటర్ లేని కాలంలో గల్లీ క్రికెట్‌ను ఏవిధంగా ఆడేవారో, వారి అమాయక ఆలోచనలను, మాటను ఈ కథలో పొందుపర్చాడు.

ఇక అమెరికాలో జీవితాల గురించి కథలు ఉన్నాయి. భారతదేశంలో ఉన్న కులం, అమెరికాలో కూడా పోలేదు అన్న ఉదంతాన్ని 'పాత్రాభినయం' అనే కథలో చక్కగా వివరించాడు. ఒక పార్టీలో 'బత్తుల' తన ఇంటిపేరు ఉన్నందున తనవాడని ఆప్యాయంగా పలకరించడం, ఆ తర్వాత అతను మనవాడు కాదని తేలడంతో అంటీముట్టనట్టుగా వ్యవహరించడం 'కులం' అనే గోడను మనవాళ్లు అమెరికాలో ఎంత బలంగా కట్టారో అర్థమవుతుంది.

అమెరికా వెళ్లి, అక్కడ విద్యార్థులు పార్ట్‌టైమ్ జాబ్‌లతో పడే కష్టాలను 'ఆడ్ జాబ్'లో చక్కగా వివరించాడు. అమెరికాలో ఉండే కార్పొరేట్ జీవితం ఎంత భయంకరంగా ఉంటుందో 'మేరి' పాత్ర ద్వారా చెప్పిస్తాడు. ఈ కథ చదివిన తర్వాత మనుషులందరికీ కష్టాలు ఒక్కటే అని బలంగా నమ్ముతాము. తాను గోదావరి జిల్లా వాడైనందున, అదే మాండలికంలో కోస్తా పట్టణాల్లో జరుగుతున్న రియల్ ఎస్టేట్ ఒక సెటైర్‌లా 'ఇసుక మేడలు' కథ ఉంటుంది. 'ఎత్తరుగుల ఇల్లు' కథలో వ్యవసాయం చేసుకుంటూ నలుగురిలో పరపతి పొందిన ఒక కుటుంబం కొత్తతరం డబ్బును సులువుగా సంపాదించాలనే ఆశలో ఎలా ఇక్కట్ల పాలైందో మనకు తెలుస్తుంది.

మధు ఈ కథల్లో మానవీయ విలువలు కలిగిన వాటిని పొందుపరిచాడు. ముఖ్యంగా తెలంగాణ, కోస్తా, అమెరికా జీవన చిత్రాలతో మూడు నదుల సంగమంగా మనకు కనిపిస్తుంది. అయితే, కొన్ని వర్ణనలు ఎక్కువై వస్తువును మింగేసే ప్రమాదం ఉంది. ఇది రచయిత సరిచూసుకోవాలి. ఏదేమైనా మధు ఫిరాయించిన పతంగి 'షాన్‌దార్, డోరేదార్, మజేదార్'గా ఉంది.



చంద్రశేఖర్
75060 13691

సుశ్లోకం




టి.సుధాకరశర్మ

నాస్త్యుద్యమ సమో బంధుః

శ్లోక: ఆలస్యం హి మనుష్యాణాం
శరీరస్థో మహాన్ రిపుః
నాస్త్యుద్యమ సమో బంధుః
కృత్వాయం నావసీదతి

భావం: మనుష్యుల శరీరంలోనే ఉంటూ వారిని నాశనం చేసే పెద్ద శత్రువు బద్ధకం. కష్టపడి పనిచేయడం మంచి శ్రేయోభిలాషి, బంధువు. ఎవరైతే సోమరితనము వీడి, కష్టపడి పని చేస్తారో వారు ఎప్పటికీ విఫలం చెందరు.



సెన్స్ ఆఫ్ సైలెన్స్!


ఆముదపు చేల నడుమ కాలిబాటలో
చేతులు కలిపి చేసుకున్న వాగ్దానం
తేమ తక్కువ గాలిలో
ఇంకా మొలకెత్తలేదు
ఆవపూల తోటల్లో సాయంసంధ్య
మనం గళం కలిపి విత్తుకున్న పాట
పరాగ స్వరం లేక తాలు
కాయల తాళంతో తెల్లబోయింది
సహారా ఎడారి దిబ్బలమీద
నువ్వూనేను కలుసుకున్న
అమావాస్య రాత్రి
చెలరేగిన ఇసుక తుపాను
ఆయిల్ సామ్రాజ్యాన్ని
ఇంకా వదలలేదు.
యాపిల్ చెట్ల లోయలో
పరుగులు తీసిన యవ్వనోద్రేకాల
ఉడుకు నెత్తుటి బాసలు మోహరించిన
ఆయుధాల కొనల చివర
చుక్కలు చుక్కలుగా రాలిపడుతున్నాయి
గోదావరి తీర తూర్పు కనుమల నడుమ
నువ్వూనేను కలిసి నాటిన విప్పచెట్లు,
రేలచెట్లు స్వయం నిర్బంధ
సమ్మతితో సరుకుగా మారి
ప్రజాస్వామికంగా
ఓట్ల పూలు పూస్తున్నాయి.



రవిమారుత్
98491 14369

ప్రపంచ యుద్ధాలనేవి రంగం మీదికి రానంతవరకూ, చౌరస్తాలో సరాయి లాంటిది అమెరికా! అక్కడికి ఎవరైనా రావచ్చు, ఎవరైనా పోవచ్చు. ఎవరైనా పనిచేయించుకోవచ్చు, మరెవరైనా చెయ్యొచ్చు. పనంతా అయిపోయాకా, బట్వారా చేసి చేతులు కడుక్కున్న తర్వాత, కూలీ, మేస్త్రీ, కామందు ముగ్గురూ కలిసివెళ్లి ఒకే అంగట్లో కాస్త గొంతు తడుపుకోవచ్చు. ఆ తర్వాత ఎవరి దారిన వారు పోవచ్చు!

రమ్మని పిలిచే పో!



కథానిక కమామిషు 6

ఈ పరిస్థితి మారిపోయి నూరేండ్లు దాటిపోయింది. అదలా ఉంచండి! మనం ప్రపంచ చరిత్ర గురించి మాటాడుకోడానికి ఇక్కడికి రాలేదు. మన సాహిత్యసీమను ఏలుతున్న కథానిక గురించీ, దాని కమామిషు గురించీ మాటాడుకోడాని కొచ్చాం! కథానిక పుట్టి, మెట్టిన ఇండ్లలో అమెరికా ఒకటి కనకనే దాని మాట అనుకోవలసి వచ్చింది మనకు. వాషింగ్టన్ ఇర్వింగ్ (1783–1859), ఎడ్గార్ యాలన్ పో (1809–1849), నెథానియెల్ హాథార్న్ (1804–1864), మార్క్ ట్వేయ్న్ (1835–1910), ఓ.హెన్రీ (1862–1910), ఎర్నెస్ట్ హెమింగ్వే (1899–1961), యాంబ్రోస్ బయెర్స్ (1842–?) లాంటి అమెరికన్ కథకుల గురించి ప్రస్తావించుకోకుండా, కథానిక చరిత్ర గురించి అర్థవంతంగా మాటాడుకోవడం సాధ్యం కాదు మరి!

> ప్రపంచ చరిత్రలో బహుముఖ ప్రజ్ఞావంతులు లేని దశ అనేది ఏదీ లేదు! కానీ పందొమ్మిదో శతాబ్దిలో, అన్ని దేశాల్లోనూ ఈ 'బహుముఖ ప్రతిభ' బహుముఖంగా వెల్లివిరిసినట్లు కనిపిస్తుంది. దానికేవో కారణాలు ఉండే ఉంటాయి. కానీ, ఇప్పుడు మనకవి అనవసరం.

మనకు ఇప్పుడు అవసరమైన విషయమేమిటంటే, ఆధునిక అమెరికన్ కథకు ఆద్యుడనిపించుకున్న ఎడ్గార్ యాలన్ పో ఆ కోవకు చెందినవాడే. కవి, కథానిక రచయిత, నవలా రచయిత, సాహిత్య విమర్శకుడు, సంపాదకుడు కూడా అయిన పో, తన నలభయ్యేండ్ల జీవితకాలంలో గొప్ప 'క్రిప్టోగ్రాఫర్'గా కూడా ప్రసిద్ధుడు కాగలిగాడు. పైపైన చూస్తే అర్థం కానంత నిగూఢంగా గుప్తరచన చెయ్యడమూ, అలాంటి 'గుప్తరచన'ల ముడివిప్పి చదవడమనే గుప్తజ్ఞానమే క్రిప్టోగ్రఫీ అంటే! మన భారతీయులకు ఈ మహా విద్య కరతలామలకమే గదా! చిత్రబంధ కవిత్వాలు చదివి బోధపరుచుకోలిగిన వారందరూ ఆధునిక పరిభాషలో క్రిప్టోగ్రాఫర్లే! అదలావుంచండి. 'పో' కన్నుమూసే కాలానికి కథానికకు 'షార్ట్ స్టోరీ' అనే పేరు స్థిరపడలేదు. 'పో' అలాంటి రచనలను 'వచన కథనా'లనే అన్నాడు. కన్నుమూయడానికి పదేండ్లు ముందు 'పో' రాసిన 'విలియమ్ విల్సన్' చక్కని నిర్మితితో కూడిన కథానిక!' అని కీర్తించని విమర్శకుడు లేడు!

ఇక, 'పో' రాసిన అపరాధ పరిశోధన కథానికలు కూడా 'లాక్షణిక' నిర్దుష్ట నిర్మాణ రీతులతో కూడినవని పండితులంటూ ఉంటారు. 'సమాజంతో సామరస్యం కుదిరే వరకూ కవి చేసే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వ'మని మన చలం చెప్పడానికి దాదాపు నూరేండ్లకు ముందు 'పో' కథానిక రచన కూడా అంతటిదేనని ఓ అపరాధ పరిశోధన కథానిక ద్వారానే చెప్పాడు. ఆయన కథానికలన్నింట్లోకీ అదే చిన్నదేమో కూడా! దానిపేరు 'ద టెల్ టేల్ హార్ట్'. ఇలాంటి కొన్ని కథల్లో శిల్పానికి సంబంధించిన అన్ని అంశాలూ నిర్మాణం, శైలి, పాత్ర చిత్రణ వగైరా తూకం వేసినట్లు కుదరడం 'పో' కథానికల గురించి తెలిసిన వాళ్లందరికీ తెలిసిన విషయమే! ఇదే, విషయం 'పో' రాసిన సైన్స్‌ఫిక్షన్ కథానికలకూ వర్తిస్తుంది.

చాలామంది– శ్రీశ్రీతో సహా– 'పో' కవిత్వం గురించి ప్రస్తావించి ఉన్నారు. 1934 ఫిబ్రవరిలో శ్రీశ్రీ రాసిన 'గంటలు' కవిత 'పో' రాసిన శబ్దానుకరణ (అనమటోపొయిక్) గీతానికి అనువాదం కాదని కవి ప్రత్యేకంగా చెప్పారు. అదలా ఉంచితే, 'పో' తన కథల్లో వాక్యాలను తరచూ 'చెక్కడం' చూస్తాం. ఇది కేవలం అక్షరరమ్యత, లేదా శైలీరమ్యతకు పరిమితమైన వ్యామోహమేనా? ఏమాత్రం కాదు! కథానిక వస్తువులో 'భావసమైక్యం' గురించి చాలామందే చెప్పారు. అయితే, కథానిక తాలూకు 'ప్రభావ సమైక్యం' గురించి మొదటిసారి సిద్ధాంతీకరించినవాడు మాత్రం 'పో'నే! కథాంశం, పాత్రలూ, వాటి చిత్రీకరణ, నేపథ్య వ్యవస్థ, కథకుల స్వరం, ఎత్తుబడి, ముగింపు ఇవన్నీ 'ప్రభావ సమైక్యా'న్ని మాత్రమే దృష్టిలో ఉంచుకొని రూపుదిద్దుకోవాలని తొలిసారి చెప్పినవాడు 'పో'.

బహుశా, విజ్ఞానశాస్త్రానికీ, కళకూ మధ్య, మనం అనుకునేంత దూరం లేదేమో! లియోనార్డో డావిన్సీ, గ్యొతే, హంఫ్రీ డేవీ, హెడీ లమార్, మారియా సిబిలా మెరియన్, బ్రయాన్ మే తదితరులు వైజ్ఞానికులు కావడంతో పాటు కళాకారులు కూడా! ఐన్‌స్టీన్, భాభా, సారాభాయ్, రాజా రామన్న, ఎస్.చంద్రశేఖర్‌లాంటి భౌతికశాస్త్రజ్ఞులు గొప్ప పియానో వాదకులు కావడమేమిటి? పో, వెల్స్, జగదీశ్ చంద్రబోస్, అజీమఫ్ లాంటి రచయితల రచనలు ఏది చూసినా అదే అనిపిస్తుంది. ఉప్పల లక్ష్మణరావు, మహీధర నళినీమోహనరావు, చందు సుబ్బారావు రాసిన పుస్తకాలు చదివినా అలాగే అనిపిస్తుంది. కుటుంబరావు, రోహిణీప్రసాద్ హిందూస్థానీ సంగీతం గురించి ముఖ్యంగా మరాఠీ నాట్య సంగీత్ గురించి రాసిన విషయాలు చూసినా అదే అనిపిస్తుంది.



మందలపర్తి కిశోర్
81796 91822

యాసంగిని బతికించిన 'కాళేశ్వర' గంగ

- రివర్స్ పంపింగ్ ద్వారా రెండుసార్లు కాళేశ్వరం నీళ్లు
- రైతులకు వరప్రదాయినిగా ఎస్సారెస్పీ వరద కాలువ
- మట్టికట్ట వేసి జలాలను ఒడిసి పట్టుకున్న ఆయకట్టు రైతులు
- కాళేశ్వరమే ఆదుకుందంటున్న భరోసాలో అన్నదాతలు



కాళేశ్వరం జలాలతో నిండుగా మారిన వరద కాలువ

మోర్తాడ్, మార్చి 15: 'కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది.. దీనివల్ల ప్రయోజనమేమీ లేదు.. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల కుంభకోణం జరిగింది' అంటూ ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. అది అవాస్తవమని తెలిసినా ప్రచారం మాత్రం మానలేదు. నిజంగానే కుంభకోణం జరిగిందని ప్రజలు భావించేలా కమిషన్లు, కమిటీలంటూ తెగ హడావుడి చేశారు. సోషల్ మీడియాలోనూ అదే తరహాలో ప్రచారం చేశారు. అయితే అదే కాళేశ్వరం ప్రాజెక్టు జలాలు నేడు వరద కాలువలోకి రాకపోతే పరిస్థితి ఏమిటో కాలువ చుట్టుపక్కల ఉన్న ప్రతి రైతుకు తెలుసు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం గాండ్లపేట్ వద్ద గండి పడటంతో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు నీళ్లు వచ్చే అవకాశం లేకుండాపోయింది. దీంతో రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం జలాలతో రెండుసార్లు వరద కాలువను నింపారు. ఫలితంగా యాసంగి పంటలకు కాళేశ్వరం జలాలు వరప్రదాయినిగా మారాయి. వరదకాలువకు గండిపడి కష్టకాలం దాపురించిన వేళ.. బాల్కొండ నియోజవర్గంతోపాటు జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో పంటలకు సాగునీరు అందిస్తున్నది కాళేశ్వరం గంగ మాత్రమే.

ఆదుకున్న పునరుజ్జీవ పథకం..

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా మార్చారు. ఇందుకోసం ప్రపంచమే అబ్బురపడేలా భారీ ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. వరి సాగులో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపారు. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని ఒడిసిపట్టి గంగను ఎదురెక్కించిన ఘనత కేసీఆర్‌ది. అటువంటి కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ భవిష్యత్తును కాపాడారు. ఎస్సారెస్పీ పరిధిలోని రైతులకు సాగునీటి గోస ఉండొద్దన్న ఉద్దేశంతో పునరుజ్జీవ పథకాన్నిచేపట్టారు. అందులో భాగంగానే నంది పంప్‌హౌస్, గాయత్రీ పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోయడంతో జగిత్యాల జిల్లా రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్ వరకు కాళేశ్వరం జలాలు చేరుకుంటున్నాయి. అక్కడి నుంచి ఎత్తిపోయడం ద్వారా నిజామాబాద్ జిల్లాలోని వరద కాలువ నిండుకుండలా మారింది.



వరద కాలువకు గండిపడితే..

గత ఏడాది అక్టోబర్ 9న నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం గాండ్లపేట్ వద్ద వరద కాలువకు గండిపడింది. ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల లేక వరదకాలువ బోసిపోయింది. రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం జలాలను జనవరి, మార్చిలో రెండుసార్లు నింపడంతో నాలుగు జిల్లాల పరిధిలోని వరదకాలువ ఆయకట్టు యాసంగి పంటలకు సాగునీటికి ఢోకాలేకుండా పోయింది. కాళేశ్వరం కుప్పకూలిందని దుష్ప్రచారం చేస్తున్న వారికి నిండుగా కనిపిస్తున్న వరద కాలువే సమాధానం చెప్తున్నది.

యాసంగి పంటలను గట్టెక్కించి..

గత ఏడాది అక్టోబర్‌లో వరద కాలువకు గండి పడటంతో రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని అందించాలని రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్న తరుణంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వరద కాలువ సీఈ, గాయత్రీ పంప్‌హౌస్ సీఈ సుమతీదేవి, శ్రీనివాస్‌గుప్తాతో మాట్లాడి రివర్స్‌పంపింగ్ ద్వారా వరద కాలువకు నీటిని అందించి, రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీంతో అధికారులు ఈ ఏడాది జనవరిలో పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని వరద కాలువలోకి ఎత్తిపోయగా ఆ జలాలు నిజామాబాద్ జిల్లా గాండ్లపేట వరకు చేరాయి. వరద కాలువకు గండి పడినచోట మరమ్మతు పనులను పరిశీలించేందుకు వచ్చిన సీఈ సుమతీదేవిని రైతులు కలిసి మరోసారి నీళ్లు ఎత్తిపోయాలని కోరారు. దీంతో ఈ నెల 5న మరోసారి వరద కాలువలోకి కాళేశ్వరం జలాలు చేరుకున్నాయి. ప్రస్తుతం చివరి దశలో ఉన్న ఎర్రజొన్న, మక్కజొన్న, వరి పంటలకు సాగునీటికి ఢోకా లేకుండాపోయింది.

కాలువలో మట్టికట్ట నిర్మించిన రైతులు

గాండ్లపేట వద్ద గండిపడటంతో వరద కాలువలో నీటిని నిల్వ చేయడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల రైతులు సొంత ఖర్చులతో వరద కాలువలో మట్టి కట్ట నిర్మించారు. ఈ ఏడాది జనవరిలో రివర్స్ పంపింగ్ ద్వారా వచ్చిన నీరు ఆ కట్ట వరకు చేరుకోగా కాలువ నిండుగా మారింది. యాసంగి పంటలకు సాగునీటికి ఢోకా లేకుండాపోయింది. కాలువ నిండుగా మారడంతో భూగర్భ జలాలు వృద్ధిచెందాయి. దీంతో బోరుబావులపై ఆధారపడి పంటలు పండించే రైతులకు కూడా లాభం చేకూరుతున్నది. కాళేశ్వరం జలాలు రాకపోతే పంటలు మొత్తం ఎండిపోయి తీవ్రంగా నష్టపోయే వాళ్లమని రైతులు చెప్తున్నారు.

కాళేశ్వరమే ఆదుకున్నది..



వరద కాలువకు గండిపడటంతో కాళేశ్వరం నీళ్లు ఇవ్వాలని కోరినం. నీళ్లు వస్తాయని తెలిసి వరద కాలువలో మట్టి కట్టను నిర్మించుకున్నం. రివర్స్ పంపింగ్ ద్వారా వరద కాలువకు నీళ్లు తేవడంతో పంటలను కాపాడుకోగలిగినం. ఎర్రజొన్న, మక్కజొన్న పంటలు చేతికచ్చినయ్. వరద కాలువల నిండా నీళ్లు ఉన్నాయి. మిగిలిన పంటలకు కూడా సమస్య లేదు. వరదకాలువ నీళ్లు లేకపోతే మాత్రం వేసిన పంటలన్నీ నష్టపోయేవాళ్లం.

– నారాయణ రైతు, కమ్మర్‌పల్లి, నిజామాబాద్ జిల్లా

బోర్లు మంచిగా పోస్తున్నయ్..



వరద కాలువలకు నీళ్లు రావడంతో భూగర్భ జలాలు పెరిగాయి. బోర్లు మంచిగా పోస్తున్నాయి. యాసంగి పంటలకు ఢోకా లేకుండా పోయింది. గండి పడ్డచోట పనులు తొందరగా పూర్తయితే, వరద కాలువకు ఎస్సారెస్పీ నీళ్లు ఎప్పుడూ వస్తూనే ఉంటయి. దాంతో చెరువులు నింపుకోవడంతోపాటు వరద కాలువకు ఇరువైపులా భూగర్భ జలాలు పెరిగి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవు. గండి పనులు తొందరగా పూర్తిచెయ్యాలి.

– పార్శపు పెద్దిరెడ్డి, రైతు, కమ్మర్‌పల్లి, నిజామాబాద్ జిల్లా



గుడిపల్లి రిజర్వాయర్ పరిశీలిస్తున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

గుడిపల్లి రిజర్వాయర్ నింపి సాగు నీరందించాలి

- అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు నష్టపోయే ప్రమాదం
- ఇంజినీర్లు, రాజకీయ నేతల ప్రమేయంతో కేఎల్‌ఐ భ్రష్టుపట్టింది
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, మార్చి 15 : గుడిపల్లి రిజర్వార్ నింపి పంట పొలాలకు సాగునీరు అందించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించి మాట్లాడారు. ప్రాజెక్టులోని ఐదు మోటర్లకు గానూ మూడు మోటర్లే పనిచేస్తున్నాయని, వాటి ద్వారా కూడా సక్రమంగా నీటిని విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రెగ్యులర్‌గా రెండు మోటర్ల నడిపి గుడిపల్లి రిజర్వాయర్‌ను నింపి రైతుల పంటలకు నీరందిస్తే సరిపోయేదని చెప్పారు. 26డీ కాల్వ పొడవునా ఉన్నపంట పొలాలు నీరందక వాడుపట్టాయని, మొక్కజొన్న గింజ పట్టే సమయంలో ఎండితున్నదని చెప్పారు. ఇంజినీర్లు, రాజకీయ నాయకులు కేఎల్‌ఐని భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నాడు మంత్రిగా గుడిపల్లి వద్ద కేఎల్‌ఐ ప్రాజెక్టుకు పౌండేషన్ వేశానని గుర్తుచేశారు. ఇక్కడి రైతుల ఇబ్బందులను గుర్తించి ప్రాజెక్టు చేపడితే గుడిపల్లి గట్టును నింపకుండా నిర్లక్ష్యం చేస్తూ నేడు పంటలు ఎండిపోవడానికి కారకులయ్యారని మండిపడ్డారు. కనీసం రెండు మోటర్లు నడిపిస్తే పంట పొలాలు ఎండిపోయేవి కాదని, అధికారుల నిర్లక్ష్యంవల్ల చేళ్లన్నీ ఎండుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే 3, 5 మోటర్లు నడిచేలా చర్యలు తీసుకుని, కాల్వ వెడల్పును పెంచాలని డిమాండ్ చేశారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం మద్దిమల్ల రాయిని చెరువులో నిరసన తెలుపుతున్న మద్దిమల్ల గ్రామస్థులు, రైతులు

సాగునీటి పనులపై వివక్ష ఎందుకు?

- రెండు కిలోమీటర్ల పనులు కూడా పూర్తిచేయలేరా?
- రాయిని చెరువు పైప్‌లైన్ పూర్తి చేయకపోతే ఉద్యమిస్తాం
- సర్కార్‌పై రాజన్న సిరిసిల్ల జిల్లా మద్దిమల్ల రైతుల ఫైర్
- రాయిని చెరువులో టెంట్‌వేసి ఆయకట్టు రైతుల నిరసన

ఎల్లారెడ్డిపేట, మార్చి 15: కాంగ్రెస్ సర్కార్ సాగునీటి పనులపై వివక్ష చూపుతున్నదని రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం మద్దిమల్ల రాయిని చెరువు ఆయకట్టు రైతులు మండిపడ్డారు. మెట్ట ప్రాంత రైతుల కల నెరవేర్చేలా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీ కింద వీర్నపల్లి, కోనరావుపేట మండలాలకు నీరందించేందుకు చేపట్టిన పనులను పూర్తి చేయకుండా కాంగ్రెస్ సర్కార్ తాత్సారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లయినా మద్దిమల్ల రాయిని చెరువుకు సంబంధించిన రెండు కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు చేపట్టక పోవడం దారుణమని అన్నారు. కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీ పనుల్లో భాగంగా మద్దిమల్ల రాయిని చెరువులో మిగిలిపోయిన పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాయిని చెరువులో రైతులు టెంట్ వేసి నిరసన తెలిపారు. మెట్ట ప్రాంత రైతుల కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాడు సాగునీటి యజ్ఞం చేపట్టారని తెలిపారు. మల్కపేట రిజర్వాయర్ ద్వారా నీరందించలేని ఎగువ ప్రాంతాలైన వీర్నపల్లి, కోనరావుపేట మండలాలకు సైతం నాలుగు లిఫ్టులతో నీటిని ఎత్తిపోయించేందుకు కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీ కింద రూ.166 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. అందులో భాగంగా అల్మాస్‌పూర్, శివంగాలపల్లి, మూలవాగు, హన్మాజీ చెరువులను, అలాగే వీర్నపల్లి మండలంలోని ఎనిమిది చెరువుల్లో నీళ్లు నింపేందుకు పనులు మొదలు పెట్టారని చెప్పారు. మద్దిమల్ల రాయిని చెరువును నింపి, కంచర్లలోని వెంకట్రాయని చెరువు, రేండ్ల కుంట, పోతరాయనికుంట, అల్మాస్‌పూర్ రంగం చెరువుల్లో నీళ్లు నింపేలా ప్రణాళికలు రూపొందించారని వివరించారు. 2023 ఫిబ్రవరిలో అల్మాస్‌పూర్ లిఫ్ట్ నుంచి రాయిని చెరువు నింపడానికి 15.716 కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. 375 మీటర్ల పొడవున కట్టను పునరుద్ధరించారని, మత్తడి మరమ్మతులు చేశారని, రెండు కొత్త తూములను నిర్మించినట్టు చెప్పారు. 13 కిలోమీటర్ల పైప్‌లైన్ పూర్తి చేశారని, అప్పుడు అటవీ శాఖ అనుమతుల కారణంగా మరో రెండు కిలోమీటర్లు ఆగిపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేండ్లయినా రెండు కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు పూర్తి చేయలేకపోయిందని మండిపడ్డారు. ఈ పైప్‌లైన్ పూర్తయితే 12 గ్రామాలకు నీళ్లందుతాయని, 13వేల ఎకరాలు సాగులోకి వస్తాయని తెలిపారు. రైతులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే పనులు పూర్తి చేసి, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో సర్పంచ్‌లు ప్యాట్ల రవి, సామల్ల దేవరాజు, సుధాకర్, బట్టు కృష్ణ, గుగులోత్ రమేశ్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, నాయకులు మల్లారపు అరుణ్, బోయిని రవి, గుగులోత్ సురేశ్, గుగులోత్ రవిలాల్, రఫీ, రైతులు పాల్గొన్నారు.



మంచిర్యాల జిల్లా సీతారాంపల్లి గోదావరిలో రైతులు తవ్వుకున్న కాలువ

సాగునీటి కోసం.. సొంత డబ్బులతో కాలువ

మంచిర్యాల జిల్లా రైతుల భగీరథ ప్రయత్నం

మంచిర్యాల, మార్చి 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలో గోదావరి పక్కనే ఉన్నా సీతారాంపల్లి, తాళ్లపల్లి రైతులు సాగునీటి కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్ సర్కార్‌లో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు దిగువన ఉన్న సుందిళ్ల బరాజ్‌లో నీళ్లు ఆపితే.. మంచిర్యాల గోదావరి నిండుకుండలా ఉండేది. దీంతో సీతారాంపల్లి, తాళ్లపల్లి గ్రామాల్లో దాదాపు వందల ఎకరాలకు సాగునీరు అందేది. ఎక్కడో మేడిగడ్డ కుంగిందని సుందిళ్లలోనూ నీళ్లను ఆపకుండా దిగువకు వదిలేస్తుండటంతో రెండేండ్లుగా మంచిర్యాల జిల్లాలోని గోదావరిలో నీరు లేకుండా పోయింది. దీంతో ఎల్లంపల్లి నుంచి పాయలా వచ్చే కొద్దిపాటి నీటిని ఒడిసిపట్టి పంటలను కాడుకునేందుకు రైతులు నడుం కట్టారు. ఎల్లంపల్లి నుంచి పాయలా వచ్చే గోదావరిలో ఓ చోట ఆగే నీటిని తమ పొలాలకు తరలించుకునేందుకు దాదాపు కిలోమీటరున్నర సొంత డబ్బులతో కాలువ తవ్వుకున్నారు. 40 మంది రైతులు ఎకరానికి రూ.1,500 చొప్పున జమ చేసి.. రూ.2 లక్షలతో జేసీబీ సాయంతో గోదావరిలో కాలువ తవ్వించారు. ఆ కాలువ గుండా వచ్చే నీటిలో మోటర్లు వేసి గోదావరి గట్టు పక్కనున్న కొద్దిపాటి ఎకరాల్లోని తమ పొలాలకు మళ్లించుకుంటున్నారు. ఎంతో శ్రమకోర్చి కాలువ తవ్వుకున్నామని, ఎండలు ముదిరితే ఈ మాత్రం నీళ్లు రావని.. పంట పొట్టదశకు వచ్చాక నీళ్లు రాకపోతే ఏమవుతుందోనంటూ ఆందోళన చెందుతున్నారు.



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలం రాఘాపూర్ చెరువు సమీపంలో పంటలు ఎండిపోవడంతో మేస్తున్న పశువులు

అడుగంటిన రాఘాపూర్ చెరువు

నాడు వెయ్యి ఎకరాలు.. నేడు 200 ఎకరాలు సాగు

కుమ్రంభీం ఆసిఫాబాద్/ సిర్పూర్ (యూ), మార్చి 15: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ) మండలం రాఘాపూర్ చెరువు అడుగంటిపోయింది. వర్షాకాలంలో నిండే ఈ చెరువు నీటిని యాసంగి పంటకే ఉపయోగిస్తారు. వర్షాకాలంలో చెరువు నీటిని ఉపయోగించరు. ఈ ఏడాది ఈ ప్రాంతంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక చెరువులోకి నీరు రాలేదు. ఏటా యాసంగికి వెయ్యి ఎకరాలు సాగు చేసిన రైతులు ఈ సారి 200 ఎకరాల్లోనే పంటలు వేశారు. అవి కూడా ఆరు తడి పంటలే అయినా.. నీళ్లు అందక పశువులకు గ్రాసంగా వదిలేశారు. గతంలో ఎండాకాలంలోనూ నిండుకుండలా ఉండే రాఘాపూర్ చెరువులో నీరు లేక ఈ సారి సాగు చేయలేకపోయామని రైతులు వాపోతున్నారు.

త్రిశంకుస్వర్గంలో 'కుసుమ్' రైతులు

పట్టాలెక్కని పీఎం కుసుమ్ ప్లాంట్లు

- ఏర్పాటుకు ఈ నెల 31న డెడ్‌లైన్
- ముప్పుతిప్పలు పెడుతున్న బ్యాంకులు
- ఆ లోగా పూర్తికాకుంటే అగ్రిమెంట్లు రద్దే!
- ఆలస్యమైతే నిబంధనల అమలుపై అనుమానం
- తీవ్ర ఆందోళనతో నలిగిపోతున్న అన్నదాతలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పీఎం కుసుమ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాట్లు చేసేందుకు ఎంపికైన రైతుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్టగా మారింది. తొలుత లాభాలొస్తాయని ఆశచూపి డిపాజిట్లుగా రైతుల నుంచి డబ్బులు కట్టించుకున్నారు. నోడల్ ఏజెన్సీగా అంతా తామే చూసుకుంటామని భరోసా ఇచ్చారు. చివరికి చేతులెత్తేశారు. సర్కార్ కదా అని నమ్మితే నట్టేట ముంచే పరిస్థితి దాపురించింది. ఇప్పుడు ఆ రైతులు త్రిశంకుస్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్లాంట్ల ఏర్పాటుకు బ్యాంకులు రుణాలివ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ముందే లక్షలు పెట్టుబడి పెట్టిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ ప్లాంట్లు నెలకొల్పేందుకు కేంద్ర పునరుద్పాదక ఇంధన వనరుల మంత్రిత్వశాఖ మార్చి 31న గడువుగా నిర్ణయించింది. అంటే ఇక రోజులు మాత్రమే మిగిలాయి. అంతలోపు పూర్తిచేయకపోతే పవర్ పర్చేంజ్ అగ్రిమెంట్లు రద్దవుతాయి. గడువు ముగియనున్న నేపథ్యంలో రుణాలు మంజూరైనా.. లబ్ధిదారులకు అందజేసేందుకు బ్యాంక్‌లు తర్జనభర్జన పడుతున్నాయి. రుణంగా అందించే మొత్తాన్ని విడుదల చేయడమే లేదు. దీంతో రైతులు అటు బ్యాంకుల చుట్టూ, ఇటు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగి వేసారిపోతున్నారు.

రైతులకు తప్పని అదనపు భారం

పీఎం కుసుమ్ పథకంలో రాష్ట్రంలో 1,450 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్రం అనుమతినిచ్చింది. దీనికోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఫీజు రూపంలో రూ.11 వేలు, ఈఎండీ రూపంలో ఒక మెగావాట్‌కు లక్ష+ జీఎస్టీ (రెండు లక్షలకు పైగా) నగదు చెల్లించారు. బ్యాంక్ లింకేజీ విషయంలో అనేక ఇబ్బందులొస్తున్నాయి. ఒక్కో రైతుకు రూ.25 లక్షల అదనపు భారం పడుతున్నది. పైగా బ్యాంక్‌లు రుణాలివ్వడమే లేదు. నోడల్ ఏజెన్సీ అయిన టీజీ రెడ్కో పట్టించుకోవడం లేదు. ఈ దశలో కనీసం బ్యాంకర్లు, రైతులతో ఒక్క అవగాహన సమావేశాన్ని కూడా రెడ్కో ఏర్పాటు చేయలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్లాంట్ల కోసం తీసుకొన్న స్థలాలను నాలా కన్వర్షన్ చేశారు. దీంతో ఆయా రైతులకు ఆ భూముల నుంచి రైతు భరోసా కూడా రావడంలేదు. దీంతో లాభాలు వచ్చేనా? అన్న అనుమానాలు రైతులను పట్టిపీడిస్తున్నాయి. ఈ రంగంలోకి అనవసరంగా ప్రవేశించామని రైతులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకం గడువును ఈ ఏడాది డిసెంబర్ వరకు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని టీజీ రెడ్కో వీసీ, ఎండీ అనీల తెలిపారు.

రాష్ట్రంలో ఇదీ పరిస్థితి

- గడువు ముగిశాక ప్లాంట్లు పెడితే కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వశాఖ ఇచ్చే యూనిట్‌కు 40 పైసల చొప్పున ఇచ్చే ప్రోత్సాహకం అందదు.
- గడువు ముగిస్తే పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు ఉంటాయా? లేదా? ప్లాంట్ నిర్మిస్తే యూనిట్‌కు రూ.3.13 ఇస్తారా? లేదా? అన్న అనుమానాలు రైతులను పట్టి పీడిస్తున్నాయి.
- బ్యాంకులు ఈ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులకు రుణాలివ్వడమే లేదు. ముందే మూడు నెలల ఈఎంఐలు చెల్లించాలని కొన్ని బ్యాంక్‌లు షరతులు కూడా విధిస్తున్నాయి. కొన్ని బ్యాంక్‌లైతే అదనపు (ఆస్తులను) ష్యూరిటీలు అడుగుతున్నారు.
- కొన్ని బ్యాంకులు సిబిల్ స్కోర్ లేదంటూ లోన్లు ఇవ్వలేమని చేతులెత్తేశాయి. ఒక్కో బ్యాంక్ ఒక్కో తరహా వడ్డీరేటు చెప్తున్నాయి.
- కొన్ని బ్యాంకులు రైతుల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు కట్టించుకుంటున్నారు. ఒక రైతును రూ.12 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలంటూ అది కూడా 15 ఏండ్లు ఎఫ్‌డీ చేయాలంటూ బ్యాంక్ అధికారులు ఒత్తిడి తెచ్చినట్టు రైతులు వాపోతున్నారు. రూ.5 లక్షల బీమా కట్టించుకున్న బ్యాంకులు కూడా ఉన్నాయి.
- ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరాయి. నెలలు గడిచిపోవడంతో సోలార్ ప్యానళ్లు, ప్లాంట్ వ్యవస్థాపన వ్యయం 10 శాతం పెరిగింది. దీనిని ఎవరు భరిస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
- ప్లాంట్ పూర్తయ్యాక 25 శాతం రుణం ఇస్తామంటూ మెలిక పెడుతున్నారు. ఈ 25 శాతం రైతుల మీదే భారం పడుతున్నది.

బడా బాబుల ప్రయోజనం కోసమే..

బడా బాబులకు ప్రయోజనం చేకూర్చేందుకే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారు. రైతులను బ్యాంకులు ముప్పుతిప్పలు పెడుతున్నాయి. సిబిల్ స్కోర్, ఆస్తులను ష్యూరిటీగా అడుగుతున్నారు. పీఎం కుసుమ్ స్కీం నిబంధనలు సడలించాలి. ఇతర రాష్ట్రాల సోలార్ ఇంటిగ్రేటర్లు వచ్చి తక్కువకు ప్లాంట్లు పెడతామని ఆశ చూపుతున్నారు. తక్కువ ధరవి అంట గడితే నాణ్యతలేమి ఉపకరణాలను అంటగట్టబోతున్నారు. దీంట్లో రైతులకు తీరని నష్టం కలగనున్నది. అధికారులు తక్షణమే రైతులు, బ్యాంకర్లు, సోలార్ ఇంటిగ్రేటర్లతో సమావేశం ఏర్పాటుచేసి సమస్యలు పరిష్కరించి, అనుమానాలను నివృత్తి చేయాలి.

– అశోక్‌కుమార్‌గౌడ్, సోలార్ ఎనర్జీ అసోసియేషన్, అధ్యక్షుడు

వ్యవసాయ అనుబంధ రంగాలు కుదేలు

- నిధుల్లేక రెండేండ్ల నుంచి పడక
- పేరుకుపోయిన బకాయిలు
- సాగు వదిలేస్తున్న ఉద్యాన రైతులు
- పాడి రైతుకు అందని ప్రోత్సాహం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ శాఖలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. గత పదేండ్లపాటు ప్రధాన రంగాలకు మించి ప్రగతి సాధించిన ఈ శాఖలు ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో నిధుల్లేక పడకేశాయి. ఉద్యాన శాఖలో రెండేండ్లుగా కొత్త పథకాలు అమలు కాకపోవడంతో కూరగాయల సాగును వదిలేస్తున్నారు. డ్రిప్, స్ప్రింకర్లకు ఇవ్వాల్సిన సబ్సిడీలు రూ.930 కోట్ల మేరకు పేరుకుపోయినట్టు సమాచారం. ప్రభుత్వం ఉద్యాన రైతులను పట్టించుకోవడం లేదని, కేవలం కేంద్ర పథకాలను మాత్రమే అందజేస్తున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాడి రైతులకు అందని ప్రోత్సాహకాలు

వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రధానమైన పాడి పరిశ్రమకు బీఆర్‌ఎస్ హయాంలో ఇతోధికంగా ప్రోత్సాహకాలు ఇవ్వడంతోపాటు బర్రెలు, ఆవులు, గొర్రెల పంపిణీ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత లీటర్‌కు రూ.4 చొప్పున పాడి రైతులకు ఇచ్చే ఇన్సెంటివ్ నిలిచిపోయింది. ప్రస్తుతం పాడి రైతులకు ప్రభుత్వం దాదాపు రూ.5 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. గొర్రెలు, బర్రెలు, ఆవుల పంపిణీ పథకాల ఊసే లేకుండా పోయింది. శిశు సంక్షేమ శాఖకు పాలను సరఫరా చేసిన విజయ డెయిరీకి రూ.50 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి.

నీరసించిన మత్స్యశాఖ

బీఆర్‌ఎస్ హయాంలో ఎగుమతుల్లో ముందున్న మత్స్యశాఖ కాంగ్రెస్ పాలనలో దారుణంగా వెనుకబడింది. లబ్ధిదారులకు ఈ శాఖ చెల్లించాల్సిన బకాయిలు రూ.190 కోట్ల మేరకు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఏటా చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ గత రెండేండ్ల నుంచి నిధుల్లేక తూతూమంత్రంగా సాగుతున్నది. చేప పిల్లలు పంపిణీ చేసిన ఏజెన్సీలు తమ బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రస్తుతం కేంద్రం నుంచి వచ్చే వాటా నిధులతోనే రాష్ట్ర మత్స్య శాఖ తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్టు తెలుస్తున్నది.

ఇరాన్ నుంచి భారత్‌కు చేరుకున్న విద్యార్థులు

న్యూఢిల్లీ, మార్చి 15: యుద్ధ సంక్షోభంలో కూరుకుపోయిన ఇరాన్ నుంచి భారత విద్యార్థులను స్వదేశానికి తరలించే ప్రక్రియను కేంద్రం ప్రారంభించింది. ఆదివారం 70 మందికిపైగా భారతీయ విద్యారులు ఇరాన్ నుంచి దుబాయ్‌కు వచ్చి, అక్కడ్నుంచి ఢిల్లీకి చేరుకున్నారు. వైద్య విద్యను అభ్యసించేందుకు ఇరాన్‌కు వెళ్లిన వీళ్లంతా యుద్ధ సంక్షోభంలో చిక్కుకోవటంతో, భారత ప్రభుత్వ సమన్వయంతో విద్యార్థులను సురక్షితంగా తరలించే ప్రక్రియను ఇరాన్‌లోని మన రాయబార కార్యాలయం చేపట్టింది. ఇందులో అత్యధిక మంది జమ్ముకశ్మీర్‌కు చెందిన వాళ్లే ఉన్నట్టు మీడియా కథనాలు తెలిపాయి. వీరంతా ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన తర్వాత తమ స్వస్థలాలకు బయల్దేరారు. ఆల్ ఇండియా మెడికల్ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ మోమిన్ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం, టెహ్రాన్ యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సుమారు 1,200 మంది భారతీయులు విద్యనభ్యసిస్తున్నారు.



ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని పీపీ రావు ప్రాజెక్టు నీళ్లు అందక చంద్రపల్లిలో ఎండిపోయిన వరి పొలం

తలాపున నీళ్లున్నా.. తడారిపోతున్న పంటలు

ఆసిఫాబాద్ జిల్లా పీపీ రావు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ఆందోళన

దహెగాం, మార్చి 15: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం చంద్రపల్లి గ్రామంలోని ఆయకట్టు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. తలాపునే నీళ్లున్నా, అవి పొలాలకు రాక కండ్లముందే పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని పీపీ రావు ప్రాజెక్టులో నీళ్లు ఉన్నా ఆయకట్టుకు అందడం లేదు. చంద్రపల్లిలో పొలాలకు డీ–3 కెనాల్ నుంచి నీళ్లు వస్తాయన్న ఆశతో వరిసాగు చేస్తే.. డీ–3 కెనాల్లో పిచ్చి మొక్కలు మొలవడం, తూములు సరిగా లేకపోవడంతో ఆయకట్టుకు రావాల్సిన నీళ్లు.. వృథాగా ఎర్రవాగులో కలిసిపోతున్నాయి. నీటి పారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని ఇక్కడి రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కెనాల్‌ను బాగుచేసి నీరందించాలని వేడుకుంటున్నారు.



రంజాన్.. ఆత్మశుద్ధి సమయం

కలిసిమెలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం

అధికారిక ఇఫ్తార్‌లో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రంజాన్ అంటే ఆత్మశుద్ధి చేసుకొనే సమయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. ఈ పర్వదినాన్ని సోదరభావంతో జరుపుకోవాలని కోరారు. అందరం కలిసిమెలిసి తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు అధిక ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం తరుపున ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మంత్రి అజారుద్దీన్‌తో పాటు మతపెద్దలతో కలిసి విందారగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నిస్తున్న వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని, బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్ల ప్రోత్సాహకం అందజేశామని, క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగమిచ్చామని చెప్పారు.

బెనిఫిట్స్ రాక రిటైర్డ్ జేఎల్ మృతి

మొదటిపేజీ తరువాయి...

అన్నపురెడ్డిపల్లి, దమ్మపేటలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వట్టికొండ వీరకుమారి టీచర్‌గానే పనిచేస్తున్నారు. ఓ కూతురి వివాహం కాగా మరో కుమార్తె బీటెక్ చదువుతున్నది. శ్రీధర్‌కు ఇప్పటివరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేటు వైద్యశాలలో దాదాపు రూ.1.2 కోట్లు వెచ్చించి లంగ్స్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నారు. కుటుంబ సభ్యులు అప్పులు చేసి చికిత్స చేయించారు. రెండు నెలల నుంచి హైదరాబాద్‌లో ఉండి చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మరణించారు. బెనిఫిట్స్ రాలేదన్న ఒత్తిడి మరింతగా పెరగడంతో ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్రీధర్ మృతికి సర్కార్‌దే బాధ్యత..

అనారోగ్యంతోపాటు అప్పుల బాధతో మానసిక వేదనకు గురికావడం వల్లనే రిటైర్డ్ జేఎల్ శ్రీధర్ మరణించారని యూటీఎఫ్ ఖమ్మం జిల్లా నేతలు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు ఆరోపించారు. ఈయన మరణానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల కోసం గత డిసెంబర్ నుంచి పలుమార్లు ప్రభుత్వాన్ని సంప్రదించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ తరపున కూడా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శికి విన్నవించినా బెనిఫిట్స్ విడుదల చేయలేదని వారు పేర్కొన్నారు.

ఫ్రీ టికెట్లు అమ్ముకున్న ఎయిరిండియా ఉద్యోగులు

- 4వేల మందిపై చర్యలు!



న్యూఢిల్లీ, మార్చి 15: టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా పలువురు ఉద్యోగులపై చర్యలకు దిగింది. ఉద్యోగులకు కల్పించే లీజర్ ట్రావెల్ పాలసీని దుర్వినియోగం చేసినందుకు గాను పెనాల్టీలు విధించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. ఎయిరిండియాలో ఎంప్లాయీ లీజర్ ట్రావెల్ (ఈఎల్‌టీ) పాలసీ కింద ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, జీవిత భాగస్వాములకు ఉచిత విమాన ప్రయాణ సదుపాయం ఉంటుంది. ఏడాదికి కొన్ని ఉచిత టికెట్లు కేటాయిస్తారు. అయితే సంస్థ జరిపిన అంతర్గత దర్యాప్తులో కొందరు ఈ పాలసీని దుర్వినియోగం చేసినట్టు తేలింది. మొత్తంగా 4 వేల మంది ఉద్యోగులు ఈ పాలసీని దుర్వినియోగం చేసినట్టు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. తమ కుటుంబ సభ్యులు కానప్పటికీ తమ వారేనని చూపించి ట్రావెల్ పాలసీ ప్రయోజనాలను కొందరు ఉద్యోగులు పొందినట్టు తెలుస్తున్నది. కొందరైతే ఉచిత టికెట్లు పొంది.. వాటిని వేరే వ్యక్తులకు అధిక ధరకు విక్రయించిన ఉదంతాలూ దర్యాప్తులో తేలినట్టు సంబంధిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై ఎయిరిండియా అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటనా జారీచేయలేదు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ దుర్వినియోగం చోటుచేసుకుందని తెలిసింది.



సిద్దిపేటలో రిటైర్డ్ ఉద్యోగుల నిరాహార దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

రిటైర్డ్ ఉద్యోగుల చావుకు రేవంతే బాధ్యుడు

- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాక ఇప్పటికే 60 మంది వరకు చనిపోయిండ్రు
- ఇంకెంతమంది చనిపోతే ఈ కాంగ్రెస్ సర్కార్ మేల్కొంటుంది?
- బీఆర్‌ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్
- సిద్దిపేట పట్టణంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ దీక్షకు సంఘీభావం

సిద్దిపేట, మార్చి 15: పెన్షన్ బెనిఫిట్స్ రాక రిటైర్డ్ ఉద్యోగుల ప్రాణాలు పోతున్నా రేవంత్‌రెడ్డి సర్కార్ పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ శాసనపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఇప్పటికే 60 మంది చనిపోయారని, వారి చావులకే సీఎం రేవంత్‌రెడ్డే బాధ్యుడని అన్నారు. ఇంకెంతమంది చనిపోతే ముఖ్యమంత్రి స్పందిస్తారని ప్రశ్నించారు. బెనిఫిట్స్, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులు సిద్దిపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన నిరహార దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 35 ఏండ్లు కష్టపడి పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగులను రేవంత్‌రెడ్డి సర్కార్ రోడ్డుమీదకు తెచ్చిందని మండిపడ్డారు. పెండింగ్ డీఏలు ఇస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే మాట తప్పారని విమర్శించారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇవ్వడానికి మనసు రావడం లేదని ధ్వజమెత్తారు. రూ.10 వేల కోట్ల బకాయిలు ఇవ్వాలని రిటైర్డ్ ఉద్యోగులు అడిగితే.. 'నన్ను కోసుకొని తిన్నా డబ్బులు లేవు' అన్న రేవంత్‌రెడ్డికి రూ.96 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచి, మూసీ అభివృద్ధి కోసం 10వేల ఇండ్లు కూల్చడానికి సిద్ధం అయ్యాడని దుయ్యబట్టారు. బడా కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తూ, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు డబ్బులు ఇస్తారు కానీ ఉద్యోగులకు ఇవ్వడం చేతకావడం లేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి కమీషన్ ఇచ్చే వారికే డబ్బులు ఇస్తారని, కమీషన్ ఇవ్వరని ఉద్యోగులకు డబ్బులు ఇవ్వడం లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రిటైర్డ్ ఉద్యోగులకు నెలలోపే బెనిఫిట్స్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 92వేల మంది ఉద్యోగులు కేసీఆర్ హయాంలో రిటైర్డ్ అయితే వెంటనే డబ్బులు చెల్లించినట్టు చెప్పారు. ఉద్యోగుల గొంతుకగా అసెంబ్లీలో పోరాటం చేసి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ.లక్షా యాభై ఐదు వేల కోట్ల అప్పులు తెచ్చిందని అన్నారు. రూ. 3 లక్షల కోట్ల బడ్జెట్ పెడుతున్నారని, అందులో రూ.పదివేల కోట్లు రిటైర్డ్ ఉద్యోగుల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలను నిర్వీర్యం చేస్తున్న సర్కార్

కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలను నిర్వీర్యం చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హరీశ్‌రావును కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేస్తున్న పోరాటానికి బీఆర్‌ఎస్ మద్దతు ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లను ప్రీప్రైమరీ టీచర్లుగా గుర్తించి, ప్రీప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే నిర్వహించేలా చూడాలని కోరారు. అసలు ప్రభుత్వ స్కూళ్లలో పెడుతున్న ప్రీ-ప్రైమరీకి, అంగన్‌వాడీలకు తేడా ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హెల్పర్ స్థాయి నుంచి ప్రమోషన్ పొందిన వారికి టీచర్‌గా పూర్తి జీతం ఇవ్వాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు.



హైదరాబాద్ లక్డీకాపూల్‌లో జరిగిన సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ నేతలు, ప్రజాప్రతినిధులు

బడ్జెట్‌లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి

- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీ కోటా అమలుచేయాలి
- లేదంటే బీసీలంతా ఏకమై రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి
- బీసీ సంఘాల సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, మార్చి 15: బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని, వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 42 శాతం బీసీ కోటాను అమలు చేయాలని, లేదంటే బీసీలంతా ఏకమై ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాయని బీసీ నేతలు స్పష్టంచేశారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం లక్డీకాపూల్‌లోని హెటల్ సెంట్రల్ కోర్టులో బీసీ సంఘాలు, బీసీ ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ వీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల సమయంలో మాట మార్చి బీసీలను మోసగించిందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామన్నారని, కానీ కేవలం రూ.3వేల కోట్లకే సరిపెట్టిందని ధ్వజమెత్తారు. రిజర్వేషన్ల విషయంలో బీసీలకు మొదటి నుంచి అన్యాయమే జరుగుతున్నదని శాసనమండలి సభాపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండున్నరేండ్లలో కాంగ్రెస్.. బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. బీసీలు అడుక్కోవడం మాని సంఘటితంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలపై ఉన్న వ్యతిరేకత తన పాలనలోనే స్పష్టమైందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిరిగానే పరిషత్ ఎన్నికల్లో మరోసారి మోసగిస్తూ ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని, పోరాడి రిజర్వేషన్ల హక్కులను సాధించుకుంటామని తేల్చిచెప్పారు. అనంతరం బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని, బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని, విద్య, ఉద్యోగ, కాంట్రాక్టు రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, బీసీ అత్యాచార నిరోధక చట్టాన్ని వెంటనే ప్రవేశపెట్టాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ సంఘం కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, రామకృష్ణ, నందగోపాల్, వంశీ, ఉషా, సమ్మయ్య పాల్గొన్నారు.



అణ్వాయుధాలను పరీక్షించే ముందు కిమ్‌జోంగ్ ఉన్, కిమ్ జుఆ

అణ్వాయుధాలను ప్రయోగించే..

రాకెట్ లాంచర్లను పరీక్షించిన ఉత్తర కొరియా

ప్యాంగ్యాంగ్, మార్చి 15: శత్రు దేశాలపై అణ్వాయుధాలను ప్రయోగించ గల రాకెట్ లాంచర్లను ఉత్తర కొరియా పరీక్షించింది. అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, కుమార్తె కిమ్ జు ఆ సమక్షంలో శనివారం '600 ఎంఎం క్యాలిబర్' 12 మల్టీపుల్ రాకెట్ లాంచర్లను ఉత్తర కొరియా పరీక్షించినట్టు ప్రభుత్వ మీడియా 'కేసీఎన్‌ఏ' వార్తా కథనం పేర్కొన్నది. జపాన్ సముద్ర జలాల్లో అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త విన్యాసాలు చేపట్టిన వేళ.. ఉత్తర కొరియా ఈ వ్యూహాత్మక అణు క్షిపణి పరీక్షలు జరపటం కీలకంగా మారింది. సుమారుగా 450 కిలోమీటర్ల పరిధిలో శత్రుదేశాల్ని అంతమొందించటానికి ఈ తరహా రాకెట్ లాంచర్లను వాడతారు. సాధారణ రాకెట్ల కంటే భిన్నంగా, లక్షిత ప్రదేశంపై అణుదాడికి ఉపయోగిస్తారు. వ్యూహాత్మక అణ్వాయుధాల విధ్వంసక శక్తిపై ఆ దేశాలకు (యూఎస్, ద.కొరియా) అవగాహన కల్పించేందుకు ఉత్తర కొరియా ఈ ప్రయోగాలు జరిపినట్టు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

డెస్క్ జర్నలిస్టుల గొంతుక డీజేఎస్

- అక్రెడిటేషన్, హెల్త్‌కార్డులు, ఇండ్ల స్థలాల కోసం ఐక్యపోరాటం
- డీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్
- నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా పలు తీర్మానాలు



నూతనంగా ఎన్నికైన డీజేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తేతెలంగాణ):డెస్క్ జర్నలిస్టుల హక్కుల కోసం డెస్క్ జర్నలిస్టుల సంఘం (డీజేఎస్) పోరాడుతుందని రాష్ట్ర అధ్యక్షుడు బాదిని ఉపేందర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో డీజేఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అక్రెడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రింట్, ఎలాక్ట్రానిక్, వెబ్ మీడియాల్లో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు. డీజేఎస్ విజ్ఞప్తి మేరకు జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లో డెస్క్ జర్నలిస్టులకు చోటు కల్పిస్తామని, మహిళలకు 33 శాతం కోటా కేటాయిస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఉధృతపోరాటానికి సిద్ధంకావాలని డెస్క్ జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.

డీజేఎస్ ప్రధాన కార్యదర్శిగా రాజారాం..

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో డీజేఎస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా కే ఎన్ రాజారాం, ఉపాధ్యక్షుడిగా సోమ నర్సయ్య (వరంగల్), కోశాధికారిగా వెంకటరమణ, సంయుక్త కార్యదర్శులుగా కనపర్తి రమేశ్ (కరీంనగర్), కాంకూరి వెంకటేశ్వర్ (ఖమ్మం), భీంరావు (నిజామాబాద్), కార్యవర్గ సభ్యులుగా గరీమ, పద్మ, సత్యప్రసాద్ ఎన్నికయ్యారు. సమావేశంలో డెస్క్ జర్నలిస్టులు అశోక్, సదానందం, నరేందర్, లింబాద్రి, రమేశ్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అటవీ సిబ్బందికి అందని కార్పొరేట్ వైద్యం

- చెల్లని ప్రభుత్వ ఆరోగ్య కార్డులు
- డబ్బు చెల్లిస్తేనే వైద్యం చేస్తామంటున్న దవాఖానలు
- వైద్య ఖర్చులు భరించలేక అల్లాడిపోతున్న ఉద్యోగులు
- సగం ఖర్చులే రీయింబర్స్ చేస్తున్న బీమా కంపెనీలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అటవీ శాఖ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య కార్డులు ఎక్కడా చెల్లడం లేదు. వాటిని ఏ ప్రైవేట్ దవాఖానలు అంగీకరించడం లేదు. ఆ ఆరోగ్య కార్డులపై వైద్య సేవలు అందించబోమని, డబ్బులు చెల్లిస్తే వైద్యం మొదలు పెడుతామని కార్పొరేట్ దవాఖానలు కరాకండిగా చెప్తున్నాయి. దీంతో వైద్య ఖర్చులు భరించలేక అల్లాడిపోతున్నామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది వాపోతున్నారు. వారికి ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నప్పటికీ దీని వల్ల వైద్య ఖర్చులన్నీ ముందుగానే చెల్లించాల్సి వస్తున్నది. అందులో 40-50% సొమ్మును మాత్రమే బీమా కంపెనీలు రీయింబర్స్ చేస్తున్నాయి. దీంతో అటవీ శాఖ ఉద్యోగులు అన్ని విధాలుగా నష్టపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కనీసం అటవీ శాఖ మంత్రి కూడా ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించడం లేదని తెలంగాణ బీట్ ఆఫీసర్ల సంఘం రాష్ట్ర నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఆరోగ్య కార్డులు చెల్లుబాటయ్యేలా చూడాలని ఆ సంఘం నాయకుడు నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వంపై పోరుకు కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

కాందహార్ మిలిటరీ స్థావరంపై పాక్ దాడులు

ఇస్లామాబాద్, మార్చి 15: పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరుకున్నాయి. ఆదివారం కాందహార్ మిలిటరీ స్థావరమే లక్ష్యంగా పాకిస్థాన్ వరుస దాడులకు పాల్పడింది. కాందహార్‌లో కీలకమైన మౌలిక సదుపాయాలను తమ దళాలు నిర్వీర్యం చేశాయని పాకిస్థాన్ భద్రతా యంత్రాంగం తెలిపింది. కాందహార్, తూర్పు అఫ్ఘానిస్థాన్‌పై పెద్ద ఎత్తున దాడులను జరిపామని, అఫ్ఘానిస్థాన్‌కు చెందిన అత్యంత సున్నితమైన కేంద్రాలను నాశనం చేసినట్టు పేర్కొన్నది. టీటీపీ కేంద్రాలు, తాలిబాన్ మౌలిక సదుపాయాలు లక్ష్యంగా ఈ దాడులు కొనసాగినట్టు తెలిపింది. రావల్పిండిపై అఫ్ఘాన్ డ్రోన్ దాడులను అడ్డుకున్న తర్వాత.. పాక్ ప్రతీకారంతో రెచ్చిపోయింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. గత కొన్ని వారాలుగా ఇరు దేశాల సరిహద్దు వెంబడి భీకరమైన దాడులు కొనసాగుతున్నాయి. దీంతో ప్రాంతీయ భద్రతా సంక్షోభం తీవ్రరూపం దాల్చింది.

డ్రోన్లు కూల్చే సాంకేతికత ఇస్తాం

ప్రతిగా మాకు ఆర్థిక, సాంకేతిక సహకారం అందించండి

పశ్చిమాసియా దేశాలకు ఉక్రెయిన్ అధ్యక్షుడి ఆఫర్

కీవ్, మార్చి 15: 'మీరు మాకు ఆర్థిక సహాయం, సాంకేతిక సహకారం ఇవ్వండి. ఇరాన్ డ్రోన్లను సమర్థంగా ఎలా ఎదుర్కోవాలో, వాటిని ఎలా విచ్ఛిన్నం చేయాలో మా అనుభవజ్ఞ బృందాల సహకారం అందుకోండి' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమాసియా దేశాలకు ఆఫర్ ఇచ్చారు. ఇరాన్ ప్రయోగిస్తున్న కామికేజ్ డ్రోన్లను ఎలా ఎదుర్కోవాలో తెలియక తీవ్రంగా నష్టపోతున్న పశ్చిమాసియా దేశాలకు సాంకేతిక సహాయం అందించేందుకు కీవ్ నుంచి అయన కొన్ని బృందాలను అరబ్ దేశాలకు పంపారు. ఈ సందర్భంగా జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలను ఆదివారం మీడియా విడుదల చేసింది. ఇరాన్ తయారు చేసిన డ్రోన్‌లను ఎలా ఎదుర్కోవాలో సహకరించేందుకు ఉక్రెయిన్ పలు నిపుణుల బృందాలను పంపిందని ఆయన చెప్పారు. ఒక్కో బృందంలో డజన్ల కొద్దీ నిపుణులున్నారని, వారు స్థానిక రక్షణ వ్యవస్థలను పరిశీలించి డ్రోన్ రక్షణ వ్యవస్థను సమర్థంగా ఎలా నిర్వహించాలో తెలియజేస్తారని తెలిపారు.

గురుకుల అభ్యర్థులతో సర్కార్ ఆటలు!

కోర్టు తీర్పులనూ అమలుచేయని ట్రిబ్ • ఇష్టారీతిన పోస్టుల భర్తీ ప్రక్రియ • 9,200 పోస్టులకు కేసీఆర్ హయాంలో నోటిఫికేషన్

- అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో నిలిచిన నియామకాలు
- అనంతరం కాంగ్రెస్ సర్కార్ ఇష్టారీతి వ్యవహారం
- ఎంపీ ఎన్నికల కోసం హడావుడిగా 'డిసెండింగ్' విధానం పాటించకుండా పోస్టింగ్‌లు
- దీంతో 1,800 పోస్టులకు పైగా బ్యాక్‌లాగ్
- కోర్టును ఆశ్రయించిన మెరిట్ అభ్యర్థులు
- వారికి అనుకూలంగా తీర్పు చెప్పిన హైకోర్టు



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): గురుకుల పోస్టులకు పోటీ పడుతున్న అభ్యర్థుల జీవితాలతో సర్కార్ చెలగాటమాడింది. గత పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోస్టుల భర్తీని అవరోహణ క్రమంలో కాకుండా ఆరోహణ పద్ధతిలో చేపట్టడంతో వందలాది నిరుద్యోగులకు అన్యాయం జరిగింది. ఈ విధానంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేయగా, డౌన్‌మెరిట్ విధానం అమలు చేసి న్యాయం చేస్తామని అప్పట్లో ప్రభుత్వం హామీ ఇచ్చింది. గురుకుల పోస్టుల్లో బ్యాక్‌లాగ్ లేకుండా చూస్తామని చెప్పినప్పటికీ, ఆచరణకు నోచుకోలేదు. నోటిఫికేషన్ ప్రకారమే పోస్టుల భర్తీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చివరకు మాట నిలుపుకోలేదు. మరోవైపు, నోటిఫికేషన్‌లో పేర్కొన్న 9,210 పోస్టుల్లో దాదాపు 1,800 పోస్టులు మళ్లీ 'బ్యాక్‌లాగ్' రూపంలో మిగిలిపోయాయి. దీంతో సర్కార్ తీరు, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) నిబంధనలకు విరుద్ధంగా అనుసరించిన విధానాలను పలువురు గురుకుల అభ్యర్థులు హైకోర్టులో సవాల్ చేశారు. ధర్మాసనం కూడా గురుకుల అభ్యర్థులకు అండగా నిలిచింది. డౌన్‌మెరిట్ పాటించాలని ఆదేశించింది. అయినా సర్కార్ అమలు చేయకుండా ఈ తీర్పును సవాల్ చేసింది.ఇప్పుడు కూడా గురుకుల అభ్యర్థులకే హైకోర్టు అనుకూలంగా తీర్పు చెప్పింది. ఇకనైనా తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

1,800 పోస్టులకుపైగా బ్యాక్‌లాగ్‌లు

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ గురుకులాల్లో డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, స్కూల్ లైబ్రేరియన్, స్కూల్ పీడీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ మొత్తంగా 9,210 పోస్టుల భర్తీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ట్రిబ్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2023 ఆగస్టులోనే రాత పరీక్ష నిర్వహించింది. అయితే, కోర్టు కేసుల నేపథ్యంలో మ్యూజిక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టులను మినహాయించి మిగతా పోస్టుల భర్తీ చేపట్టింది. అవరోహణ క్రమంలో అంటే డీఎల్ నుంచి టీజీటీ వరకు పోస్టుల భర్తీని చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే, అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరించింది. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న హడావుడి నిర్ణయాలతో అభ్యర్థులను ఆగం చేసింది. డిసెండింగ్ ఆర్డర్‌కు తిలోదకాలిచ్చింది. పీజీటీ, ఆ తరువాత టీజీటీ పోస్టుల భర్తీకి రాత్రికిరాత్రే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి, తుది జాబితాలను ప్రకటించింది. 2024 ఫిబ్రవరి, మార్చిలో అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఇచ్చింది. మొత్తంగా 8,708 పోస్టులకు 1:2 నిష్పత్తిలో ఎంపిక చేసింది. కొన్ని క్యాటగిరీల్లో అర్హులు లేరంటూ 9,210 పోస్టుల్లో 404 పోస్టులను భర్తీ చేయలేదు. ఆ తర్వాత డీఎస్సీ, జూనియర్ అసిస్టెంట్, జేఎల్ పోస్టులను భర్తీ చేయడంతో మరిన్ని ఖాళీ అయ్యాయి. మొత్తంగా 1,800 పోస్టులకుపైగా ఖాళీగా మిగిలిపోవడం గమనార్హం.

మరోసారి కోర్టు తీర్పు

ట్రిబ్ అనుసరించిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో విసుగెత్తిన అభ్యర్థులు కోర్టు మెట్లు ఎక్కారు. అవరోహణ క్రమంలో పోస్టుల భర్తీ చేపట్టకుండా, ఆరోహణ పద్ధతిలో ఒకేసారి అన్ని ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా, ఒక అభ్యర్థి మూడు, నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, అందువల్ల 1,800 పోస్టులకుపైగా ఖాళీలు ఏర్పడే పరిస్థితి ఏర్పడిందని కోర్టుకు విన్నవించారు. గతంలో 2017లో విద్యుత్తు సంస్థలకు సంబంధించి అసిస్టెంట్ ఇంజినీర్ల నియామక ప్రక్రియ, 2022లో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో వందలాది పోస్టులు మిగిలిన సందర్భాల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉదహరించారు. ఒకరు ఉద్యోగానికి ఎంపికైన తర్వాత ఆ పోస్టులో జాయిన్ కాకపోతే, తద్వారా మిగిలిపోయే పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని, ఆ క్రమంలో ఆయా బోర్డులు మిగిలిన పోస్టులను భర్తీ చేశాయని హైకోర్టుకు వివరించారు. ప్రస్తుతం ట్రిబ్ చేపట్టిన విధానం వల్ల వేలాది పోస్టులు బ్యాక్‌లాగ్ ఏర్పడటమేగాక, వేలాది మంది తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నదని అభ్యర్థులు కోర్టు ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. నాన్ జాయినింగ్ ఉద్యోగాలను తదుపరి మెరిట్‌లో ఉన్న అభ్యర్థులతో భర్తీ చేయాలని విన్నవించినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకుండా పోయిందని వాపోయారు. తుదకు గురుకుల అభ్యర్థులకు అనుకూలంగా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. సుప్రీంకోర్టు ఆదేశానుసారం గురుకుల నియామకాల్లో మిగిలిపోతున్న ఉద్యోగాలన్నింటిని తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఒకే సమయంలో బహుళ పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చిన సమయంలో, అభ్యర్థులు ఒక పోస్టులో చేరితే, ఇతర పోస్టులు ఖాళీ అవ్వడం సహజమని తెలిపింది. జీవో-81 ప్రధానంగా ఒకే నోటిఫికేషన్ నియామక ప్రక్రియ కోసమని, ఒకేసారి అనేక పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చారు కాబట్టి ఆ నిబంధనను వర్తింపజేయడం సరికాదని పేర్కొన్నది. సుప్రీంకోర్టు తీర్పులను ఉటంకించింది.

మాట నిలుపుకోని సర్కార్

డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ తదితర వాటికి కామన్ ప్రశ్నపత్రాలు ఇవ్వడం, డిసెండింగ్ ఆర్డర్ పాటించకపోవడం వల్ల చాలా పోస్టులు భర్తీకాలేదు. దీనిపై అభ్యర్థులు మొదటి నుంచీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్‌లో పడిపోకుండా ఉండేందుకు డౌన్‌మెరిట్‌ను అమలు చేయాలని ధర్నాలకు సైతం దిగారు. ప్రజాప్రతినిధులను సైతం కలిసి గోడు వెల్లబోసుకున్నారు. దీంతో ఆ దిశగా చర్యలు చేపడుతామని కాంగ్రెస్ సర్కార్ పెద్దలు హామీ ఇచ్చారు. కానీ, ఆ తరువాత ప్రభుత్వం మాట మార్చింది. గురుకుల అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. నోటిఫికేషన్ ప్రకారమే పోస్టులను భర్తీ చేస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ట్రిబ్ సైతం ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్ అంటూ పలుమార్లు స్పష్టం చేసింది. అదేమంటే, గురుకుల పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్‌లోని పేరా 5(1)లో జీవో-81 ప్రకారం వెయిటింగ్ లిస్టు విధానం లేదని, భర్తీ కాని, అభ్యర్థులు జాయినింగ్ కాని ఖాళీలను క్యారిఫార్వర్డ్ చేసి, రాబోయే నోటిఫికేషన్ ద్వారా నింపాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులన్నీ క్యారీ ఫార్వర్డ్ చేయాలని నిర్ణయించింది.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు ఢమాల్

మూడేండ్లలో ఆరు వేలు తగ్గిన అడ్మిషన్లు • కాంగ్రెస్ సర్కార్ హయాంలో కాలేజీలు నిర్వీర్యం • అటానమస్ కాలేజీలకే ఆదరణ

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు రాను రానూ నిర్వీర్యమవుతున్నాయి. దశాబ్దాలుగా విద్యాజ్యోతులు వెలిగించిన కాలేజీలు ప్రభ కోల్పోతున్నాయి. కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన తర్వాత మరింత నిర్వీర్యమవుతున్నాయి. డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు గణనీయంగా తగ్గుతుండటమే ఇందుకు నిదర్శనం. ఈ మూడేండ్లల్లో ఆరు వేలకుపైగా అడ్మిషన్లు తగ్గాయి. రాష్ట్రంలో 119 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలుండగా, వీటిల్లో మొత్తంగా 89,010 సీట్లున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో 26,713 సీట్లు మాత్రమే నిండాయి. 2023-24లో 33,029 మంది అడ్మిషన్లు పొందగా, మూడేండ్లల్లో 6,316 అడ్మిషన్లు తగ్గాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకుల కొరత సమస్య పీడిస్తున్నది. 4,115 మంది బోధనా సిబ్బంది ఉండగా, ప్రస్తుతం కేవలం 1,526 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఏకంగా 2,589 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



అటానమస్ కాలేజీల జోరు..

ట్రెండ్ చూస్తుంటే రాష్ట్రంలో అటానమస్ కాలేజీల జోరు పెరుగుతున్నది. కాలేజీల సంఖ్యతోపాటు అడ్మిషన్లు సైతం జోరందుకుంటున్నాయి. విద్యార్థులు సైతం అటానమస్ కాలేజీల్లోనే ఎక్కువగా చేరుతున్నారు. రాష్ట్రంలో రెండేండ్ల క్రితం ప్రభుత్వ అటానమస్ కాలేజీల సంఖ్య 15 మాత్రమే. 2025-26కు వచ్చేసరికి ఈ కాలేజీల సంఖ్య 34కు చేరింది. ఈ కాలేజీల్లో అడ్మిషన్లు రెండేండ్ల క్రితం 16,103 ఉంటే, ఈ విద్యాసంవత్సరం 32,094కు పెరిగాయి. అంటే 50% అడ్మిషన్లు పెరిగాయన్నమాట. ప్రైవేట్ అటానమస్ కాలేజీల్లో రెండేండ్ల క్రితం 2,540 మంది మాత్రమే చేరగా, ఈ విద్యాసంవత్సరంలో 6,222 మంది ప్రవేశాలు పొందారు. యూనివర్సిటీ అటానమస్ కాలేజీల్లో గతంలో 1,782 మంది చేరగా, ఈ ఏడాదిలో 2,218 మంది ప్రవేశాలు పొందారు.

అడ్మిషన్ల వివరాలు..

సంవత్సరం	అడ్మిషన్లు
2023-24	33,029
2024-25	24,794
2025-26	26,713

ఇతర కాలేజీల్లో ఇలా..

- రాష్ట్రంలో నాలుగు యూనివర్సిటీ డిగ్రీ కాలేజీలుండగా వీటిల్లో 2,686 మంది విద్యార్థులు చేరారు.
- ఎయిడెడ్ కాలేజీల్లో రెండేండ్ల క్రితం అడ్మిషన్లు 9,648 ఉంటే, ఈ విద్యాసంవత్సరం 8,136కు పడిపోయాయి.
- ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో 1,28,874 ఉంటే, ఈ విద్యాసంవత్సరం 1,13,907కు తగ్గాయి. అంటే 15వేల అడ్మిషన్లు పడిపోయాయి.
- రెసిడెన్షియల్ గురుకులాల్లో అడ్మిషన్లు పెరుగుతున్నాయి. రెండేండ్ల క్రితం వీటిల్లో అడ్మిషన్ల సంఖ్య 9,017 మాత్రమే కాగా, ఈ విద్యాసంవత్సరం 11,387కు పెరిగాయి. అంటే రెండువేలకు పైగా అధికంగా విద్యార్థులు చేరారు.
- రైల్వే డిగ్రీ కాలేజీ ఒకటి ఉండగా, దీంట్లో ఈ విద్యాసంవత్సరం 238 మంది చదువుతున్నారు.

పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు ఏర్పాటు చేయండి

- కొత్తగా 7,917 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ
- 2035-36నాటికిపంప్డ్ స్టోరేజీ ప్లాంట్ల రోడ్‌మ్యాప్ విడుదల



హైదరాబాద్, మార్చి 15(నమస్తే తెలంగాణ): ప్రస్తుత, భవిష్యత్తు విద్యుత్తు అవసరాలను తీర్చుకునేందుకు పెద్ద ఎత్తున పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ రాష్ట్రానికి సూచించింది. తెలంగాణలో కొత్తగా 7,917 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, 2035-36 నాటికి వీటిని సిద్ధం చేయాలని నిర్దేశించింది. హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ల ఏర్పాటుపై సీఈఏ తాజాగా రోడ్‌మ్యాప్ విడుదలచేసింది. 2035-36 నాటికి దేశవ్యాప్తంగా పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్ల సామర్థ్యాన్ని 100 గిగావాట్లకు చేర్చాలన్న ధ్యేయంతో సీఈఏ రోడ్‌మ్యాప్ ప్రకటించింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను మినహాయిస్తే ఇంకా 1,49,276 మెగావాట్ల ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. ఇందులో తెలంగాణ వాటా 7,917 మెగావాట్లు.

జెన్‌కో ప్రణాళికలు భిన్నం

టీజీ జెన్‌కో సర్వే చేయించిన ప్లాంట్లు సీఈఏ నివేదికలో లేకపోవడంతో ఈ రెండింటి ప్రణాళికలు భిన్నంగా ఉన్నట్టు స్పష్టమవుతున్నది. ఖమ్మం జిల్లా కల్లూరులో 750, రంగారెడ్డి జిల్లా లోయపల్లిలో 750, భద్రాద్రి జిల్లా సింగభూపాలంలో 750, భద్రాద్రి జిల్లా దురదపాడులో 1,000, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అంజనగిరిలో 944 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాలని జెన్‌కో అధికారులు సర్వే చేశారు. కానీ, సీఈఏ తాజాగా ప్రకటించిన రోడ్‌మ్యాప్‌లో ఇవేవి లేవు.

చేతులెత్తేసిన జెన్‌కో

రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ల ఏర్పాటుపై జెన్‌కో చేతులెత్తేసినట్టు కనిపిస్తున్నది. థర్మల్, జల విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు, నిర్వహణలో అనుభవమున్న ఈ సంస్థ పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపడంలేదు. శ్రీశైలం ఎడమ గట్టున 900, నాగార్జునసాగర్‌లో 705 కలిపి 1,605 మెగావాట్ల రివర్సబుల్ పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను నిర్వహిస్తున్న జెన్‌కో.. పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టిపెట్టడంలేదు. దీంతో ప్రైవేట్ రంగంలోని గ్రీన్‌కో, అస్తా తెలంగాణ, శ్రీసిద్ధార్థ ఇన్‌ఫ్రాటెక్ అండ్ సర్వీసెస్ ఇండియా సంస్థలు రంగ ప్రవేశం చేశాయి. సింగరేణి సంస్థ సైతం రామగుండంలో పంప్డ్ స్టోరేజీ ప్లాంట్‌ను నెలకొల్పుతున్నది.

సీఈఏ ప్రణాళిక ప్రకారం రాష్ట్రంలో ఏర్పాటయ్యే ప్లాంట్లు

ప్రాంతం	మెగావాట్లు
ములుగు జిల్లా ఇప్పగూడెం	3,960
ఆదిలాబాద్ జిల్లా రాణాపూర్	1,200
ఆదిలాబాద్ జిల్లా	750
నిజామాబాద్ జిల్లా	600
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా	640

రాష్ట్రాలవారీగా లక్ష్యం

ఉత్తరప్రదేశ్	25,437
కర్ణాటక	15,752
తమిళనాడు	13,581
గుజరాత్	13,532
మధ్యప్రదేశ్	11,493
తెలంగాణ	7,917

నాసిరకం కందిపప్పు.. చిన్నసైజు కోడిగుడ్లు

- అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ హాస్టళ్లకు నాణ్యతలేని సరుకులు
- కాసుల కోసం కాంట్రాక్టర్ల కక్కుర్తి
- నెలకు రెండుసార్లు మాత్రమే సరఫరా
- పలుచోట్ల వెనక్కి పంపుతున్న టీచర్లు
- చోద్యం చూస్తున్న అధికారులు


హైదరాబాద్, మార్చి 15 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కస్తూర్బా స్కూళ్లకు సరుకుల సరఫరాలో కాంట్రాక్టర్లు నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. నాసిరకం కందిపప్పు, తక్కువ బరువు కోడిగుడ్లను అందజేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. మార్కెట్ రేటు ప్రకారం టెండర్ దక్కించుకొని నాణ్యతలేని, పుల్లెట్ గుడ్లను పంపిణీ చేస్తూ సర్కారు సొమ్మును లూటీ చేస్తున్నారు. గుత్తేదారులు కాసుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. కానీ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. గతానికి భిన్నంగా ఈ యేడు జిల్లా కొనుగోలు కమిటీ (డీసీసీ)ల ఆధ్వర్యంలో ఏకీకృత పద్ధతిలో టెండర్లు నిర్వహించారు. జిల్లా పరిధిలో ఒకే కాంట్రాక్టర్‌కు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు సరుకుల పంపిణీ బాధ్యతలు కట్టబెట్టారు. ప్రతిరోజూ 17 నుంచి 18 లక్షల గుడ్ల చొప్పున నెలకు 5.40 కోట్లు సరఫరా చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జీవో 16 జారీ చేసింది. దీనిప్రకారం గుడ్ల ధరను ఆయా జిల్లాలను బట్టి రూ. 6.10 నుంచి రూ.6.40, కందిపప్పు రేటును రూ. 116 నుంచి రూ.122గా నిర్ణయించారు. కోడిగుడ్ల బరువు 50 నుంచి 60 గ్రాములు ఉండాలని, ఫస్ట్‌క్లాస్ కందిపప్పు పంపిణీ చేయాలని నిర్దేశించారు. కానీ కాంట్రాక్టర్లు మాత్రం ఈ మార్గదర్శకాలను పాటించడంలేదని విమర్శలు వస్తున్నాయి. కేవలం 30-40 గ్రాముల కోడిగుడ్లు, పుచ్చిపోయిన కందిపప్పును హాస్టళ్లు, స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని ప్రభుత్వ విద్యాసంస్థల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులు వీటిని తీసుకొనేందుకు నిరాకరిస్తున్నారని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో తిరిగి వెనక్కి పంపిస్తున్నామని పేర్కొంటున్నారు. అయితే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.



మహబూబ్‌నగర్‌లోని ఓ సెంటర్‌కు సరఫరా చేసిన నాసిరకం కందిపప్పు



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నసైజు కోడిగుడ్లు

ప్రతినెలా రెండుసార్లే పంపిణీ..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కోడిగుడ్లు, ఇతర సామగ్రిని ప్రతినెలా మూడుసార్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది. కోడిగుడ్ల నాణ్యతను ధ్రువీకరిస్తూ మూడు రకాల కలర్స్ (గులాబీ, ఆకుపచ్చ, ఎరుపు)తో స్టాంపింగ్ వేయాల్సి ఉంటుంది. కానీ గుత్తేదారులు మాత్రం మార్గదర్శకాలను ఇష్టారాజ్యంగా ఉల్లంఘిస్తున్నారు. కేవలం నెలకు రెండుసార్లు అంటే పదిహేను రోజులకోసారి ఆహారపదార్థాలు సరఫరా చేస్తూ రవాణా ఖర్చులు తప్పించుకుంటున్నారని తెలుస్తున్నది. ఇటీవల సంబంధిత శాఖ మంత్రితో సమావేశమైన సందర్భంలోనూ రెండేసార్లు సరుకులు అందిస్తామని కాంట్రాక్టర్లు చెప్పగా, ఆమె కూడా ఒకింత సానుకూలంగా స్పందించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..

ప్రభుత్వ విద్యాసంస్థలకు సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల అక్రమాలకు అధికారపార్టీ నేతలు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని జిల్లాల్లోనైతే బినామీల పేరిట ఈ వ్యవహారం నడిపిస్తున్నట్టు తెలుస్తున్నది. మరికొన్ని చోట్ల గుత్తేదారులతో కుమ్మక్కయి వారి అక్రమ సొమ్ములో వాటాలు పంచుకున్నట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో సరుకుల సరఫరాను పర్యవేక్షించాల్సిన అధికారులు మిన్నకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ విస్మరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, లబ్ధిదారుల ఫిర్యాదులను సైతం బుట్టదాఖలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ఏప్రిల్ 23 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : ఐఐటీల్లో ప్రవేశాలు, సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ -2026 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఏప్రిల్ 23 నుంచి ప్రారంభంకానున్నది. 23న ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అంతకుముందే అంటే ఏప్రిల్ 22 లేదా 23న జేఈఈ మెయిన్ తుది ఫలితాలు విడుదలవుతాయి. ఈ ఫలితాల్లో ప్రతిభ చూపిన 2.5లక్షల మందికి జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసే అవకాశం కల్పిస్తారు. విద్యార్థులు మే 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు మే 4లోగా ఫీజు చెల్లించవచ్చు. మే 11నుంచి అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్ ప్రారంభమవుతుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను మే 17న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఈ విద్యాసంవత్సరం ఐఐటీ రూర్కీ నిర్వహించనున్నది.

'బడ్జెట్‌లో విద్యకు 15% నిధులు కేటాయించాలి'

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15% నిధులు కేటాయించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) డిమాండ్ చేసింది. వర్సిటీల బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్‌ను కేటాయించాలని కోరింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని పరిషత్ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ప్రకటనలో డిమాండ్ చేశారు. అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి, 2 లక్షల ఉద్యోగాలు భర్తీచేయాలని కోరారు. లోపభూయిష్టమైన విద్యాకమిషన్ నివేదికను సర్కార్ చెత్తబుట్టలో వేయాలని మండిపడ్డారు. ఈ నివేదికను ప్రామాణికంగా తీసుకోవద్దని సూచించారు. అశాస్త్రీయంగా పెంచిన ఇంజినీరింగ్, ఫార్మా ఫీజులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎర్రబెల్లి స్వర్ణ

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ ఆదివారం గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మొగిలి సునీతరావు దగ్గరి నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబా, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి కమలాక్షి రాజన్, మయూరి సింగ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

వల్లభి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన

ముదిగొండ, మార్చి 15 : అనుమానాస్పద స్థితిలో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతిచెందిన ఘటన ఖమ్మంజిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మంఅర్బన్ మండలం ధంసలాపురానికి చెందిన చింతకాయల శ్వేత (17) ముదిగొండ మండలం వల్లభి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. ఈ నెల 9న ఆరోగ్యం బాగాలేదని హాస్టల్ నుంచి ఫోన్ రాగా అదేరోజు శ్వేతను తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవటంతో ఈ నెల 12, 14న ఖమ్మంలోని దవాఖానల్లో వైద్యం చేయించారు. అయినా ఆరోగ్యం కుదటపడకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు శ్వేతను ఆరా తీయగా.. ఆయా మందలించడంతో ఈ నెల 7న హాస్టల్‌లో ఐరన్, పారాసిటమాల్ మాత్రలు వేసుకున్నానని చెప్పింది. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా ఆదివారం ఉదయం పరిస్థితి విషమించి శ్వేత మృతిచెందింది. ఆయా మందలించడమే తమ కుమార్తె మృతికి కారణమని శ్వేత తల్లి ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మురళి తెలిపారు.

గురువారం ఉగాది

కొత్త సంకల్పాలకు పునాది.. ఉగాది



తెలుగు ప్రజల సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది. ప్రకృతిలో వచ్చే మార్పులతో పాటు మన జీవితాల్లో నూతనత్వాన్ని నింపే ఉగాది పరాభవ నామ సంవత్సరంగా అడుగు పెడుతున్నది. ఉగాది రాకతో వసంతం మొదలై తరువులు కొత్త చిగురులు తొడుగుతాయి. అలాగే మన జీవితాల్లోనూ కొత్త ఆశలు, మంచి సంకల్పాలు ప్రారంభం కావాలి. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలోని సుఖ-దుఃఖాలు సహా వివిధ అనుభవాలను సూచిస్తూ వాటిని సమతాభావంతో స్వీకరించాలనే సందేశాన్ని ఇస్తాయి. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయం ప్రకారం కాలం దైవస్వరూపం. మనిషి తనకు అందుబాటులో ఉన్న కాలాన్ని భక్తి, ధార్మిక కార్యాలు, భగవంతుడి స్మరణలో



గడపాలి. తద్వారా జీవితానికి నిజమైన నూతన ఆరంభాన్ని ఇవ్వగలడు.

ఉగాది అంటే..

యుగాది లేదా ఉగాది అనే పేరు 'యుగ', 'ఆది' అనే సంస్కృత పదాల కలయిక నుంచి ఏర్పడింది, దీని అర్థం 'నూతన యుగానికి నాంది' ఉగాది. సనాతన సంప్రదాయం ప్రకారం, చైత్ర శుద్ధ పాడ్యమి నాడే బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించాడని పురాణాలు చెబుతున్నాయి. అలాగే మత్స్యావతారధారి అయిన మహావిష్ణువు సోమకాసురుడిని వధించి, వేదాలను తిరిగి బ్రహ్మకు అప్పగించిన శుభ తరుణమిది. అందుకే తెలుగు ప్రజలు ఈ రోజును నూతన సంవత్సర ఆరంభంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు.

ఆరు రుచులు..

ఉగాది పచ్చడి షడుచుల సమ్మేళనం, ఇది మానవ జీవితంలోని విభిన్న భావోద్వేగాలకు సంకేతం.

బెల్లం (తీపి): ఆనందానికి సంకేతం.
ఉప్పు (ఉప్పు): జీవితంలో ఉత్సాహానికి, రుచిని సూచిస్తుంది.
వేప పువ్వు (చేదు): బాధ కలిగించే అనుభవాలు.
చింతపండు (పులుపు): నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు.
పచ్చి మామిడి (వగరు): కొత్త సవాళ్లు.
కారం (కారం): సహనం కోల్పోయేలా చేసే పరిస్థితులు. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే కష్టసుఖాలను సమభావంతో (స్థితప్రజ్ఞతతో) స్వీకరించాలన్నదే ఈ పచ్చడి ఇచ్చే గొప్ప సందేశం.


జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగిల్చి, మానవాళిలో నూతన ఆశయాలను అంకురింపజేసే శుభదినం ఉగాది. ప్రకృతిలో వసంతం కొత్త చిగురులను తెచ్చినట్లే, మనిషి కూడా పాత చేదు జ్ఞాపకాలను విడిచిపెట్టి, కొత్త పనులను ప్రారంభించడానికి ఈ రోజు అత్యంత అనువైనది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు 'నేనే సర్వానికీ ఆదిని, నేనే కాలాన్ని' అని ప్రకటించాడు. విష్ణు సహస్రనామాల్లో భగవంతుడిని యుగాది కృత్ (యుగాలను సృష్టించేవాడు) అని సంబోధించారు. ఆ విధంగా కాలం భగవంతుని స్వరూపం కాబట్టి, దానిని వృథా చేయకుండా ఆధ్యాత్మిక కార్యాల్లో గడపడం వల్ల మనిషి భవబంధాల నుంచి విముక్తుడై పరమపదాన్ని చేరుకోగలడు.

ఉగాది రోజున భగవంతుడికి పచ్చడిని నివేదించి ప్రసాదంగా స్వీకరించాలి. ముఖ్యంగా హరేకృష్ణ మహామంత్ర జపం ప్రారంభించడం ద్వారా మనసు నిశ్చలమై, ఎన్ని కష్టాలు ఎదురైనా స్థితప్రజ్ఞతతో ఎదిరించే శక్తి లభిస్తుంది.

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే
హరే రామ హరే రామ రామ రామ హరే హరే

అలాగే అన్నదానం, గోసేవ వంటి ధార్మిక కార్యాల్లో పాలుపంచుకోవడం మన జీవన విధానాన్ని మెరుగుపరుస్తుంది.

..✍ శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ, 96400 86664



సూర్య గ్రహణం
శౌరి అనుగ్రహ భాషణం

పరీక్షిన్మహారాజు పరాశర పౌత్రుడు- శుక మహర్షితో ఇలా పలికాడు..

ఆ|| 'దుష్ట శిక్షణంబు దురిత సంహరణంబు
శిష్ట రక్షణంబు జేయ దలచి
భువిని మనుజుడగుచు బుట్టిన శ్రీకృష్ణ
విమలచరిత మెల్ల విస్తరింపు'

'మహాత్మా! దుష్టులను శిక్షించడానికి, శిష్టులను రక్షించడానికి, దురితాన్ని- పాపాన్ని దూరీకరించడానికీ, ఇర- ధరణిపై మానవ శరీరంతో అవతరించిన హరి- శ్రీకృష్ణుని విమల చరిత్ర నాకు ఇంకా విరివిగా వివరించు' అనగా, అప్పుడు శుకుడు ఇలా చెప్పనారంభించాడు...

రాజా! బలరామకృష్ణులు కుశస్థలి- ద్వారకలో సుఖంగా ఉన్న దినాలలో సర్వగ్రాస-సంపూర్ణ సూర్యగ్రహణం వచ్చింది. ఆ పుణ్య పర్వకాలంలో ప్రజలంతా తమ వెంట తరలిరాగా, వారు అక్రూర వసుదేవాదులతో కాంతా సమేతంగా స్యమంత పంచకానికి వచ్చారు. పూర్వం ఆ ప్రదేశంలో పరశురాముడు దుష్టక్షత్రియ రుధిరం- రక్తంతో ఐదు మడుగులను నిర్మించాడు. అదే స్యమంత పంచకమని దిగంత- జగత్తంతా విశ్రుత (ప్రసిద్ధ) మయింది. పుణ్యతీర్థాలలో స్నానాలు చేసి, ఉపవసించి వారు సువర్ణ రత్న గోదాన భూదానాలతో భూసుర శ్రేష్ఠులను సంతృప్తి పరచారు. బలరామ వాసుదేవులు బంధువర్గంతో కలిసి భాసురంగా- అనురాగం ఉల్లసిల్లగా సరస సల్లాపాలతో భోజనాలు చేశారు. అంతకు ముందే ధర్మరాజుతో కలిసి వచ్చిన భీష్మ, ధృతరాష్ట్ర, సంజయ, విదురాదులూ, మరికొందరు క్షత్రియ శ్రేష్ఠులూ స్యమంత పంచకానికి వచ్చారు.

కం|| 'ఆ రాజులు గాంచిరి నిజ
నారీయుతు లగుచు నంగనా పరివారున్
ధీరున్ దానవకుల సం
హారున్ గోపీ మనోవిహారు నుదారున్'



మన పోతన మధురిమ 229 వ భాగం

ఆ రాజులు తమ ఇంతు- భార్యలతో కూడి ప్రియకాంతా సమేతుడై ఉన్న దానవకుల అంతకుడు, గోపికా మనో విహారుడు, ధీరుడు, ఉదారుడు అయిన మారజనకుని- ద్వారకాధీశుని సందర్శించారు. బలరామకృష్ణులచే సాదరంగా సత్కరింపబడిన వారందరూ యాదవ ప్రముఖులను చూచి మోద- ఆనంద భరితులై దామోదరుడు- కృష్ణుడు వినే విధంగా ఇట్లన్నారు..

మ|| 'మన శాస్త్రంబులు వాక్కులున్ మనములున్ మాంగల్యముం బొంది పావనమై యొప్పెడి నే రమా విభుని భాస్వత్పాదపంకేజ సేచన తోయంబుల నే మహాత్ముని పదాబ్జాతంబు లెందేని సోకినచోటెల్లను ముక్తి హేతువగు, నీ కృష్ణుండె పో! చూడగన్'

మన వేదశాస్త్రాలూ, బాదరాయణుని- వ్యాసుని వాక్కులూ (వ్యాస సూత్రాలు), మనస్సులూ, ఏ పరంధాముని పాదపద్మ తీర్థాల వలన పవిత్రాలవుతున్నాయో, ఏ మహా మహిముని పాద స్పర్శకు పాత్రమైన- నోచుకొన్న ప్రదేశమంతా ముక్తిప్రద (దాయక) మవుతుందో, అట్టి అఖిల శక్తిధరుడైన పరాత్పరుడు ఈ శ్రీకృష్ణుడు!

చ|| 'సనక సనందనాది మునిసత్తము లంచిత యోగదృష్టిచే బనివడి యాత్మలన్ వెదకి పట్ట నగోచరమైన మూర్తి యిట్లనవరతంబు మాంసనయనాంచల గోచరుడయ్యె నట్టె! యేమన నగు? వీరి పుణ్యమున కాదట నెట్టితపంబు సేసిరో?'

సనక సనందనాది మహామునులు అంచిత- పూజితమైన తమ యోగదృష్టితో పనిగట్టుకొని మరీ ఆత్మ స్వరూపాన్ని కన (చూడ) దలచినా గోచరం కాని- కనిపించని వనజాక్షుని- నళిన నేత్రుని, మంగళమూర్తి యైన హరిని వీరు అనవరతం- ఎల్లవేళలా తోలు కళ్లతో చూడగలుగుతున్నారు. వీరి సంచిత పుణ్యం ఎంత సమంచితమో- ఎంతటిదో! వీరు ఎంతలేసి తపస్సులు చేశారో ఏమనగలం?

మ|| 'నిరయ స్వర్గము లాత్మగైకొనక తా నిర్వాణమూర్తైన యీ హరి జూడన్, హరితోడ బల్క, హరి మే నంటన్ హరిం బాడగా హరితో నేగ, సహాసనాస్తరణ శయ్యావాసులై యుండగన్ హరి బంధుత్వ సఖిత్వముల్ గలుగు భాగ్యం బెట్లు సిద్ధించెనో'

ఉగ్రసేన, అక్రూర, ఉద్ధవాది యాదవ వర్గ ప్రముఖులు, అరయంగా- పరికించగా స్వర్గ నిరయా (నరకా)లను గూర్చి విచారించక ఈ హరిని చూస్తూ, హరితో పలుకుతూ, హరి దేహాన్ని తాకుతూ, హరిని కొనియాడుతూ, హరితో చేరి పయనిస్తూ, కలిసి కూర్చుంటూ, శయనిస్తూ ఉన్నారు. ఆనంద సింధువైన పరమాత్మునితో ఇలా బంధుత్వ మిత్రుత్వాలు కలిగే భాగ్యం వీరికెలా చేకూరిందో అని ఆ రాజబృందం ఆశ్చర్యవడ్డది.

శుకుడు... రాజా! ఆ సమయంలోనే నంద యశోదలు, గోపాల గోపికా బృందాలు తమ తోడురాగా మందరధరుని చూడటానికి పరమానందంతో వచ్చారు. ఇలా చాలాకాలం తరువాత తమను కలవ వచ్చిన నందాదులకు యాదవ ప్రముఖులందరూ ఎదురేగి, హెచ్చిన- మిక్కిలి ప్రేమతో కుశల ప్రశ్నలు గావించి వరుసగా ఆలింగనాలు సలిపారు. బలరామకృష్ణులు వినయ సుందరులై నందయశోదలకు వందించారు. డెందాలలో అమందమైన ఆత్మీయత, అనురాగం నిండారగా, నయనారవిందాల నుండి ఆనందబాష్పాలు పొంగిపొరలగా, మాటలు పెకలక- రాక మౌనంగా ఉండిపోయారు. యశోద, రామకృష్ణులను ఒడిలోకి తీసుకొని, ప్రేముడి- ముచ్చటగా అక్కున చేర్చుకుంది. చెక్కిలి ముద్దాడింది. మిక్కిలి వాత్సల్యంతో మూర్ధాఘ్రాణం చేసింది- మస్తాకాలను మూర్కొంది (వాసన చూసింది). నెనరు- చనువుతో చిబుకాలు (గడ్డాలు) నిమురుతూ, పలుమారులు కౌగిలించుకొని పరమానందం పొందింది.

'జనన మొందింది మొదలు మీరే (నందయశోదలు) ఎనలేని బంధుప్రీతితో బలరామకృష్ణులను ఘనమైన అనురాగంతో పెంచి పెద్ద చేశారు. అందువల్లనే ఈ మీ తనయులు ఇప్పటికీ మమ్ము తల్లిదండ్రులుగా తలపోయ- భావింప లేకున్నారు' అంటూ దేవకీ రోహిణులు యశోదతో ఇలా సల్లాపం (సంభాషణ) చేస్తుండగా వల్లవ (గొల్ల) కాంతలు ఎల్లరూ రాకరాక వచ్చిన తమ ప్రాణనాథుని, శ్రీకరుని- నల్లనయ్యను- విశోకుని, శోకనాశనుని దర్శించాలనే వాంఛ- ఆకాంక్ష ఉల్లము (హృదయా)లలో వెల్లివిరియగా- ఉప్పొంగగా శిఖిపింఛ మౌళి సన్నిధికి వేంచేశారు. అప్పుండరీకాక్షుని చూస్తూ ఉన్నంత సేపూ తమ కళ్ల రెప్పలని వాల్చలేకపోయారు. పరీక్షిన్మహారాజా! నగధరుని జగన్మోహన సౌందర్య వైభవాన్ని ధ్యానిస్తూ తమ ఆత్మలలో అచ్యుతుని ఆలింగనం చేసుకొన్నారు. వారి తనువులు పులకరించాయి. పరబ్రహ్మ సాక్షాత్కారం వలన పరవశించిపోయే మహాయోగుల మాడ్కి (వలె) గోపికలు పారవశ్యం- తన్మయత్వం (తాదాత్మ్యం) పొందారు. గోపకాంతల స్వాంతం- మదిలోని కాంక్షను గ్రహించి శ్రీకాంతుడు వారిని ఏకాంత ప్రదేశానికి తోడ్కొని పోయి ప్రేమతో కౌగిలింతలలో కరిగించి, భక్తి నితాంత చిత్తలైన- భక్తి పరవశలైన వారితో చిరునవ్వు చిందిస్తూ ఇలా వచించాడు...

చ|| 'వనజదళాక్షులార! బలవద్రిపువర్గములన్ జయింపగా జని తడవయ్యె; దీనికి భృశంబుగ మీ మది నల్గకుండుడీ యనయము దైవమిట్లు సచరాచరజాలము నొక్కవేళ గూర్చును నొక వేళ బాపును మరుద్ధతతూల తృణంబులం బలెన్'

'ఇంతులారా! బలవంతులైన పెక్కురు పరిపంథు- శత్రువులను పరిమార్చ (జయించ)డానికి వెళ్లినందుకు మా రాకకు ఇంత తడవు- ఆలస్యం అయింది. ఇందులకై మీరు కినుక- అలుక పూని కుందువడ- దైన్య పడకండి. పెనుగాలికి చెల్లా చెదరై మరల ఒకటయ్యే దూది పింజెలు, గడ్డి పరకల వలె సర్వ ప్రాణులూ దైవ నిర్ణయాన్ని బట్టి ఒకప్పుడు కలుస్తూ (సంయోగం) మరొకప్పుడు విడిపోతూ (వియోగం) ఉంటాయి. వియోగం వలన ప్రేమ వర్ధిల్లుతుంది. అందుకే అది విశిష్టమైన యోగం! సంయోగంలో ప్రేమ ఫలప్రదమవుతుంది. ఆ ప్రేమ దేహ, ఇంద్రియ పరం కాక ఆత్మపరమైతే, కాంతలారా! అదే 'భక్తి' రూపాన్ని సంతరించుకుంటుంది.

నాపై అనన్య భక్తి కలవారికి మోక్షానందం కరతలామలకం! కేవలం జప తపో వ్రత దానాది సత్కార్యాల వల్ల ముక్తి లభించదు. క్రతుధ్వంసి (శివుడు), చతురాననుడు (బ్రహ్మ), సనకాది మహామునుల చిత్తాలలో సైతం అంకురించని భక్తి మీలో మొలకెత్తింది. మీ పురాకృత సుకృతాలు నేటికి నిండుగా ఫలించాయి. ఇక మీదట మీకు ఏ బాధలూ ఉండవు. నరకానికి కారణమైన జన్మకర్మలు మీకిక కలుగవు. విమల మతులారా! అండజ, స్వేదజ, ఉద్భిజ, జరాయుజాలనే చతుర్విధ ప్రాణుల సృష్టి, స్థితి, లయాలకు నేనే కారణం. ప్రాణుల సృష్టికి ముందు, అవి లయమొందిన తరువాత కూడా ఉండేవాడను నేనే! తేనెలో వ్యాపించి ఉన్న తీపి వలెనే వాటి లోపల వెలుపల కూడా నేనే ఉన్నాను. ఇలా అంతటా వ్యాపించి ఉన్న నన్ను, ఓ ఇందువదనలారా! మీరు ఎప్పటికీ పొందే ఉన్నారు. కాన, నాకూ మీకూ ఎడబాటనేదే లేదు. ఎట్టి దశలోనూ కుండలకు మట్టితో వియోగముంటుందా? పంచభూతాల పంచీకరణ వలన సృష్టి ఏర్పడింది. కావున, ఘటం (కుండ) పటం (వస్త్రం) మొదలైన భూతసృష్టికి పంచభూతాలు (మట్టి, నూలు పోగులు) ఉపాదాన కారణం. కాగా, ఘటపటాదులు (కుండలు, వస్త్రాలు) వానికార్యాలు. ఈ కార్యకారణాలు రెంటికీ నేనే ఆధారం. (కుండకు మట్టి ఉపాదాన కారణం కాగా, కుమ్మరి నిమిత్త కారణం. కాని, సృష్టికి రెండు కారణాలూ భగవంతుడే). పరమార్థంలో ఈ సమస్త సృష్టికి నేనే అభిన్న నిమిత్త ఉపాదాన కారణం! సృష్టీ నేనే.. స్రష్టా నేనే! వల్లవాంగనలారా! ఇంక వేలు- పెక్కు లొల్లి (అల్లరి), కల్లరి (అసత్యపు) మాటలేల? 'మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ' (గీత)- నా కన్నా ఇతరమైనది- నేను కానిది ఏదీ లేనే లేదు'.

శుకుడు- రాజా! ఈ విధంగా మాధవుడు అతుల- అసమానమైన తన మహిమను గూర్చి విశదీకరించగా విని వ్రేతలు- గోపికలు వివేకవతులై దేహాత్మ ('మేనే నేను' అన్న) బుద్ధిని విడిచారు. పురుషోత్తముని ప్రస్తుతిస్తూ ఇలా ప్రార్థించారు..

తే|| 'ఘోర సంసార సాగరోత్తారణంబు
ధీయుత జ్ఞాన యోగి హృద్ధ్యేయవస్తు
వగుచు జెలువొందు నీ చరణాంబు జాత
యుగళమును మా మనంబుల దగుల నీవె'

పద్మనాభా! సచ్చరిత్రా! భక్త మందరా! ఘోరమైన సంసార సాగరాన్ని తరించడానికి ఆలంబన (ఆధార)మై, ధీరులైన మహాయోగుల హృదయాలలో చిరంతన- సనాతన ధ్యాన విషయమై విరాజిల్లు నీ పాద పద్మ యుగళం మా హృదంతరంలో కూడా నిరంతరం- సుస్థిరంగా ఓజ- శోభ, శక్తితో తేజరిల్లు- వెలుగొందు గాక! శుకుడు- రాజా! కరుణావరుణాలయుడు- దయాసాగరుడు, భక్త వత్సలుడు వాసుదేవుడు పల్లవాధరలు- వల్లవకాంతలు కోరిన వరాలిచ్చి అనుగ్రహించాడు. మూలంలోని రెండు అత్యంత గంభీర అనుష్టుప్ ఛందస్సులోని శాస్త్ర సారాన్ని పోతనామాత్యుడు శ్రీధరాచార్యుల భాష్యానుసారంగా వీసమంత కూడా యాస లేకుండా ఒక్క సీస పద్యంలో భాసమానంగా అందించి అలరించాడు. (సశేషం)

తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

క్రీస్తు సందేశం

మాట్లాడే చేతలు

ప్రభువు నోట వచ్చే మాటొకటి చాలు మనిషి నిండు నూరేళ్లూ వర్ధిల్లడానికి, జీవితం సార్థకం చేసుకోడానికి! అయితే, ఆయన మాటలు వినపడక ముందే ఆయనలోని చేష్టలు మున్ముందుగా కనబడతాయి. అంటే మాట్లాడని మల్లెలా, ప్రభువుది పెదవి విప్పని ప్రవర్తనా బోధన! నేటి బోధకులకు ఈ తీరు ఒక మాతృక. ఇంట్లో పసి పిల్లలకు చేష్టలే సుబోధకాలు, చూసి నేర్చుకోగల వాచకాలు! ప్రత్యేకంగా వారికి బోధించాల్సిన పనిలేదు. బోధించినా అర్థం కాని వయసు. తల్లిదండ్రులు ఏం చేస్తే అది ఇట్టే పట్టేస్తారు. ప్రభువు చుట్టూ ఉండేది, పెద్దపెద్ద విద్యావంతులు కారు. కేవలం నిరక్షరాస్యులైన పామరులు. వారికి అర్థం కావాలంటే, ప్రభువును చూసి నేర్చుకోవడం కన్నా ఉత్తమ బోధన మరేం కావాలి? చాలామంది బోధిస్తారు. కానీ, ఆ చెప్పింది చేసేటప్పుడే కదా అసలైన క్లిష్టత. ఏం మాట్లాడకుండా మౌనంగా ఉంటూనే జగమంతటికీ కాంతిని ప్రసాదిస్తున్నాడు సూర్యుడు. అలాగే విశాల జగత్తుపై వెన్నెల పరిచేస్తున్నాడు చంద్రుడు. అలాగే ఉంటుంది క్రీస్తు బోధన! ఓ తప్పుడు స్త్రీని ప్రజలంతా రాళ్లతో చావగొడుతుంటే, 'మీలో తప్పుచేయని వాడే ఆమెపై రాయి విసరండి' అని నేలపై వేలిని తిప్పుతూ మౌనం వహించాడు క్రీస్తు. ఆ యువతిని కొట్టడానికి ఎత్తిన రాళ్లన్నీ మరుక్షణం అందరి చేతుల్లోంచి జారిపడిపోయాయి. ఒకరి కోసం మరొకరు ప్రేమతో ప్రవర్తించాలని మాటలతో చెప్పకుండానే ఆయన లోకం కోసం మరణించి ఆ విషయాన్ని నిరూపించాడు. క్రీస్తు మరణ సంఘటన కల్వరీపై ఇప్పటికీ ఎంత సంఘర్షణ చేస్తూ ఉందో మాటల్లో చెప్పే విషయం కాదు!

...✍ ప్రొ||బెర్నార్డ్ రాజు
98667 55024

సింధువులో బిందువు

ఉపనిషత్ వాక్యం

యదావై విజానాత్యథ సత్యం వదతి
విజానన్నేవ సత్యం వదతి
విజ్ఞానం త్వేవ విజిజ్ఞాసితవ్య మితి
విజ్ఞానం భగవో విజిజ్ఞాస ఇతి

ఛాందోగ్యోపనిషత్తు (7:17:1)

'సత్యదర్శనుడు మాత్రమే సత్యాన్ని వచిస్తాడు. అందువల్ల విజ్ఞానాన్ని గ్రహించాలని కోరుకోవాలి' అని సనత్కుమారుడు చెప్పగా నారదుడు 'భగవన్! విజ్ఞానాన్ని విశేషంగా తెలుసుకోవాలని అనుకుంటున్నాను' అని అన్నాడు. వేద మూల మిదం జ్ఞానం అన్నారు. జ్ఞానానికి వేదం మూలమని భావం. వేద విజ్ఞానాన్ని భరద్వాజ మహర్షి ఎంత శ్రమకోర్చి సాధించుకున్నాడో కింది వృత్తాంతం ద్వారా తెలుస్తుంది. భరద్వాజ మహర్షి బ్రహ్మ వంశానికి చెందినవాడు. ఆయనకు వేద విజ్ఞానాన్ని సొంతం చేసుకోవాలని ఎంతో పట్టుదల ఉండేది. అందువల్ల తీవ్రమైన తపస్సు చేసి బ్రహ్మదేవుణ్ని ప్రసన్నం చేసుకున్నాడు. వేదాలను పూర్తిగా నేర్చుకునే శక్తి సామర్థ్యాలను తనకు ప్రసాదించమని ప్రార్థించాడు. వేదాధ్యయనానికి భరద్వాజుడికి మూడు జన్మలు అనుగ్రహించాడు బ్రహ్మదేవుడు. అలా మొదటి జన్మలో భరద్వాజుడు రుగ్వేదం పూర్తిగా అభ్యసించాడు. రెండో జన్మలో యజుర్వేదం నేర్చుకున్నాడు. మూడో జన్మలో సామవేదం అధ్యయనం చేశాడు. అయితే, మూడో జన్మ ముగిసిపోయే సమయం వచ్చినా అథర్వణ వేదం, వేదాలలో నిగూఢమైన తత్త్వార్థం పూర్తిగా ఆయనకు తెలియరాలేదు. అప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై 'నీవు వేదాలను మాత్రమే నేర్చుకున్నావు. కానీ అందులో దాగి ఉన్న పరమార్థాన్ని తెలుసుకోవాలి. వేద జ్ఞానం అపారమైనది. ఎంత తెలుసుకున్నా తక్కువే' అన్నాడు. భరద్వాజ మహర్షి 'నిజమే! నేను ఇన్ని జన్మలుగా తెలుసుకున్న వేద జ్ఞానం అంతా సింధువులో బిందువు లాంటిదే!' అని వినయంతో పలికాడు. మనం మన ఒక్క జన్మలో ఏదో కొంత భాగమే మామూలు చదువు కోసం వినియోగిస్తున్నాం. కానీ, భరద్వాజ మహర్షి పూర్తిగా మూడు జీవితాలను వేద విద్యకు అంకితం చేశాడు. అంటే జ్ఞాన సముపార్జన ఎంత ముఖ్యమైనదో తెలుస్తున్నది.

...✍ డా|| వెలుదండ సత్యనారాయణ

ఏడాదంతా రంజాన్ కావాలి

సందర్భం: ఈదుల్ ఫిత్ర్

'ఓ విశ్వాసులారా! నేను సెలవు తీసుకుంటున్నాను.. వచ్చే వసంతానికి మళ్లీ మన కలయిక సాధ్యమవుతుందో లేదో ఎవరికి తెలుసు? నేను వెళ్లేలోపే, నేను తెచ్చిన ఆ దైవకృపను అక్కున చేర్చుకోండి.. ఆ వెలుగు మీ ఆత్మలలో నిరంతరం ప్రకాశించనివ్వండి' నెలవంక రాకతో ఈ పవిత్ర మాసం ముగియనుండగా, ఈ మాటలు కేవలం క్యాలెండర్ మార్పులా కాకుండా, ఒక ఆత్మీయ అతిథి పలుకుతున్న వీడ్కోలులా వినిపిస్తున్నాయి. ఆత్మపరిశీలనకు, నిగ్రహానికి ప్రతీక అయిన రంజాన్ ఇప్పుడు సెలవు తీసుకుంటున్నది. అయితే వెళ్తూ వెళ్తూ అది మన ముందు ఒక వేధించే ప్రశ్నను ఉంచుతున్నది.. 'మనం కేవలం భోజన సమయాలను మార్చుకున్నామా? లేక మనల్ని మనం మార్చుకున్నామా?' అని.

భక్తి కూడా ఒక ప్రదర్శనలా మారిపోతున్న ఈ రోజుల్లో, నిజమైన ఆరాధన ఆ నిశ్శబ్దంలో చిందించే కన్నీటి చుక్కలోనే ఉంటుంది. చరిత్రలో మనం చూసే మహనీయులు, ప్రవక్తలు తమ భక్తి పట్ల ఎన్నడూ గర్వపడలేదు. దానికి బదులుగా, వారు అర్ధరాత్రి వేళల్లో తమ బలహీనతలను ఒప్పుకొంటూ, దైవ కరుణ కోసం విలపించారు. దీని వెనుక ఒక లోతైన మానవీయ తర్కం ఉంది. ఒక పసిబిడ్డ పట్టుబట్టి ఏడుస్తుంటే, ఏ తల్లిదండ్రులైనా కరగకుండా ఉంటారా? ఐహికమైన బంధమే అంత మృదువుగా ఉంటే, మరి 70 మంది తల్లుల కంటే మిన్నగా ప్రేమించే ఆ సృష్టికర్త, తన భక్తుడు ఆర్తితో వేడుకుంటే ఎందుకు కరగడు? కరుణా ద్వారాలు ఎప్పుడూ మూసి లేవు.. మనం హృదయపూర్వకంగా తట్టడం మానేశాం అంతే! నేటి యువత రంజాన్‌ను ఒక 'ఆధ్యాత్మిక బూట్ క్యాంప్'లా భావించాలి. ఒక సైనికుడు కఠినమైన శిక్షణను కేవలం వ్యాయామం కోసం చేయడు, తన దేశ సరిహద్దును కాపాడటం కోసం చేస్తాడు. ఒక విశ్వాసికి ఆ సరిహద్దు 'దీన్' (ధర్మం-నైతికత).

శత్రువు: బయట ఉన్న శక్తులు కాదు.. మనలోని అహం (నఫ్స్), మనల్ని చెడు వైపు నడిపించే ప్రేరణలు.
కవచం: తఖ్వా (దైవచింతన).

గడిచిన 30 రోజులుగా మనం అలవర్చుకున్న క్రమశిక్షణ ఆకలిని తట్టుకోవడం, నాలుకను అదుపులో ఉంచడం, దానగుణం.. ఇవన్నీ ఒక రిహార్సల్ మాత్రమే. నెలవంక కనిపించగానే మళ్లీ పాత అలవాట్లలోకి జారిపోతే, ఈ శిక్షణ విఫలమైనట్టే. రంజాన్ నిజమైన విజయం ఈ ఒక్క నెలలో కాదు, మిగిలిన పదకొండు నెలల మన జీవనశైలిలో ప్రతిఫలించాలి.

ఈ మాసం ముగింపు దశలో, మనల్ని మనం ఒకసారి తనిఖీ చేసుకోవాలి. ఖురాన్ ప్రకారం నిజమైన పుణ్యాత్ముడికి మూడు ప్రధాన లక్షణాలు ఉండాలి.

అగోచరమైన దైవంపై విశ్వాసం: భౌతిక ప్రపంచానికి అతీతమైన నమ్మకం.
నమాజు (ప్రార్థన): దైవంతో నిరంతర అనుసంధానం.
దానగుణం: మన సంపదలో పేదవారికి కూడా వాటా ఉందని గుర్తించడం.

స్వార్థం, ఆడంబరం పెరిగిపోతున్న ఈ కాలంలో, ఈ మూడు లక్షణాలే మనల్ని సరైన మార్గంలో ఉంచే దిక్సూచీలు. ఉపవాసం మనకు ఎదుటివారి ఆకలిని గుర్తుచేయకపోతే, అది కేవలం ఒక డైటింగ్ లాగే మిగిలిపోతుంది.

పదవులు, ఆస్తులు, హోదాల వెంట మనం జీవితాంతం పరుగెడుతూనే ఉంటాం. కానీ, రంజాన్ ముగిసిపోతున్న ఈ చివరి గడియల్లో, ఒక్కసారి మూలాల్లోకి వెళ్దాం. ఆ అనంతమైన దైవ ద్వారం వద్ద ఒక యాచకుడిలా నిలబడండి. గడిచిన కాలం పట్ల పశ్చాత్తాపంతో, రేపటి పట్ల ఆశతో మనసును నింపుకోండి. రంజాన్ వెళ్తూ వెళ్తూ ఇస్తున్న సందేశం ఒక్కటే! 'నేను నీ మనసులోని చీకటి కోణాల్లో ఒక దీపం వెలిగించాను. రేపటి ప్రపంచపు గాలులకు ఆ దీపం ఆరిపోకుండా చూసుకో!'

...✍ ముహమ్మద్ ముజాహిద్
96406 22076



ఆస్తిపన్ను పోటు తప్పదా?

రంగంలోకి మున్సిపల్ సిబ్బంది

ఇంటి పన్ను పెంపునకు కసరత్తు?

వసూలు లక్ష్యం 1,175 కోట్లు



ఆస్తులు, పన్నుల వసూలు వివరాలు

రాష్ట్రంలో మొత్తం ఆస్తుల అంచనా: (జీహెచ్‌ఎంసీ మినహా) 25 లక్షలు
వసూలు లక్ష్యం: రూ.1,175 కోట్లు
ప్రస్తుత వసూలు: రూ. 505 కోట్లు (మార్చి13 వరకు)

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల (యూఎల్‌బీ) సిబ్బంది ఆకస్మికంగా క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టడం సామాన్య ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం ఆస్తి పన్ను గుర్తింపు సంఖ్య (పీటీఐఎన్) రికార్డులు, ట్రేడ్ లైసెన్స్‌ల పరిశీలనలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న ఆదాయ లక్ష్యాలను చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆస్తిపన్ను సవరణ కోసమే ఈ కసరత్తు చేస్తున్నారనే ప్రచారం జోరందుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సిబ్బంది పీటీఐఎన్ డాటా ఆధారంగా ఈ తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటికే పన్ను విధిస్తున్న, అసలు పన్ను పరిధిలోకి రాని, తక్కువ పన్ను చెల్లిస్తున్న ఆస్తులను గుర్తించే పనిలోపడ్డారు. వీటితోపాటు వాణిజ్య సంస్థల ట్రేడ్ లైసెన్స్‌లను కూడా తనిఖీ చేస్తున్నారు. అధికారులు దీనిని సాధారణ ప్రక్రియ అని చెప్తున్నా పన్నుపోటు తప్పదేమోనని పుర ప్రజలు భయపడుతున్నారు.

భారీగా ఆదాయ లక్ష్యం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే గడువు రెండు వారాలే ఉన్నది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఈ ఏడాదికి రూ.1,175 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ ఇప్పటివరకు రూ.505 కోట్లు మాత్రమే వసూలైంది. నిరుడు రూ.1,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకొని 64 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమీక్ష నిర్వహిస్తూ.. పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని ఉద్యోగులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే మున్సిపల్ సిబ్బంది పన్నువసూళ్ల వేగాన్ని పెంచారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల 27 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లో విలీనం చేయడంతో సుమారు 5 లక్షల నుంచి 6 లక్షల ఆస్తులు కొత్తగా గ్రేటర్ పరిధిలోకి వచ్చిచేరాయి. వీటి ద్వారా మరో రూ.400 కోట్ల నుంచి 500 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ పన్నులను ఎవరు వసూలు చేయాలనే దానిపై మాత్రం ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నివాస గృహాలపై ఆస్తి పన్నును పెంచలేదు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి పన్ను సవరణపై ఎలాంటి అధికారిక ఆదేశాలు లేవని ఉన్నతాధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో జరుగుతున్న తీవ్రమైన తనిఖీలు మాత్రం ప్రజల్లో పలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి.

గ్యాస్ ధరల పెంపుపై సీపీఐ పోరుబాట

నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు: ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, భారత్‌లో మోదీ ప్రభుత్వ వైఫల్యాల కారణంగా పెరిగిన గ్యాస్ ధరలను నిరసిస్తూ సోమవారం జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా పెరిగిన ఎల్పీజీ సిలిండర్ ధరలు, తగ్గిన గ్యాస్ సరఫరాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొనాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర నిర్లక్ష్యం.. రెట్టింపైన ప్రాజెక్టుల వ్యయం!

- అనుమతులకు నోచుకోని రాష్ట్ర రహదారులు
- ఎన్నో ఏండ్లుగా పెండింగులో ఉండటంతో భారీగా పెరుగుతున్న అంచనా వ్యయాలు



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు రహదారుల నిర్మాణ అంచనా వ్యయాలు భారీగా పెరిగిపోతున్నాయి. అనుమతుల జారీలో కేంద్ర ప్రభుత్వం మితిమీరిన జాప్యం చేయడమే ఇందుకు కారణం. దీంతో ఆయా రహదారుల నిర్మాణం కోసం ప్రతిపాదనల సమయంలో వేసిన అంచనాకు, అనుమతులు జారీ అయ్యే నాటికి నిర్ణయించే వ్యయానికి పొంతన కుదరడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం, అధికారుల ఉదాసీనత వల్ల ఆ ప్రాజెక్టులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఆది నుంచే తెలంగాణ పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శిస్తున్నది. బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా పేరుగాంచినప్పటికీ కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ చేయూత లభించలేదు. రాష్ట్రంలోని రహదారులు సైతం ఇందుకు అతీతం కాదు. తెలంగాణలోని అనేక రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా తీర్చిదిద్దాల్సి ఉన్నప్పటికీ కేంద్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. దాదాపు 16 రాష్ట్ర రహదారులకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం వద్ద అనేక ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాథమికంగా అనుమతులు మంజూరు చేసిన ప్రాజెక్టులకు సైతం తుది అనుమతులు జారీ చేయడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. మహబూబ్‌నగర్-గుడెబల్లూర్ మధ్య దాదాపు 80 కి.మీ. పొడవైన 4 లేన్ల రహదారికి మూడేండ్ల క్రితం రూ.1,500 కోట్లతో అంచనాలు రూపొందించారు. నిరుడు అక్టోబర్‌లో డీపీఆర్‌లు సమర్పించేనాటికి ఆ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,278.38 కోట్లకు చేరింది. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి 4న కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపేనాటికి అది రూ.3,175.08 కోట్లకు పెరిగింది.

రెట్టింపైన ట్రిపుల్‌ఆర్ అంచనా వ్యయం

రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగంలో 161.5 కి.మీ. పొడవున 6 లేన్లతో నిర్మించ తలపెట్టిన రహదారి ప్రాజెక్టు వ్యయం తాజాగా రూ.20,700 కోట్లకు పెరిగింది. 2024 నవంబర్‌లో తొలిసారి టెండర్లు పిలిచినప్పుడు ఈ రహదారిని 4 లేన్లుగా 5 ప్యాకేజీల్లో నిర్మించాలని నిర్ణయించారు. అందుకు రూ.7,560 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు. ఆ తర్వాత సంబంధిత డీపీఆర్‌లు సమర్పించి, టెండర్లు పిలిచే నాటికి ఆ అంచనా వ్యయం రూ.15,627 కోట్లకు పెరిగింది. తాజాగా ఇప్పుడు రెండోసారి టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుండటంతో ఆ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.20,700 కోట్లకు చేరింది.

ఇతర రోడ్ల పరిస్థితీ అంతే

రాష్ట్రంలోని ఇతర రోడ్ల పరిస్థితి కూడా ఇలాగే ఉన్నది. ఆర్మూర్-జగిత్యాల మధ్య దాదాపు 63.60 కి.మీ పొడవైన రహదారి నిర్మాణానికి రూ.2,471.76 కోట్లు, జగిత్యాల-మంచిర్యాల మధ్య 68.30 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.2,730.72 కోట్లు, జగిత్యాల-కరీంనగర్ మధ్య 58.87 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.2,394.68 కోట్లు ఖర్చవుతుందని గతంలో అంచనా వేశారు. వీటికి కేంద్రం నుంచి ఇంకా అనుమతులు రాకపోవడంతో అంచనా వ్యయం మరింత పెరిగే అవకాశం ఉన్నది.

భూసేకరణ పూర్తయ్యేనాటికి మరింత పెరుగనున్న వ్యయం

ట్రిపుల్‌ఆర్ సహా ప్రతిపాదిత రహదారులకు ఇంకా భూసేకరణ పూర్తికాలేదు. ట్రిపుల్ ఆర్‌కు 90% భూసేకరణ పూర్తయినట్టు అధికారులు చెప్తున్నప్పటికీ ఇంకా ఒక్కరికి కూడా పరిహారం చెల్లించలేదు. గతంలో భూసేకరణకు అంగీకరించినవారు సైతం ఇప్పుడు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. మిగిలిన రహదారుల పరిస్థితి కూడా ఇంచుమించు ఇలాగే ఉన్నది. రాష్ట్రంలో భూముల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో రిజిస్ట్రేషన్ ధర ప్రకారం నష్టపరిహారం తీసుకునేందుకు రైతులు సిద్ధంగా లేరు. దీంతో భూసేకరణ పూర్తయ్యేనాటికి ఆ ప్రాజెక్టుల అంచనా వ్యయం కూడా భారీగా పెరుగుతుందని అధికారులు అంగీకరిస్తున్నారు.

ఎమ్మెల్యే సామెల్ క్షమాపణ చెప్పాలి

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ సభ్యురాలు సంకేపల్లి

వేములవాడ టౌన్, మార్చి 15 : బ్రాహ్మణులను కించపరిచేలా మాట్లాడిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ బ్రాహ్మణులకు క్షమాపణ చెప్పాలని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ సభ్యురాలు, బీఆర్‌ఎస్ నాయకురాలు సంకేపల్లి సుమలతాసుధాకర్ శర్మ డిమాండ్ చేశారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో మీడియాతో ఆమె మాట్లాడారు. ప్రజాప్రతినిధులు సమాజంలో ఐక్యతను పెంపొందించే విధంగా మాట్లాడాలని, సమాజంలో శాంతి, పరస్పర గౌరవం పెంచేలా ఉండాలని హితవుపలికారు. బ్రాహ్మణ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సామెల్ వెంటనే వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు.

లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తెచ్చేలా తీర్మానం చేయాలి

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మంచిర్యాల అర్బన్, మార్చి 15 : లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తెచ్చేలా అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేయాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్‌చేశారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలో సీపీఎం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో రాబోయే రోజుల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సామాన్యులకు దొరకని పరిస్థితి నెలకొనే ప్రమాదమున్నదని తెలిపారు. యుద్ధం ఆపడానికి పీఎం మోదీ చొరవ చూపాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారి రవికుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, ఆదివాసీ గిరిజనులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పేర్కొన్నారు.



కొల్లాపూర్‌లో పెట్రోల్ బంక్ వద్ద నోస్టాక్ బోర్డులు ఏర్పాటు చేసిన నిర్వాహకులు

కొల్లాపూర్‌లో పెట్రోల్ నో స్టాక్

ఆందోళనలో వాహనదారులు

కొల్లాపూర్ రూరల్, మార్చి 15 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని పలు పెట్రోల్ బంకుల్లో ఆదివారం నో స్టాక్ బోర్డులు వెలిశాయి. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు, సోమశిల పర్యటనకు వచ్చిన టూరిస్టులు పెట్రోల్, డీజిల్ కోసం బంకుల వద్దకు వచ్చి క్యూలో నిలబడగా అంతలోనే బంక్ యజమానులు నో స్టాక్ బోర్డు పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశంలో వంటగ్యాస్, పెట్రోల్ కొరత ఏర్పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్, పెట్రోల్ కొరత లేకుండా చూడాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఎంపీ మహేశ్‌ను పదవి నుంచి తొలగించాలి

పలు రాజకీయ పార్టీల డిమాండ్

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీపై శనివారం రాత్రి ఈగల్ టీమ్ దాడి చేసి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్‌తోపాటు పలువురిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ముందుగా నిర్వహించిన మూత్ర టెస్టులో మహేశ్‌యాదవ్‌కు నెగిటివ్ వచ్చినప్పటికీ, ఆయన ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు రక్త నమూనాలను సేకరించారు. ఈ మేరకు ఆదివారం వచ్చిన ఫలితాల్లో ఆయన డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఏలూరు ఎంపీపై విపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. తక్షణమే ఆయన్ను పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. చట్టాన్ని గౌరవించే పార్టీ అని చెప్పే టీడీపీ.. ఎంపీ డ్రగ్స్ కేసులో దొరికితే ఎందుకు మౌనంగా ఉన్నదని ప్రశ్నించారు. విలువలతో కూడిన రాజకీయం చేయాలంటే వెంటనే మహేశ్‌యాదవ్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి అంగన్‌వాడీల్లో ఒంటిపూట

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నుంచి ఒంటిపూట బడులు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎండల తీవ్రత, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ బాధ్యుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నది. సంబంధించిన ఉత్తర్వులను సోమవారం జారీచేయనున్నారు. టేక్ హోం రేషన్ విధానం ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీని అమలు చేయనున్నారు. కాగా, ప్రభుత్వ నిర్ణయంపై యూనియన్ల నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

రాబడి

పశ్చిమాసియాపై ఆధారం..!

అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం.. భారతీయ స్టాక్ మార్కెట్లను గట్టిగానే ప్రభావితం చేస్తున్నది. ఇరాన్ దీటుగా బదులిస్తుండటంతో అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పరుగులు పెడుతుండగా.. మదుపరులు బెంబేలెత్తిపోతున్నారు. ఫలితంగా తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే.. గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 4,354.98 పాయింట్లు పతనమై 74,563.92 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 1,299.35 పాయింట్లు క్షీణించి 23,151.10 దగ్గర ఆగింది. ఈ నేపథ్యంలో ఈ వారం కూడా పెద్ద ఎత్తునే ఒడిదుడుకులకు ఆస్కారం ఉందని చెప్పవచ్చు. ఇన్వెస్టర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొంటారన్న అభిప్రాయాలు మెజారిటీ నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రధానంగా చమురు-గ్యాస్, మెటల్, ఆటో, రిటైల్ రంగ షేర్లు పెట్టుబడుల ఉపసంహరణకు గురికావచ్చంటున్నారు. ఇక డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల కదలికలు, విదేశీ మదుపరుల పెట్టుబడులూ కీలకమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కొనసాగితే నిఫ్టీకి 22,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,500-23,700 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

మార్కెట్ పల్స్

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



చిట్టి చేతులతో చిన్నచిన్నగా..

పిల్లలకు ఆర్థిక పాఠాలు చెప్పండిలా

మనలో చాలామంది.. పిల్లలకు ఓ వయసు వచ్చాకగానీ ఆర్థికపరమైన అంశాల జోలికి వెళ్లనివ్వం. అందుకే నేడు మెజారిటీ యువతకు కుటుంబ ఆర్థిక పరిస్థితులపై సరైన అవగాహన ఉండటం లేదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అయితే పసితనం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు ఆర్థిక పాఠాలు నేర్పితే.. వారికి ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. నగదు విలువ, పొదుపు వంటివి చిరుప్రాయంలోనే వివరించగలిగితే.. పెద్దయ్యాక వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు. పాఠ్యపుస్తకాల్లో చదివేదానికంటే జీవితంలో చూసి నేర్చుకునేదే ఎంతో ముఖ్యం మరి.

ఇదీ సంగతి: పిల్లలు ఆర్థికపరమైన విషయాలను కేవలం వినడం ద్వారానేగాక.. పెద్దల ప్రవర్తనను చూస్తూ నేర్చుకుంటారు. కనుక తల్లిదండ్రులు ఆర్థిక అంశాలను పిల్లల వద్ద దాచిపెడితే.. వారికి వాస్తవ పరిస్థితులపై అవగాహన కొరవడుతుంది. అందుకే మన ఖర్చులు, సంపాదన ఇలాంటివన్నీ వారికి తెలిసేలా చేయడం ఎంతైనా మంచిది. ఇక మీరు వృథా ఖర్చులు చేస్తూపోతే.. మీ పిల్లలూ అదేవిధంగా తయారయ్యే ప్రమాదం ఉన్నది. అలాగే చిన్న పిల్లలు కదా అని, మారాం చేస్తున్నారని అడిగిందిఇస్తూపోతే డబ్బు విలువ తెలియకుండాపోతుంది. కాబట్టి ఏది అవసరం? మరేది అనవసరం? అన్నది వారికి తెలియజేస్తూ.. అక్కెరకు వచ్చేవి మాత్రమే అందించాలి. పిల్లలు పెద్ద పెరుగుతున్నప్పుడు సమయం ఉన్నప్పుడల్లా మీ ఆర్థిక ఒత్తిళ్లనూ వారితో పంచుకుంటే.. కుటుంబ ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టుగా వారూ నడుచుకుంటారు. ఇక పొదుపు, పిసినారితనానికి మొదట్లో చిన్న గీతే అడ్డుగా ఉంటుంది. ఆ గీతకున్న అర్థం పిల్లలకు తొలినాళ్ల నుంచే తల్లిదండ్రులు వివరించినట్లైతే.. మనవారు పూర్తిగా డబ్బు మనుషులు కాకుండా కూడా జాగ్రత్తపడవచ్చు. పెట్టుబడులతోపాటు బీమా అవసరాన్నీ తెలియజెప్పాలి. అప్పుడే సరైన ఆర్థిక ప్రణాళికల్ని వేసుకునే సామర్థ్యం వారికి ఉంటుంది. ఏవైనా ఎదురు దెబ్బలు తగిలినప్పుడు ఎలా నిలదొక్కుకోవాలి, కుటుంబం అండకు ఎంత ప్రాధాన్యం ఉంటుంది.. అన్నదీ పిల్లలకు వివరిస్తూపోతే భవిష్యత్తులో ఆర్థికపరంగానూ, కుటుంబపరంగానూ బలంగా తయారవ్వగలరు.





నీ ఇల్లు బంగారంగానూ..

పసిడిపై పెట్టుబడులకున్న ప్రధాన అవకాశాలివే

బంగారం ధరలు ఏ స్థాయిలో పరుగులు పెడుతున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం రేట్లు కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ నిన్నమొన్నటి దాకా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన విషయం తెలిసిందే. దేశ, విదేశీ మార్కెట్లలో ఆల్ టైమ్ హై రికార్డులను సృష్టించిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలో గతంతో పోల్చితే ఇప్పుడు గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్లకు మరింత గిరాకీ కనిపిస్తున్నది.

బంగారాన్ని భౌతిక రూపంలో కొనడం దగ్గర్నుంచి.. డిజిటల్‌లో ఇన్వెస్ట్ చేసేదాకా మార్కెట్‌లో ఎన్నో మార్పులు వచ్చాయి. దీంతో పసిడిపై మదుపు చేసేందుకు నేడు అనేక రకాల ప్లాన్లున్నాయి. వీటిలో ప్రభుత్వ పూచీకత్తు పథకాలతోపాటు ప్రైవేట్ వేదికల్లోనూ పెట్టుబడులకు కొదవే లేకుండా పోయింది. మరి ఆ అవకాశాలేంటో చూద్దాం.

సావరిన్ గోల్డ్ బాండ్లు (ఎస్‌జీబీలు)

వీటికి ప్రభుత్వ పూచీకత్తు ఉంటుంది. పెరిగే బంగారం ధరల లాభాలకుతోడు 2.5 శాతం వార్షిక వడ్డీరేటూ బాండ్లలో మీరు పెట్టిన పెట్టుబడులకు వర్తిస్తుంది. దీన్ని దీర్ఘకాలిక పెట్టుబడులకు చక్కని ఆప్షన్‌గా చూడవచ్చు. మెచ్యూరిటీ గరిష్ఠ కాలపరిమితి 8 ఏండ్లదాకా ఆగితే మూలధన లాభాల పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్బీఐ వీటిని జారీ చేస్తుంది.

గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్‌లు)

స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఇవి ట్రేడ్ అవుతాయి. డీమ్యాట్ ఖాతా ద్వారా వీటిల్లో పెట్టుబడులు పెట్టవచ్చు. ఎక్కువ రాబడి, తక్కువ లావాదేవీ ఖర్చులు వీటి ప్రత్యేకత. స్వల్పకాలిక ట్రేడింగ్‌కు అనువైనవి. అయితే మార్కెట్ రిస్కులకు లోబడి రాబడులుంటాయి.

డిజిటల్ గోల్డ్

24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) బంగారాన్ని చిన్నచిన్న మొత్తాల్లో (రూపాయి మొదలు) ఆన్‌లైన్ వేదికగా స్వల్పకాలిక లక్ష్యాల కోసం కొనుగోలు చేయవచ్చు. సెక్యూర్డ్ వాల్ట్‌లలో నిల్వ చేస్తారు. కావాల్సినప్పుడు భౌతిక బంగారంగా మార్చుకోవచ్చు లేదా అమ్ముకోవచ్చు.

గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్

గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఈ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు పెడుతాయి. డీమ్యాట్ ఖాతాతో పనిలేకుండా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను నడిపించాలని చూసే మదుపరులకు ఇవి అనువైనవి.

భౌతిక బంగారం (నగలు/నాణేలు/కడ్డీలు)

బంగారం నగలు, నాణేలు, కడ్డీలనూ కొని పెట్టుబడిగా చూసుకోవచ్చు. వీటి నిల్వ రిస్క్‌తో కూడిన వ్యవహారం. అలాగే తయారీ, తరుగు చార్జీలు, జీఎస్టీ భరించాలి.

గోల్డ్ సేవింగ్స్ స్కీమ్స్

మార్కెట్‌లోని ప్రముఖ జ్యుయెల్లర్స్ ఈ పథకాలను నడిపిస్తున్నారు. నెలనెలా ఏడాదిపాటు నిర్ణీత మొత్తాల్లో చెల్లిస్తే.. ధరల్లో డిస్కౌంట్ లేదా బోనస్‌తో బంగారు నగలను కొనుక్కునే వెసులుబాటును కల్పిస్తున్నారు.

వెండిపై పెట్టుబడుల కోసం..

బంగారంతోపాటు ఇటీవలికాలంలో వెండిపైనా పెట్టుబడులకు చాలామంది ఆసక్తి కనబరుస్తున్నారు. మరి వెండిపై పెట్టుబడులకున్న మార్గాలేంటో పరిశీలిస్తే..

సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు

తక్కువ ఖర్చుకే ఎక్కువ నాణ్యత కలిగిన సిల్వర్‌ను సొంతం చేసుకోవచ్చు. 99.9 స్వచ్ఛతతో స్టాక్ ఎక్స్ఛేంజీలపై ఇవి ట్రేడ్ అవుతాయి.

సిల్వర్ ఫండ్ ఆఫ్ ఫండ్స్

డీమ్యాట్ ఖాతా లేకుండా వీటిలో పెట్టుబడులకు వీలుంటుంది. సిల్వర్ ఈటీఎఫ్ ప్రదర్శనను ట్రాక్ చేసేందుకు మంత్లీ సిప్‌లకు అనుమతి ఉంటుంది.

కడ్డీలు/నాణేలు/నగలు

ఇవి భౌతిక పెట్టుబడులు. అయితే నిల్వ, భద్రత, స్వచ్ఛత సంబంధిత ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. 99.9 స్వచ్ఛతను పరిశీలించి కొనాలి.

డిజిటల్ సిల్వర్

యాప్‌ల ద్వారా చిన్నచిన్న మొత్తాల్లో (రూపాయి మొదలు) కొనుగోలు చేయవచ్చు. నిల్వ సమస్యలుండవు. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత)తో విక్రయాలు జరుగుతాయి.





ఆంటోనెలి కొత్త చరిత్ర

షాంఘై: చైనీస్ గ్రాండ్‌పి రేసులో ఇటలీ యువ రేసర్ కిమీ ఆంటోనెలి కొత్త చరిత్ర లిఖించాడు. ఆదివారం జరిగిన రేసులో 19 ఏండ్ల ఆంటోనెలి టైటిల్ విజేతగా నిలిచాడు. ఎఫ్1 చరిత్రలో రేసు గెలిచిన రెండో యంగెస్ట్ డ్రైవర్‌గా ఆంటోనెలి రికార్డుల్లోకెక్కాడు. 2016లో 18 ఏండ్ల వయసులో టైటిల్ గెలిచిన మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ముందు వరుసలో ఉన్నాడు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన రేసులో ఆంటోనెలి గంటా 33 నిమిషాల 15.607 సెకన్లలో పోడియం ఫినిష్ చేయగా, జార్జ్ రస్సెల్, లూయిస్ హామిల్టన్ వరుసగా రెండు, మూడు స్థానాలతో పోడియం ఫినిష్ చేశారు. మరోవైపు అమెరికా, ఇరాన్ యుద్ధం కారణంగా ఏప్రిల్ 12, 19వ తేదీల్లో జరుగాల్సిన బహ్రెయిన్, సౌదీ అరేబియా గ్రాండ్ ప్రి రేసులను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



దక్షిణాఫ్రికా బోణీ

మౌంట్ మౌంగనుయి(న్యూజిలాండ్): న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో దక్షిణాఫ్రికా అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన తొలి టీ20 పోరులో సఫారీలు 7 వికెట్ల తేడాతో కివీస్‌పై ఘన విజయం సాధించారు. కివీస్ నిర్దేశించిన 92 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 16.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. టోనీ డీ జార్జ్(2), హెర్మన్(7) విఫలమైనా కానర్ ఎస్తర్‌జెన్(45) రాణించడంతో గెలుపు వాకిట నిలిచింది. జెమీసన్, ఫౌల్క్స్, సాంట్నర్ ఒక్కో వికెట్ తీశారు. తొలుత మోకెనా (3/26), కొట్జె (2/14), బార్ట్‌మన్ (2/22), మహారాజ్ (2/25) ధాటికి కివీస్ 14.3 ఓవర్లలో 91 పరుగులకు కుప్పకూలింది. జేమ్స్ నీషమ్ (26) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. మోకెనాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

గిల్, మంధాన మెరిసె

అత్యుత్తమ క్రికెటర్ అవార్డులు కైవసం • ద్రవిడ్, బిన్నీ, మిథాలీరాజ్‌కు లైఫ్‌టైమ్ అవార్డులు • వరల్డ్‌కప్ టీమ్‌లకు బీసీసీఐ ఘన సత్కారం







న్యూఢిల్లీ: బీసీసీఐ వార్షిక అవార్డుల వేడుక అట్టహాసంగా జరిగింది. అతిరథ మహారథుల సమక్షంలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో క్రికెటర్లు సందడి చేశారు. 2025-26 సీజన్‌లో ఏకంగా ఐదు ఐసీసీ ట్రోఫీలతో కొత్త చరిత్ర లిఖించిన భారత క్రికెటర్ల ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది. ఇందుకు తోడు దేశ క్రికెట్‌కు ఎనలేని సేవలు అందించిన దిగ్గజ ప్లేయర్లు రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్, మిథాలీరాజ్‌ను బీసీసీఐ ఘనంగా సన్మానించింది. కండ్లు మిరుమిట్లు గొలిపే రీతిలో 'నమన్' అవార్డుల వేడుక యువకులు, అనుభవజ్ఞుల కలయికగా జరిగింది. గత సీజన్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన టీమ్‌ఇండియా వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్‌గిల్‌తో పాటు మహిళల క్రికెట్‌లో తన కంటూ ప్రత్యేకతను లిఖించుకున్న స్మృతి మంధాన అంతర్జాతీయ అత్యుత్తమ క్రికెటర్ల అవార్డులు కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా కెప్టెన్‌గా తొలిసారి ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో గిల్ అంచనాలకు మించి రాణించాడు. సిరీస్‌లో పది ఇన్నింగ్స్‌లో 75.40 సగటుతో 754 పరుగులు చేసి టోర్నీ టాపర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లను వారి సొంతగడ్డపైనే దీటుగా నిలువరిస్తూ సిరీస్ 2-2తో డ్రా కావడంలో కీలకంగా వ్యవహరించాడు. ఇంగ్లిష్ పిచ్‌లపై అంతగా ఆడిన అనుభవం లేకపోయినా దిగ్గజాల గైర్హాజరీలో గిల్ దుమ్మురేపాడు. తన దూకుడైన బ్యాటింగ్‌తో ఓ డబుల్ సెంచరీ(269) సహా నాలుగు సెంచరీలు ఖాతాలో వేసుకున్నాడు. గతేడాది దుబాయ్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలోనూ గిల్ అదరగొట్టాడు. వన్డేల్లో నంబర్‌వన్ ర్యాంక్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన గిల్..బంగ్లాదేశ్‌పై అజేయ సెంచరీ(101 నాటౌట్) సహా టోర్నీలో 188 పరుగులతో టీమ్‌ఇండియా ట్రోఫీ విజయంలో కీలకమయ్యాడు. పాలీ ఉమ్రిగర్ అవార్డు విజేతగా నిలిచిన గిల్ స్పందిస్తూ 'ఈ అవార్డు కోసం బీసీసీఐ నన్ను గుర్తించినందుకు ధన్యవాదాలు. ఎంతో మంది దిగ్గజ క్రికెటర్లు ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. దీన్ని దక్కించుకోవడం చాలా గర్వంగా భావిస్తున్నా. ఇది నా ఒక్కని వల్ల సాధ్యం కాలేదు, సహచరుల సహకారంతో అవార్డు పొందగలిగాను. నన్ను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు అందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నాడు. మరోవైపు రికార్డు స్థాయిలో ఐదో సారి మహిళల బెస్ట్ ఇంటర్నేషనల్ క్రికెటర్ అవార్డు మంధాన సొంతమైంది. 2025 సీజన్‌లో మంధాన 1703 పరుగులు చేసింది. ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్‌గా మంధాన అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. 'ఇది నాకు ఎంతో ప్రత్యేకం. జట్టు సహకారం లేకుండా వ్యక్తిగత రికార్డుల గురించి మాట్లాడం సరైంది కాదు. నా కెరీర్‌లో ఇది అద్భుతమైన ఏడాది. అవార్డుకు ఎంపిక చేయడంతో పాటు మహిళా క్రికెట్ అభివృద్ధికి తోడ్పడుతున్న బీసీసీఐకి ధన్యవాదాలు' అని మంధాన అంది.

చాంపియన్ టీమ్‌లకు సత్కారం

గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ కేటగిరీల్లో భారత క్రికెట్ జట్లు ఐదు ఐసీసీ ట్రోఫీలు కైవసం చేసుకోవడం విశేషం. 2025 మహిళల అండర్-19 ప్రపంచకప్‌తో మొదలుపెడితే ఆ తర్వాత పురుషుల చాంపియన్స్ ట్రోఫీ, మహిళల వన్డే ప్రపంచకప్, 2026లో అండర్-19 ప్రపంచకప్, పురుషుల టీ20 వరల్డ్‌కప్ సభ్యులను బీసీసీఐ ఘనంగా సన్మానించింది. ఆయా జట్లలో సభ్యులైన క్రికెటర్లు జ్ఞాపికలు అందుకున్నారు. తాజాగా టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమ్‌ఇండియా క్రికెటర్లు కప్‌తో ఫొటోకు ఫోజులు ఇచ్చారు. మరోవైపు మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన హైదరాబాదీ గొంగడి త్రిష ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది.

అవార్డుల వివరాలు

షెఫాలీవర్మ
(బెస్ట్ వుమన్ సీనియర్ క్రికెటర్-దేశవాళీ వన్డే)

ఇరా జాదవ్
(బెస్ట్ వుమన్ క్రికెటర్- దేశవాళీ)

హర్ష్‌దూబే
(బెస్ట్ ఆల్‌రౌండర్-రంజీ ట్రోఫీ)

ఆయూశ్ మాత్రె
(బెస్ట్ ఆల్‌రౌండర్-దేశవాళీ పరిమిత ఓవర్ల ఫార్మాట్)

దిగ్గజాలకు సన్మానం

దేశ క్రికెట్‌కు సేవలందించిన రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్‌కు బీసీసీఐ అత్యున్నత పురస్కారం కర్నల్ సికే నాయుడు అవార్డు దక్కగా, హైదరాబాదీ దిగ్గజం మిథాలీరాజ్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో మెరిసింది.

తెలంగాణకు కాంస్యం

సౌత్‌జోన్ త్రోబాల్ చాంపియన్‌షిప్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తిరుపతి వేదికగా జరిగిన 17వ సౌత్‌జోన్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు కాంస్యం దక్కింది. ఆదివారం జరిగిన పోరులో తెలంగాణ పురుషుల జట్టు 15-9, 15-7తో కేరళపై అద్భుత విజయంతో కాంస్యం ఖాతాలో వేసుకుంది. ధీరజ్, నితిన్ సాగర్..జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారు. అంతకుముందు జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో తెలంగాణ 15-12, 15-11తో కర్ణాటకపై, పుదుచ్చేరిపై 15-6, 15-9తో గెలిచి ముందంజ వేసింది. అయితే కీలకమైన సెమీస్‌లో మన టీమ్ 11-15, 10-15తో తమిళనాడు చేతిలో ఓడి కాంస్య పోరుకు అర్హత సాధించింది. మరోవైపు మహిళల జట్టు లీగ్ దశ దాటకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. జట్టు సభ్యులను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిరణ్ చారి అభినందించారు.

శ్రీలంక క్రికెట్ టోర్నీకి భరత్‌రెడ్డి

అభినందించిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



హుజూర్‌నగర్, మార్చి 15: సాధించాలన్న పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని హుజూర్‌నగర్ యువకుడు బొబ్బ భరత్ రెడ్డి చేతల్లో చూపెట్టాడు. సూర్యాపేట జిల్లా నుంచి క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ప్రస్తుతం నల్లగొండ క్రికెట్ అసోసియేషన్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న భరత్‌రెడ్డి ఈనెల 15వ తేదీ నుంచి శ్రీలంకలో మొదలయ్యే అంతర్జాతీయ స్థాయి టీ20, వన్డే టోర్నీలకు ఎంపికయ్యాడు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన భరత్‌రెడ్డి తల్లిదండ్రులు భాస్కర్‌రెడ్డి, నిర్మల క్రికెట్‌లో అతన్ని ప్రోత్సహిస్తూ వచ్చారు. డిగ్రీ పూర్తి చేసిన భరత్ గత ఏడేండ్లుగా బుచ్చిబాబు, ఇంద్రశేఖర్‌రెడ్డి దగ్గర శిక్షణ తీసుకుంటున్నాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరపున ఇప్పటి వరకు వివిధ టోర్నీలు ఆడిన భరత్ 100కు పైగా వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. టీమ్ ఇండియా స్టార్ బౌలర్ సిరాజ్‌ను ఆదర్శంగా తీసుకునే భరత్ భవిష్యత్‌లో జాతీయ జట్టుతో పాటు ఐపీఎల్‌లో ఆడటమే లక్ష్యంగా సాధన కొనసాగిస్తున్నారు. శ్రీలంకలో జరిగే టోర్నీ కోసం వెళుతున్న భరత్‌రెడ్డిని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. క్రికెట్‌లో అద్భుత ప్రతిభతో తెలంగాణతో పాటు దేశానికి మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

సెల్వ ప్రభుకు రజతం




న్యూఢిల్లీ: అమెరికా వేదికగా జరిగిన ఎన్‌సీఏఏ ఇండోర్ చాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ సెల్వ ప్రభు రజత పతకంతో మెరిశాడు. ఆదివారం జరిగిన పురుషుల ట్రిపుల్‌జంప్ ఫైనల్లో సెల్వ ప్రభు 17.05మీటర్ల ఎత్తు దూకి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. వరల్డ్ అథ్లెటిక్స్ అండర్-20 టోర్నీ రజత విజేత అయిన ప్రభు జాతీయ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన ప్రభు రెండో స్థానంలో నిలిచి సత్తాచాటాడు. జాతీయ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఏఎఫ్‌ఐ) కఠినమైన డోపింగ్ నిబంధనలతో అథ్లెట్లు తమ జాతీయ రికార్డుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.

హెచ్‌సీఏ కోశాధికారిగా అనిల్‌కుమార్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో కోశాధికారి ఎన్నిక పూర్తయ్యింది. ఆదివారం ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఎన్నికలో కోశాధికారిగా అనిల్‌కుమార్ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి హరినారాయణరావుపై రెండు ఓట్ల స్వల్ప తేడాతో గెలిచారు. పోలింగ్‌లో మొత్తం 175 మంది ఓటర్లకు గాను 153 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో అనిల్‌కుమార్‌కు 61 ఓట్లు, హరినారాయణరావుకు 59 ఓట్లు రాగా, ఆగంరావుకు 27 ఓట్లు, బాబురావుకు 6 ఓట్లు పోల్ అయ్యాయి. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఎన్నికల అధికారి వీఎస్ సంపత్ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. కార్యదర్శి పదవికి ఏకగ్రీవంగా ఎన్నికైన మన్నె జీవన్‌రెడ్డితో పాటు కోశాధికారి అనిల్‌కుమార్‌కు ఆయన ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఇదిలా ఉంటే గతంలో కార్యదర్శి, కోశాధికారిగా దేవరాజ్, సీజే శ్రీనివాసరావు పదవీకాలం ముగియడంతో రెండు స్థానాల కోసం ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చిన సంగతి తెలిసిందే.

వేగం కంటే క్వాలిటీ ముఖ్యం



మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్లో నటిస్తూ యువహీరోల్లో తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపుని తెచ్చుకున్నారు ఆనంద్ దేవరకొండ. ముఖ్యంగా 'బేబీ' సినిమా ఆయన కెరీర్‌లోనే ఓ మైలురాయి అని చెప్పక తప్పదు. ప్రస్తుతం ఎపిక్, డ్యూయెట్ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారాయన. ఆదివారం ఆనంద్ దేవరకొండ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వేగంగా సినిమాలు చేయడం కంటే క్వాలిటీగా సినిమాలు చేసేందుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. చేసే ప్రతి పాత్రకూ వేరియేషన్, ఎంచుకునే ప్రతి కథకూ స్ట్రాంగ్ కంటెంట్ ఉండేలా చూసుకుంటున్నాను. నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో ఓ మంచి స్థానాన్ని సంపాదించుకోవడమే నా లక్ష్యం' అన్నారు ఆనంద్ దేవరకొండ. సితార ఎంటర్‌టైన్మెంట్స్‌లో తాను చేస్తున్న 'ఎపిక్' సినిమా ఒక విభిన్నమైన ప్రేమకథ అని, కేవలం ప్రమోషనల్ కంటెంట్‌తోనే ఈ సినిమా ఆడియన్స్‌లో బజ్‌ని క్రియేట్ చేయడం చాలా ఆనందంగా ఉందని, దర్శకుడు ఆదిత్యహాసన్ ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారని ఆనంద్ తెలిపారు. అలాగే మిథున్ వరదరాజ కృష్ణన్ దర్శకత్వంలో తాను చేస్తున్న 'డ్యూయెట్' సినిమా కూడా చాలా కొత్తగా ఉంటుందని ఆనంద్ పేర్కొన్నారు.



నమో నమో నారాయణే..

ప్రసిద్ధ దేవాలయాలు, నేలమాళిగలు, నిధి నిక్షేపాలు.. తదితర అంశాల మేళవింపుగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమా వేసవిలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా 'నమోరే.. నమో నమోరే.. నమో నమో నారాయణే..' అంటూ సాగే భక్తిరసాత్మక గీతాన్ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. ఆధ్యాత్మికత, కళాత్మకత ప్రతిబింబించేలా ఈ పాట రూపొందింది. విష్ణుదేవుని స్తుతిగా తయారైన ఈ గీతాన్ని శ్రీహర్ష ఈమని రాయగా, జునైద్‌కుమార్, అభే స్వరపరిచారు. సింధూజా శ్రీనివాసన్, ఐశ్వర్య దారూరి ఆలపించారు. గణేశ్ ఆచార్య, శ్రేష్టి వర్మ కొరియోగ్రఫీ అందించారు. రెండువేలమంది నర్తకీమణులు ఈ పాటలో భాగమయ్యారు. నభ నటేష్, దక్ష నగార్కర్ హావభావాలు, నాట్యవిన్యాసాలు పాటకు ఆకర్షణగా నిలిచాయి. తిరువనంతపురం పద్మనాభస్వామి ఆలయాన్ని తలపించేలా కళాదర్శకుడు అశోక్‌కుమార్ వేసిన సెట్ పాటకు నిండుదనాన్ని తెచ్చింది. ఈ చిత్రానికి నిర్మాణం: NIK స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్.

ఉత్కంఠభరితంగా సుయోధన

'ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. కథలోని సుయోధన క్యారెక్టర్ కోసం మేమంతా ఏకగ్రీవంగా అనుకున్న పేరు సాయికుమార్. ఒక మనిషి సుయోధన, దుర్యోధన అని ఎందుకు పిలవబడతాడు అనేదే ఈ కథలో ఆసక్తికరమైన పాయింట్' అని హీరో ప్రియదర్శి అన్నారు. ఆయన నటించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'సుయోధన'. ద్రిషిక చందర్ కథానాయిక.



సాయికుమార్, ప్రేమ కీలక పాత్రధారులు. వైఎస్ మాధవ రెడ్డి దర్శకుడు. బోసుబాబు నిడుమోలు నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో ప్రియదర్శి మాట్లాడారు. ఇదొక విభిన్నమైన కాన్సెప్టని దర్శకుడు వైఎస్ మాధవరెడ్డి చెప్పారు. ఈ సినిమాలో నటించిన తమకే ఈ సినిమా చూస్తున్నప్పుడు నెక్స్ట్ ఏంటి అనే క్యూరియాసిటీ కలిగిందని సాయికుమార్ నమ్మకంగా చెప్పారు. ఇంకా చిత్ర బృందమంతా మాట్లాడారు.



ప్రేమలోని అంతర్యాన్ని తెలిపేలా

'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో నిర్మాతగా తన అభిరుచిని చాటిన నిహారిక కొణిదెల.. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'రాకాస'. సంగీత్‌శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. మానసశర్మ దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఈ సినిమా నుంచి 'పదే పదే..' అంటూ సాగే పాటని హైదరాబాద్‌లోని సెయింట్ పీటర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో విద్యార్థుల సమక్షంలో రిలీజ్ చేశారు. ప్రేమకై ప్రాధేయపడకూడదని, మనమే ప్రేమలా మారిపోవాలని, అదే ఈ పాటలోని అంతర్యమని నిహారిక చెప్పారు. ఇంకా సంగీత్ శోభన్, నయన్ సారిక, సంగీత దర్శకుడు అనుదీప్ దేవ్ కూడా మాట్లాడారు.

హోంబలే సినిమాలు అవేనట?



పానిండియా రెబల్‌స్టార్ ప్రభాస్‌తో ప్రతిష్టాత్మక చిత్రనిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మూడు సినిమాలు నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ప్రభాస్‌కు భారీ మొత్తంలో అడ్వాన్స్‌ను కూడా వారు అందించినట్టు ఓ వార్త కొన్ని రోజుల క్రితం మీడియాను షేక్ చేసింది. అయితే, ఆ మూడు సినిమాలు ఏంటి? దర్శకులెవరు? అనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. తాజా సమాచారం ప్రకారం ఈ వ్యవహారంపై క్లారిటీ వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ మూడు సినిమాల్లో మొదటిది 'సలార్2: శౌర్యాంగపర్వం'. ప్రభాస్‌తో హోంబలే వారే 'సలార్' చిత్రాన్ని నిర్మించారు. ఆ సినిమా భారీ సక్సెస్ సాధించింది. ప్రభాస్‌తో వారు కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ముందు నిర్మించే సినిమా 'సలార్ 2' అని తెలిసింది. ఇక రెండో సినిమా.. మలయాళంలో కిష్కింధకాండ, ఏకో చిత్రాలను తెరకెక్కించిన దింజిత్ అయ్యథాన్ దర్శకత్వంలో ఉంటుందట. దీనికి సంబంధించిన కథను కూడా సదరు దర్శకుడు సిద్ధంచేశారట. అలాగే 'అమరన్'ఫేం రాజ్‌కుమార్ పెరియసామి కూడా ఇటీవలే ప్రభాస్‌కి ఓ కథ వినిపించారట. దాదాపు ప్రభాస్‌తో హోంబలే నిర్మించే మూడు సినిమాలు ఇవే అవుతాయని వినికిడి. అయితే ప్రభాస్ మాత్రం ప్రస్తుతం స్పిరిట్, ఫౌజీ, కల్కి 2 షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. అవి పూర్తయితే తప్ప నెక్ట్స్ కమిట్‌మెంట్స్ గురించి ఆయన ఆలోచించలేరు.

తనకు నటన రాదని చెప్పాను

తండ్రి అంచనాలను తల్లకిందులు చేయడమే కాకుండా, తండ్రికి కావాల్సినంత పుత్రికోత్సాహాన్ని కూడా అందించింది మలయాళ మందారం కల్యాణి ప్రియదర్శన్. మలయాళ దిగ్దర్శకుడు ప్రియదర్శన్ గారాలపట్టి అయిన కల్యాణికి, అసలు యాక్టస్ అవ్వాలనే ఆలోచనే లేదట. ఆర్కిటెక్ట్ కావాలనేది ఆమె డ్రీమ్ అట. అయితే.. అనుకోకుండా నటిగా మారింది. అంతేకాదు, తానే ప్రధాన పాత్రగా రూపొందిన లేడీ ఓరియెంటెడ్ థ్రిల్లర్ 'కొత్త లోక'తో బాక్సాఫీస్ వద్ద సన్సేషన్ క్రియేట్ చేసి, దాదాపు



300కోట్ల వసూళ్లను కొల్లగొట్టింది. దక్షిణాదిన ఓ లేడీ ఓరియెంటెడ్ సినిమాకు ఈ స్థాయిలో వసూళ్లు రావడం ఓ రికార్డ్. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. కల్యాణి నటిగా మారింది తెలుగు సినిమాతోనే. అది ఎలా జరిగిందో ప్రియదర్శన్ చెబుతూ 'కల్యాణి సినిమాల్లో రాణిస్తుందని నేనస్సలు అనుకోలేదు. సెట్స్‌కి రావడానికి కూడా తను ఇష్టపడేది కాదు. కేరళంలో పెరగకపోవడంతో తనకు మలయాళం కూడా సరిగ్గా రాదు. ఆర్కిటెక్ట్ కావడం ఆమె గోల్. అయితే.. ఓ రోజు అక్కినేని నాగార్జున నాకు కాల్ చేశారు. తన కుమారుడు అఖిల్ హీరోగా రూపొందుతున్న 'హలో' సినిమాలో హీరోయిన్‌గా కల్యాణిని అడిగారు. తనకు నటన రాదని కరాఖండీగా చెప్పేశాను. అయితే.. కల్యాణి మాత్రం చేస్తానంది. 'ఒక్కసారి ట్రై చేస్తా నాన్నా.. పోయేదేముంది.. కుదరకపోతే ఆర్కిటెక్ట్‌గా నా ప్రయత్నాలు నాకెలాగూ ఉన్నాయికదా..' అని నచ్చజెప్పింది. దాంతో తప్పక ఒప్పుకున్నా. కానీ నా అంచనాలు తారుమారు చేస్తూ పెద్ద స్టార్‌గా ఎదిగింది. ఈ విషయంలో నా కూతుర్ని చూస్తుంటే గర్వంగా ఉంటుంది' అన్నారు ప్రియదర్శన్.





ఈ సారి వచ్చేది ఉస్తాద్ ఉగాది

'ఎవరి సినిమా అయినా బాగా ఆడాలనే కోరుకుంటాన్నేను. ఓ ప్రజాప్రతినిధిగా టికెట్ రేట్లు విషయంలోనూ నేను వివక్ష చూపలేదు. నన్నడిగితే.. టికెట్ రేట్లు పెంచమని ప్రభుత్వాలను ప్రత్యేకంగా అడగాల్సిన అవసరం లేదు. పెంచకపోతే బ్లాక్ మార్కెట్ పెరుగుతుంది. అందుకే.. టికెట్ రేట్ల విషయంలో ఎవరు పెంచమని అడిగినా మేం కాదనలేదు. చివరకు కన్నడ సినిమా 'కాంతారా2'కు కూడా టికెట్లు పెంచుకునే అవకాశం ఇచ్చాం. సినిమా బావుండాలి. అందరూ చూడాలి. అందులో మన సినిమాలు కూడా ఉండాలని కోరుకుంటాన్నేను' అన్నారు అగ్రహీరో పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా రూపొందిన ప్రెస్టేజియస్ యాక్షన్ డ్రామా 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. ఇంకా చెబుతూ 'ఈ సినిమా బాగా రావడానికి కారణం హరీశ్‌శంకర్. నా కాలం తాలూకు విలువను అర్థం చేసుకొని నన్ను ముందుకు నడిపించాడు తను. 45రోజుల్లో సినిమా పూర్తి చేశాడు. సినిమాలు చేయాలా వద్దా అనే మీమాంసలో ఉన్న నాకు, ఈ ప్లానింగ్‌తో ముందుకెళ్తే సినిమాలు చేయొచ్చని నమ్మకాన్నీ, ధైర్యాన్నీ ఇచ్చాడు. తను తెలంగాణ బిడ్డ. కరీంనగర్ నుంచి వచ్చిన వ్యక్తి. అద్భుతమైన పాండిత్యం గల గొప్ప దర్శకుడు. ఈ సినిమాకోసం తను పడ్డ తపన సామాన్యమైనది కాదు. ఈ సినిమాని అందరూ మెచ్చేలా తను తీర్చిదిద్దారు. మా తప్పు లేకుండా సినిమా చేశాం. బెస్ట్ ఎఫర్ట్ పెట్టాం. తుది తీర్పు ప్రేక్షకులదే' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. 'కల్యాణ్‌గారి సినిమా అనగానే పనిచేసిన వారంతా ప్రాణం పెట్టేశారు. కమిట్మెంట్ ఉన్నోడికే కటౌట్ ఉంటది. ఆ కటౌట్ జనం గుండెల్లో ఉంటది. అందుకు నిలువెత్తు నిదర్శనం పవన్‌కల్యాణ్. నా గుండెలో పవన్‌కల్యాణే, గుండె బయట పవన్‌కల్యాణే. నా గుండె ధైర్యం కూడా పవన్‌కల్యాణే. ఒక అభిమానిగా సినిమా చేశా. ఈసారి మార్చి 19న వచ్చేది ఉస్తాద్ ఉగాది. రాసుకోండి' అని దర్శకుడు హరీష్‌శంకర్ నమ్మకంగా చెప్పారు. ఇంకా చిత్రబృందంతోపాటు పార్థిబన్, టీజీ విశ్వప్రసాద్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

హాలీవుడ్ లెవల్లో బైకర్



'బలమైన భావోద్వేగాలుండే అద్భుతమైన స్క్రిప్ట్ 'బైకర్' ' అంటున్నారు సంగీత దర్శకుడు జిబ్రాన్. ఆయన సంగీతం అందిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామాకు హీరో శర్వానంద్. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు జిబ్రాన్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'శర్వానంద్ 'రన్ రాజా రన్'తోనే సంగీత దర్శకుడిగా పరిచయం అయ్యాను. మళ్లీ ఆయనతో పనిచేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా మేకింగ్ హాలీవుడ్ లెవల్లో ఉంటుంది. ప్రతి క్రీడాకారుడి కుటుంబంలో ఉండే ఎమోషన్సే ఇందులో కనిపిస్తాయి. ఇదొక తండ్రీ కొడుకుల కథ. రేసింగ్‌నీ, ఎమోషన్స్‌ని దర్శకుడు బాగా బ్లెండ్ చేశాడు. సినిమా బాగా వచ్చింది. ముఖ్యంగా రేసింగ్ సన్నివేశాలు ఆడియన్‌ని సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడతాయ్. ఇలాంటి సినిమాకు ఎలాంటి మ్యూజిక్ అవసరమో అలా బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించాం' అని చెప్పారు జిబ్రాన్. రేసింగ్ టైమ్‌లో సౌండ్ ఎక్కువగా ఉంటుందని, దానివల్ల మ్యూజిక్ వినిపించకుండా పోకూడదని ఓ కొత్త టెక్నాలజీని ఉపయోగించి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చేశామని, శర్వా పర్‌ఫార్మెన్స్ ఇందులో నెక్ట్స్ లెవల్లో ఉంటుందని, దర్శకుడు అభిలాష్ క్లారిటీతో ఈ సినిమాను తెరకెక్కించారని, ప్రస్తుతం తమిళంలో 'లీడర్'అనే సినిమా కూడా చేస్తున్నానని జిబ్రాన్ తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఐదు అసెంబ్లీలకు మోగిన నగారా

కేరళ, అస్సాం, పుదుచ్చేరికి ఏప్రిల్ 9న, తమిళనాడుకు 23న ఒకే దశలో పోలింగ్

బెంగాల్‌కు రెండు విడతల్లో ఎన్నికలు

ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్

మే 4న అన్ని రాష్ట్రాల ఫలితాలు ప్రకటన

షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం



ఆదివారం న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్

న్యూఢిల్లీ, మార్చి 15: దేశంలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. పశ్చిమబెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం షెడ్యూల్ ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే విడతలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరుగనున్నాయి. తమిళనాడులో కూడా ఒక దశలో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగనుంది. పశ్చిమ బెంగాల్‌కు మాత్రం రెండు విడతల్లో ఏప్రిల్ 23, 29న ఎన్నికలు జరుగనున్నాయి. మే 4న అన్ని రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ ఐదు రాష్ట్రాలు, యూటీల్లోని మొత్తం 824 శాసనసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని, 17.4 కోట్ల మంది ఓటర్లు ఓటు వేయనున్నారని వెల్లడించారు. ఎన్నికల్లో పారదర్శకత పెంచేందుకు గత ఏడాది కాలంలో ఈసీ అనేక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. అందులో భాగంగానే, అర్హుడు కాని ఏ ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితాలో ఉండకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) చేపట్టినట్టు వివరించారు. అలాగే మొబైల్ ఫోన్లను పోలింగ్ కేంద్రాల వెలుపల ఉంచుతామని, ఓటింగ్ తర్వాత వాటిని తీసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఈ రాష్ట్రాల్లో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

ఈవీఎంల కంటే ముందే బ్యాలెట్ కౌంటింగ్ పూర్తి

ఓట్ల కౌంటింగ్‌లో పారదర్శకత పెంచేందుకు పలు చర్యలు చేపట్టినట్టు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఈవీఎం కౌంటింగ్ పూర్తయ్యే రెండు రౌండ్లకు ముందే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తి చేస్తామని చెప్పారు. కౌంటింగ్ పూర్తయిన 72 గంటల్లోగా, ఎన్నికలకు సంబంధించిన మొత్తం గణాంకాలను ఈసీఐనెట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లలో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుందని చెప్పారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ గడువు మే 7న, తమిళనాడు మే 10, అస్సాం మే 20, కేరళ మే 23, పుదుచ్చేరి అసెంబ్లీ గడువు జూన్ 15న ముగియనున్నది. బెంగాల్‌లో 6.4 కోట్ల మంది , తమిళనాడులో 5.67 కోట్లు, కేరళలో 2.7 కోట్లు, అస్సాంలో 2.5 కోట్లు, పుదుచ్చేరిలో 9.44 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.

8 అసెంబ్లీ స్థానాలకు బైపోల్స్

ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలతోపాటే పలు రాష్ట్రాల్లో శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్టు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపురలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న, గుజరాత్, మహారాష్ట్రలోని మూడు శాసనసభ స్థానాలకు ఏప్రిల్ 23న పోలింగ్ జరుగనున్నట్టు చెప్పారు. మే 4న ఫలితాలు ప్రకటించనున్నట్టు వెల్లడించారు.

అస్సాం

ఈశాన్య రాష్ట్రం అస్సాంలో గత పదేండ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నది. హిమంత బిశ్వశర్మ ముఖ్యమంత్రిగా ఉన్నారు. మూడోసారి అధికారంలోకి రావాలని పార్టీ భావిస్తున్నది. ఈసారి 100కుపైగా సీట్లలో నెగ్గాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రధాని మోదీ గత ఆరు నెలల్లో మూడు సార్లు రాష్ట్రంలో పర్యటించారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీజేపీ.. తీవ్ర ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. బంగ్లాదేశ్ చొరబాటుదారులు, బహిష్కరణలు, సరిహద్దు భద్రత వంటి అంశాలు ఎన్నికల్లో ప్రభావం చూపనున్నాయి. రాష్ట్రంలో మళ్లీ పూర్వ వైభవం తెచ్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నది. అయితే పార్టీ ఫిరాయింపులు ఆ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారాయి.

మొత్తం అసెంబ్లీ స్థానాలు -126
మెజార్టీ -64
గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
బీజేపీ-60
కాంగ్రెస్-29
ఇతరులు-37

పశ్చిమబెంగాల్

మొత్తం సీట్లు-294, మెజార్టీ మార్క్-147
గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
టీఎంసీ-213, బీజేపీ -77, ఇతరులు-2

ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధిస్తే, మమతా బెనర్జీ వరుసగా నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టిస్తారు. ఇంతకుముందు దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఐదుసార్లు సీఎంగా ప్రమాణం చేశారు. అయితే ఆమె 1991-2006 మధ్య వేర్వేరు సమయాల్లో సీఎంగా ఉన్నారు. వరుసగా ముఖ్యమంత్రిగా లేరు. మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా ఉన్నది. సర్‌తో ఓట్లను తొలగిస్తున్నారని, రాష్ట్రానికి నిధులు విడుదల చేయట్లేదని, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఎగదోస్తున్నారని, గవర్నర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి అడ్డంకులు సృష్టిస్తున్నారని బీజేపీపై మమత విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో అధికారంలోకి రావాలని బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతున్నది. వామపక్షాలు, కాంగ్రెస్ ఉనికి కోసం పోరాడుతున్నాయి.

తమిళ నాడు

మొత్తం సీట్లు-234, మెజార్టీ మార్క్-118
గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
డీఎంకే +:159,అన్నాడీఎంకే+:75, ఇతరులు: 0

గత 60 ఏండ్లలో బీజేపీ కానీ, కాంగ్రెస్ కానీ అధికారంలోకి రాని ఏకైక రాష్ట్రం ఇది. ఇప్పటివరకు డీఎంకే, అన్నాడీఎంకే మధ్యే ప్రధాన పోటీ సాగుతుండగా, తాజాగా నటుడు విజయ్ రంగ ప్రవేశంతో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. జయలలిత నెచ్చెలి శశికళ కూడా కొత్త పార్టీ పెట్టారు. వరుసగా రెండోసారి అధికారంలోకి వస్తామని డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్ ధీమాగా ఉన్నారు. మాజీ సీఎం పన్నీర్‌సెల్వంను పార్టీలోకి చేర్చుకున్నారు. మరోవైపు ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని అన్నాడీఎంకే భావిస్తున్నది. ప్రత్యామ్నాయ శక్తిగా మారుతామంటూ రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్.. ఏ మేరకు ప్రభావం చూపుతాడో చూడాలి. విజయ్‌ను ఎన్డీయే కూటమిలోకి చేర్చుకునేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలూ చేస్తున్నది. ఇందులో భాగంగా ఆయనకు డిప్యూటీ సీఎం పదవిని ఆఫర్ చేసినట్టు సమాచారం.

పుదుచ్చేరి


2021లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత, ఏఐఎన్‌ఆర్‌సీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్ రంగస్వామి మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వంలో బీజేపీ నేరుగా భాగస్వామ్యం కావడం ఇదే తొలిసారి. డీఎంకేతో పొత్తు కుదుర్చుకున్న కాంగ్రెస్ ఈ సారి ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తున్నది. ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవాలని పట్టుదలగా ఉన్నది .

మొత్తం అసెంబ్లీ సీట్లు-30
మెజార్టీ -16
గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
ఎన్డీయే-16
యూడీఎఫ్-9
ఇతరులు-5

కేరళ

మొత్తం స్థానాలు-140, మెజార్టీ మార్క్-71
గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
ఎల్డీఎఫ్-99,యూడీఎఫ్-41, ఇతరులు-0

దేవభూమి కేరళలో ఇదివరకు ప్రతి ఐదేండ్లకొకసారి ప్రభుత్వం మారే సంప్రదాయం ఉండేది. అయితే 2021లో సీఎం విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రండ్(ఎల్డీఎఫ్) ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేసింది. వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. ముచ్చటగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని ఉవ్విళ్లూరుతున్నది. పదేండ్లుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)కు ఈ ఎన్నికలు చావోరేవోగా మారాయి. ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తున్నది. మరోవైపు, బీజేపీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క అసెంబ్లీ సీటులో కూడా విజయం సాధించలేదు. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం త్రిసూర్ స్థానంలో గెలుపొందింది.



మరో జలసంధి మూసివేత?

- బాబ్ అల్-మండెబ్ జలసంధిని మూసివేస్తామని హౌతీల హెచ్చరిక
- హొర్ముజ్ మూసివేతతో ఇప్పటికే సంక్షోభంలో ప్రపంచ దేశాలు
- ఇదీ మూసేస్తే తీవ్ర పరిణామాలు

న్యూఢిల్లీ: అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో చమురు, గ్యాస్ రవాణాకు అత్యంత కీలకమైన హొర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన నేపథ్యంలో భారత్ సహా అనేక దేశాలపై తీవ్ర ప్రభావం పడింది. చమురు ధరలు మండుతున్నాయి. దేశంలో ఎల్పీజీ సంక్షోభం తలెత్తింది. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో మరో పిడుగులాంటి వార్త ప్రపంచ దేశాలను కలవరపరుస్తున్నది. ఇంధన రవాణాకు కీలకమైన మరో జలసంధి బాబ్ అల్-మండెబ్‌ను మూసివేస్తామని యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు హెచ్చరించడం ఆందోళన కలిగిస్తున్నది. ఇదే జరిగితే, ప్రపంచం మరింత సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయమని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేస్తున్న క్రమంలో హౌతీలు కూడా యుద్ధంలోకి దిగుతారా? అని సర్వత్రా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్ పెంచి పోషించిన యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు యుద్ధంలోకి దిగితే, కీలకమైన జలమార్గం బాబ్ అల్ మండెబ్‌ను మూసివేయడం ఖాయమనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ యుద్ధం విషయంలో ఇప్పటివరకు ఆచితూచి వ్యవహరించిన హౌతీలు తాజాగా కీలక ప్రకటన చేశారు. తమ వేళ్లు ట్రిగ్గర్‌పై ఉన్నాయని హెచ్చరించారు. పరిణామాలు చేయి దాటితే, తాము కూడా యుద్ధంలోకి దిగుతామని ప్రకటించారు.

ఎందుకు ఈ జలసంధి కీలకం?

బాబ్ అల్ మండెబ్ అంటే గేట్ ఆఫ్ టియర్స్ (కన్నీటి ద్వారం) అని అర్థం. ఇది ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్, హిందూ మహాసముద్రంతో కలుపుతుంది. యూరప్, ఆసియా మధ్య సూయజ్ కాలువ గుండా వెళ్లే ఏ నౌక అయినా ఈ జలసంధిని దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ జలసంధి గుండా వెళ్లకపోతే, కేప్ ఆఫ్ గుడ్ హోప్ గుండా అవి వెళ్లాల్సి ఉంటుంది. అలా వెళ్తే, 20-25 రోజుల ఆసియా-యూరప్ ప్రయాణం కాస్తా 30-40 రోజులకు పెరుగుతుంది. సుమారు 12% ప్రపంచ వాణిజ్యం, 10% ఆయిల్, ఎల్‌ఎన్‌జీ రవాణా ఈ కారిడార్ ద్వారానే జరుగుతుంది.

మూసేస్తే ఏంటి పరిస్థితి?

ఒకవేళ బాబ్ అల్ మండెబ్ జలసంధిని హౌతీలు మూసేస్తే, ప్రపంచ వాణిజ్యంపై పెను ప్రభావం పడనున్నది. ఇప్పటికే హొర్ముజ్ జలసంధి మూసివేతతో ఆయిల్ ఎగుమతులకు అంతరాయం ఏర్పడి ధరలు భారీగా పెరిగాయి. బాబ్ అల్ మండెబ్‌లో ఎలాంటి అస్థిరత పరిస్థితులు నెలకొన్నా, కంటెయినర్ షిప్పింగ్‌పై ప్రభావం పడి ఇంధన ధరలు మరింతగా పెరుగుతాయి. అంతేగాకుండా గ్లోబల్ సప్లయ్ చెయిన్ కూడా తెగిపోతుంది. ఆసియా, యూరప్ మధ్య రవాణా అయ్యే ఎలక్ట్రానిక్స్, మెషినరీ, ఆహార ఉత్పత్తులు, కన్జ్యూమర్ గూడ్స్ సరఫరాలో జాప్యం ఏర్పడుతుంది. రవాణా ఖర్చులు పెరుగుతాయి.



బెంగళూరులోని ఓ హోటల్‌లో కట్టెల పొయ్యితో వంట చేస్తున్న సిబ్బంది

వాణిజ్య సిలిండర్@5,000!

- గృహవినియోగ సిలిండర్ రూ. 3,500
- దేశంలో పెచ్చరిల్లిన బ్లాక్ మార్కెట్ దందా
- ఎక్కడ చూసినా చాంతాడంత క్యూలే
- 8 గంటలు నిల్చున్నా సిలిండర్ దొరకని దుస్థితి
- ఆగ్రాలో మూతపడనున్న స్వీట్ పరిశ్రమ



న్యూఢిల్లీ, మార్చి 15: దేశంలో వంట గ్యాస్ సంక్షోభం రోజురోజుకు ముదురుతుండటంతో బ్లాక్‌మార్కెట్ దందా కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నది. మధ్యప్రదేశ్, యూపీ, పంజాబ్, చండీగఢ్, హర్యానా, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల్లో గ్యాస్ ఏజెన్సీలు, గోడౌన్ల ముందు పెద్దయెత్తున వినియోగదారులు బారులు తీరి ఉంటున్నారు. గ్యాస్ కొరతను ఆసరాగా తీసుకుని బ్లాక్‌మార్కెటీర్లు రెచ్చిపోతున్నారు. రూ. 950 గృహ వినియోగ సిలిండర్‌ను రూ.3,500కు, రూ.2,000 వాణిజ్య సిలిండర్‌ను రూ.5,000కు బ్లాక్‌లో అమ్ముతున్నారు. పంజాబ్‌లోని చండీగఢ్‌లో వినియోగదారులు ఉదయం 4.30 గంటలకే గ్యాస్ ఏజెన్సీ ముందు లైన్‌లో నిలుచుంటున్నారు. జలంధర్, అమృత్‌సర్‌లో గ్యాస్ ఏజెన్సీల వద్ద తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడగా, చండీగఢ్‌లో పోలీసుల పర్యవేక్షణలో గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు కూడా గ్యాస్ కోసం గంటల తరబడి లైన్లలో వేచి ఉంటున్నారు. ఒక పక్క ఎండ నెత్తిని మాడ్చేస్తుండగా, 8 గంటల పాటు క్యూలోనే పడిగాపులు కాసినా సిలిండర్ దొరకలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

హర్యానాలో డీజిల్ సంక్షోభం

ఒక పక్క వంట గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడగా హర్యానాలో హఠాత్తుగా డీజిల్ సంక్షోభం ఏర్పడింది. చాలామంది తమ అవసరాలకు మించి డీజిల్‌ను కొని నిల్వ చేస్తుండటంతో క్రమంగా కొరత ఏర్పడింది. ఈ క్రమంలో వాహనదారుల అవసరానికి మించి డీజిల్, సీఎన్‌జీ అమ్మవద్దంటూ పెట్రోల్ పంపు ఆపరేటర్లను ప్రభుత్వం ఆదేశించింది.

ఆగ్రాలో స్వీట్ పరిశ్రమకు గడ్డుకాలం

ఆగ్రాలోని స్వీట్ పరిశ్రమకు గడ్డుకాలం ప్రారంభమైంది. వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల సరఫరాను నిలిపివేయడంతో ఈ పరిశ్రమ కుదేలైంది. ఇక్కడ బూడిద గుమ్మడితో తయారు చేసే ప్రసిద్ధ పేఠా స్వీట్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. ఇప్పటికే గ్యాస్ కొరతతో పలు తయారీ యూనిట్లను మూసివేశారు. గ్యాస్ సరఫరాను పునరుద్ధరించకపోతే పరిశ్రమను మూసేయాల్సి ఉంటుందని అంటున్నారు.

పీఎన్‌జీ ఉంటే ఎల్పీజీ కట్

పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. తాజాగా సవరించిన నిబంధనల ప్రకారం పీఎన్‌జీ కనెక్షన్ ఉన్నవారికి ఎల్పీజీ కొత్త కనెక్షన్ ఇవ్వడం కానీ, వారి పాత సిలిండర్‌లోకి గ్యాస్ నింపడం కానీ చేయరు. అంతేకాక, వారి ఎల్పీజీ సిలిండర్‌ను ప్రభుత్వానికి అప్పగించాలి. ఒకే ఇంటిలో పీఎన్‌జీ, ఎల్పీజీ కనెక్షన్ ఉండటం చట్టవిరుద్ధంగా భావిస్తారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా గ్యాస్ బుక్ చేయాలంటే తమ పాత గ్యాస్ సిలిండర్ సరఫరా తేదీకి, ప్రస్తుతం బుక్ చేస్తున్న తేదీకి పట్టణంలో అయితే 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 45 రోజుల వ్యవధి ఉండాలి.

గల్ఫ్ దేశాలపై దాడులు ఉధృతం

- యూఏఈపై విరుచుకుపడ్డ ఇరాన్
- దుబాయ్‌లో భారీ పేలుళ్లు
- కువైట్ ఎయిర్‌పోర్టుపైనా దాడి
- నెతన్యాహు మరణిస్తే.. నేనెవరిని?
- మరణవార్తలకు తెరదించిన నెతన్యాహు
- బతికే ఉంటే వేటాడి చంపుతాం
- నెతన్యాహును హెచ్చరించిన ఇరాన్



ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను ఐరన్ డోమ్‌తో పేల్చివేస్తున్న ఇజ్రాయెల్

టెహ్రాన్/కైరో: పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం లేదు. యుద్ధం ఆదివారం 16వ రోజుకు చేరుకుంది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ముమ్మరం చేసింది. యూఏఈ నుంచి అమెరికా తమపై దాడులు చేసిందని ఆరోపించిన ఇరాన్.. యూఏఈపై ప్రతిదాడులు ముమ్మరం చేసింది. యూఏఈలోని మూడు ప్రధాన పోర్టులను ఖాళీచేయాలని ఇప్పటికే హెచ్చరికలు జారీచేసింది. ఆదివారం వేకువజామున దుబాయ్‌లోని మెరీనా, అల్ సుఫోహ్ ఏరియాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను తమ దేశ గగనతల రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకుందని, అందుకు సంబంధించిన శబ్దాలే ఇవని దుబాయ్ మీడియా ఆఫీస్ వెల్లడించింది. కువైట్ ఎయిర్‌పోర్టుపైనా ఇరాన్ డ్రోన్ల వర్షం కురిపించింది. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. యూఏఈపై ఇరాన్ ఇప్పటివరకు 1800 మిస్సైళ్లు, డ్రోన్లను ప్రయోగించింది. ఇందులో 1600 డ్రోన్లు, 294 బాలిస్టిక్ క్షిపణులు, 15 క్రూయిజ్ క్షిపణులు ఉన్నాయి. ఈ దాడుల్లో ఆరుగురు మరణించగా, 140 మందికిపైగా గాయపడ్డారు.

నెతన్యాహు మరణిస్తే.. మరి నేనెవరిని?



ఇరాన్ జరిపిన దాడుల్లో తాను మరణించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కొట్టివేశారు. చేతిలో కాఫీ గ్లాస్‌తో కన్పించిన ఒక వీడియో మెసేజ్‌లో ఆయన కాఫీ తాగుతూ, తన మరణంపై జరుగుతున్న ప్రచారాన్ని ఎగతాళి చేశారు. నెతన్యాహు ఇటీవల జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి మరణించారని, ఆయన ఇటీవల టెలివిజన్‌లో కల్పించినది ఫేక్ అని, అది ఏఐ ద్వారా సృష్టించినదంటూ సామాజిక మాధ్యమంలో విస్తృతంగా ప్రచారం జరిగింది. దీనిపై నేరుగా స్పందించిన నెతన్యాహు ఒక వీడియో విడుదల చేస్తూ తాను బతికే ఉన్నానని, తన విధి నిర్వహణలో నిమగ్నమై ఉన్నానని తెలిపారు. నెతన్యాహు చనిపోయారంటున్నారు.. మరి నేను ఎవరిని? అని ఆయన సరదాగా ప్రశ్నించారు. నేను కాఫీ తాగడానికి చనిపోయాను అని హాస్యంగా అన్నారు. ఈ వీడియోలో ఆయన కాఫీకి ఆర్డర్ ఇవ్వడం, తన మరణంపై వస్తున్న వదంతులపై జోక్ చేయడం కన్పించింది. మరణించే వరకు దేశాన్ని ప్రేమిస్తుంటానని పేర్కొన్న ఆయన, ఈ సంక్షోభ సమయంలో ప్రజల సహకారాన్ని మరువలేనని ప్రశంసించారు.

బతికే ఉంటే.. వేటాడి చంపుతాం

నెతన్యాహు మరణ వార్తలపై ఇరాన్ కూడా స్పందించింది. ఆయన బతికే ఉంటే.. వేటాడి చంపుతామని హెచ్చరించింది. ఇజ్రాయెల్‌పై 16వ రోజు కూడా దాడులను కొనసాగించింది 'పిల్లల ఉసురు తీసిన హంతకుడు నెతన్యాహు బతికే ఉంటే అతడిని వేటాడి చంపుతాం' అని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ఓ ప్రకటనలో హెచ్చరించింది.

భారత నౌకకు తృటిలో తప్పిన ప్రమాదం

యూఏఈ లోని ఫుజైరా పోర్టుపై శనివారం ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో భారత్‌కు చెందిన ఒక చమురు నౌక త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకుంది. జాగ్ లాడ్కీ పేరు గల ఈ నౌక దాడి జరిగిన సమయంలో పోర్టులోని క్రూడ్ ఆయిల్ టెర్మినల్ వద్ద చమురును ఎగుమతి చేసుకుంటున్నది. అయితే ఈ దాడిలో నౌకకు, సిబ్బందికి ఎలాంటి నష్టం జరగలేదు. దీంతో ఈ నౌక ఆదివారం ఉదయం 10.30 గంటకు ప్రయాణమయ్యింది.

9/11 తరహా దాడులకు కుట్ర

ఇరాన్ రక్షణ శాఖ ఉన్నతాధికారి ఒకరు అమెరికాపై తీవ్ర ఆరోపణ చేశారు. బాలల లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్ నెట్‌వర్క్‌లో మిగిలిన సభ్యులు అమెరికాలో సెప్టెంబర్ 11 తరహా దాడులు చేయడానికి, దానికి ఇరాన్‌ను బాధ్యునిగా చేసేందుకు కుట్ర పన్నారని ఇరాన్ సుప్రీం నేషనల్ కౌన్సిల్ కార్యదర్శి అలీ లారిజానీ ఆరోపించారు.

అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే బంద్

హొర్ముజ్ జలసంధిపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి కీలక ప్రకటన చేశారు. జలసంధి చాలా వరకు నౌకలకు తెరిచే ఉందని, అమెరికా, ఇజ్రాయెల్, వాటి మిత్ర దేశాలకే మూసివేసినట్టు వెల్లడించారు. ఇతర దేశాల నౌకలు ఈ కీలక మార్గం గుండా వెళ్లేందుకు అనుమతిస్తున్నట్టు చెప్పారు. నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తమ దాడుల్లో తీవ్రంగా గాయపడ్డాడని అమెరికా చేస్తున్న ప్రకటనలపై ఆయన స్పందిస్తూ.. ఆయన క్షేమంగా ఉన్నారని స్పష్టంచేశారు.

డ్యాన్సింగ్ మిస్సైల్ ప్రయోగించిన ఇరాన్

ఇజ్రాయెల్‌తో పాటు యూఎస్ సైనిక స్థావరాలు లక్ష్యంగా దాడులు జరుపుతున్న ఇరాన్ సెజ్జిల్ క్షిపణి అలియాస్ డ్యాన్సింగ్ క్షిపణితో పాటు అధునాతన క్షిపణుల శ్రేణిని ఆదివారం ప్రయోగించింది. యుద్ధం మొదలైన తర్వాత తొలిసారి ప్రయోగించిన సెజ్జిల్ క్షిపణి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. దాదాపు రెండువేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాన్ని ఛేదించగల ఈ క్షిపణి 700 కిలోల పేలోడ్‌ను మోసుకుపోగలదు. దీని యుక్తి సామర్థ్యం కారణంగా దీనికి డ్యాన్సింగ్ క్షిపణి అనే మారు పేరు వచ్చింది.

ఫార్మాపై ఎల్పీజీ పిడుగు!

- ఆగిపోనున్న పారాసిటమాల్, సిరంజీలు, గ్లవ్స్ ఉత్పత్తి
- ఎంఎస్‌ఎంఈలకు ఎల్పీజీ సరఫరాలో కేంద్రం కోతలు
- 10 రోజుల్లో ఫార్మా మార్కెట్‌పై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా ఎల్పీజీ, పెట్రోరసాయనాల సరఫరాపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఫార్మసీ, వైద్య పరికరాల తయారీ పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా పారాసిటమాల్ వంటి సాధారణ మందులతోపాటు గ్లవ్స్‌లు, సిరంజీలు వంటి వైద్య ఉత్పత్తుల తయారీపై కూడా ప్రభావం పడుతున్నది. కొవిడ్ మహమ్మారి సమయంలో మాదిరిగానే వీటిని అత్యవసర వస్తువులుగా పరిగణిస్తూ వీటి తయారీ కొనసాగడానికి మినహాయింపులను కోరుతూ కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ, పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ, రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ కింద పనిచేసే ఫార్మాస్యూటికల్స్ విభాగానికి పారిశ్రామిక సంఘాలు లేఖ రాశాయి.

మందులపై ఎల్పీజీ ప్రభావం

ఫార్మాస్యూటికల్ పరిశ్రమకు ఎల్పీజీ, పీఎన్‌జీ సరఫరాలో అంతరాయం కాని, కోతలు కాని ఉండరాదని కోరుతూ ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, ఇండియన్ డ్రగ్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా ఆంత్రప్రెన్యూర్స్ సంబంధిత మంత్రిత్వశాఖలకు వినతిపత్రాలను సమర్పించాయి. వీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం జరిగినా దాని ప్రభావం వెంటనే దేశానికి, ప్రపంచానికి అవసరమైన కీలక మందుల తయారీపై పడుతుందని, మందుల తయారీలోని అనేక కీలక ప్రక్రియల్లో ఈ వాయువులను ఉపయోగిస్తారన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని తెలిపాయి.

పెట్రోరసాయనాల వాడకం

గృహవినియోగదారులకు సరఫరా చేసేందుకు ఎల్పీజీ ఉత్పత్తిని పెంచి కొన్ని పెట్రోరసాయనాల సరఫరాను తగ్గించాలన్న ప్రభుత్వ ఉత్తర్వు కారణంగా అనేక ముఖ్యమైన మందులు, వైద్య పరికరాల ఉత్పత్తి ఆగిపోనున్నది. అనేక సాధారణ మందులలో పైపూతకు అవసరమైన ఇసోప్రోపైల్ ఆల్కహాల్(ఐపీఏ) గ్రేడ్ ఫార్మకోపియా ఉత్పత్తి కోసం అవసరమైన రిఫైనరీ గ్రేడ్ ప్రాపిలీన్‌కు అత్యవసరంగా కొరత ఏర్పడనున్నది. తమ వద్ద ఉన్న ప్రాపిలీన్ నిల్వలు ముగిసిన తర్వాత మరో వారం లేదా 10 రోజుల్లో దాదాపు 200 తయారీదారులు తమ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసే అవకాశం ఉందని సెంటర్ ఫర్ డొమెస్టిక్ ఎకానమీ పాలసీ రిసెర్చ్(సీడీఈపీ) ఫార్మాస్యూటికల్ విభాగానికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నది. జాతీయ అత్యవసర ఔషధాల జాబితాలో పొందుపరిచిన కనీసం 14 చికిత్సా విభాగాల్లోని మందుల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందని సీడీఈపీ అధ్యక్షుడు డాక్టర్ జైబిత్ భట్టాచార్య తెలిపారు. బెంజీన్ సరఫరాలో అంతరాయం ఫలితంగా సాధారణ జ్వరానికి వాడే పారాసిటమాల్‌తోసహా అనేక క్రియాశీల మందుల తయారీని ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు.



క్రాస్ ఓటింగ్ చేస్తే రూ.5 కోట్లు!

- రాజ్యసభ ఎన్నికల కోసం బీజేపీ ప్రలోభాలు
- డీకే శివకుమార్ వెల్లడి

బెంగళూరు, మార్చి 15: రాజ్యసభ ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఓటు వేయాలని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బెంగళూరులో ఉన్న ఒడిశా ఎమ్మెల్యేలకు రూ.5 కోట్ల చొప్పున ఇవ్వడానికి ప్రయత్నించారని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. ఇది కచ్చితంగా బీజేపీ నిర్వహించిన ఆపరేషన్ లోటస్‌యేనని ఆయన విమర్శించారు. ఈ ఉదంతంలో లంచం ఇవ్వడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. క్రాస్ ఓటింగ్ కోసం నేతలను ప్రలోభ పెట్టడానికే వచ్చామని వారు అంగీకరించారని డీకే వివరించారు.